www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 211 | సోమవారం | 21 జనవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



3



యాగస్థలాన్ని పరిశీలిస్తున్న సిఎం కెసిఆర్, పక్కనే ఎంపి సంతోష్ కుమార్, రాజకీయ కార్యదర్శి శేరి సుభాష్ రెడ్డి

నేటి నుంచి చతుర్వేద సహిత మహారుద్ర సహస్ర చండీయాగం

ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో వేద పండితులతో 300మంది రుత్విక్కులతో నిర్వహించనున్న సిఎం కెసిఆర్


25న పూర్ణాహుతి

పంచాయతీ ఎన్నికల పోలింగ్

నేడే తొలివిడత

ఫలితాల ప్రకటన కూడా ఈ రోజే

- 3701 పంచాయతీలు, 28,976 వార్డులు
- సర్పంచ్ పదవికి బరిలో 12,202 మంది
- 34 వేల పోలింగ్ స్టేషన్‌లలో 70 వేల మంది సిబ్బంది, 750 కేంద్రాలలో వెబ్‌క్యాస్టింగ్
- ఉ.7-మ.1వరకు పోలింగ్
- వెంటనే ఓట్ల లెక్కింపు



మన తెలంగాణ/హైదరాబాద్

మొదటి విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. 3701 పంచాయతీలకు, 28,962 వార్డులకు సోమవారం ఉదయం 7 గంటల నుంచి తరువాయి 6లో

దేశానికి

దారిదీపం మనమే

మాది 100% రైతు ప్రభుత్వం

రైతు సంక్షేమంలో కాంగ్రెస్ టిడిపిలు దొందూ దొందే

రానున్న ఆర్థిక సంవత్సరం నుంచి హామీల అమలు

- ఓటాన్‌అకౌంట్ బడ్జెట్ పెడతాం
- అభివృద్ధిపై రూ.5లక్షల కోట్లు పెడతాం
- రూ.10లక్షల కోట్లు రాబడి సాధిస్తాం
- కేంద్రం ఒక్క రూపాయి ఇయ్యాలె
- తండాలు, గూడెంలకు బిటి రోడ్లు
- ఉన్నత విద్యలో ప్రైవేటు భాగస్వామ్యం
- సమగ్ర అధ్యయనం తర్వాతే రుణమాఫీ
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చలో సిఎం కెసిఆర్

మన తెలంగాణ/హైదరాబాద్

టిఆర్‌ఎస్ ప్రభుత్వం నాలుగేళ్ళలో ఆచరించిన, అనుసరించిన, అవలంబించిన విధానాల వల్లనే ప్రజలు తాజా ఎన్నికల్లో అఖండ విజయాన్ని ఇచ్చారని, విశ్వాసం ఉంచిన ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన, మేనిఫెస్టోలో పేర్కొన్న వాగ్దానాలను వందకు వంద శాతం నెరవేరుస్తామన్నారు. వ్యవసాయ రంగంలో, రైతు సంక్షేమం విషయంలో తెలంగాణ ప్రభుత్వ ఆచరణ యావత్తు దేశానికే దిక్సూచి (టార్చ్ బేరర్)గా నిలిచిందని, రైతుబంధు రైతుబీమా లాంటి పథకాలు ఎన్నో రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని అన్నారు. తమది వంద శాతం రైతు ప్రభుత్వమన్నారు. హామీల అమలులో కాంగ్రెస్ నిలదీసే ధోరణి మంచిది కాదని, పాత ఆచరణను విడనాడి ప్రజానుగుణంగా నడుచుకునే ధోరణిని అలవర్చుకోవాలని, సహనాన్ని నేర్చుకోవాలని హితవు పలికారు. భూ రికార్డుల నిర్వహణ, రైతు సంక్షేమం విషయంలో గత ప్రభుత్వాలైన కాంగ్రెస్, తెలుగుదేశంలో నిర్లక్ష్యంగా వ్యవహరించాయని, టిఆర్‌ఎస్ ప్రభుత్వం మాత్రం సాహసోపేతంగా నిర్ణయం తీసుకుని వంద రోజుల్లోనే రాష్ట్రంలోని 94% భూముల రికార్డుల నిగ్గు తేల్చిందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నింటినీ రానున్న ఆర్థిక సంవత్సరం నుంచే అమలు చేస్తామని, ఇందులో ఎలాంటి సందేహం అవసరంలేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టులకు తొలి ప్రాధాన్యత తరువాయి 6లో

నిరుద్యోగ భృతిపై అన్ని పార్టీలతో చర్చించి నిర్ణయం

వృద్ధాప్య, ఆసరా, వితంతు, బీడీ వంటి పెంచిన పింఛన్‌లు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచే అమలు చేస్తామన్నారు. నిరుద్యోగ భృతికి మాత్రం నాలుగు నుంచి ఆరు నెలల సమయం తీసుకుంటుందని, దీనిపై సమగ్ర అధ్యయనం అవసరమన్నారు. అన్నీ పార్టీలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.





ప్రజలు మెచ్చేలా సభ నిర్వహణ

- రూల్స్ ఉల్లంఘిస్తే చర్యలు
- సమయం అమూల్యం
- ప్రతీ మాట విలువైనది
- ప్రజల పట్ల బాధ్యతను గుర్తెరిగి నడుచుకుందాం
- మీడియాతో నూతన స్పీకర్

మన తెలంగాణ/ హైదరాబాద్

తాజా ఎన్నికల్లో ప్రజలు విశ్వాసంతో ఎన్నుకుని సభకు పంపడంతో సభలోకి అడుగుపెట్టినవారే తప్ప వారసత్వంగా పదవుల్లోకి తరువాయి 6లో

ఓపిక, ఓర్పు ముఖ్యం



- మైనింగ్, చెట్ల నరికివేత సమాజానికి చేటు
- ప్రకృతిని కాపాడుకుందాం 10
- యువ నాయకత్వ సదస్సులో గవర్నర్ నరసింహన్ ఉద్బోధ

కొత్త సృష్టిపై దృష్టి

యువత నూతన అవిష్కరణలపై దృష్టి పెట్టాలి



మహిళాభివృద్ధికి పురుషులు సహకరించాలి

అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సు ముగింపు సభలో ఎంపి కవిత

మన తెలంగాణ/హైదరాబాద్: మహిళలు సాధికారిత సాధించేందుకు పురుషులు సహకరించాలని జాగృతి వ్యవస్థాపకులు, ఎంపి కల్వకుంట్ల కవిత కోరారు. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలను ఆ స్థాయిలో తరువాయి 6లో

వాల్‌కు సహకరిస్తే అక్రమ

వలసలపై కరుణ

- కాంగ్రెస్‌కు ట్రంప్ ప్రతిపాదన
- జాతినుద్దేశించి ప్రసంగం
- ప్రతిపాదనకు డెమోక్రాట్లు నో



వాషింగ్టన్: దేశంలో నెలకొన్న షట్‌డౌన్ గడ్డుపరిస్థితి నివారణకు అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రతిపాదన చేశారు. ఆదివారం వైట్‌హౌస్ నుంచి ఆయన జాతి నుద్దేశించి ప్రసంగించారు. టీవీల ద్వారా తరువాయి 12లో

రిసార్టులో కొట్టుకున్న కర్ణాటక కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు 12

సిఎల్‌పికి గైర్హాజరైన నలుగురికి నోటీసులు

ఆధార్‌తో నేపాల్, భూటాన్ వెళ్లొచ్చు

ప్రయాణపత్రంగా ఉపయోగించుకోవచ్చు

కేంద్ర హోంశాఖ ప్రకటన 12

కుంచెపోటు



కీచక మాల్ యజమాని

కుమార్తెను లైంగికంగా వేధించి తన వద్దకు పంపించమని కోరడంతో తల్లి ఆత్మహత్య

హైదరాబాద్ శివారు మైలార్‌దేవ్‌పల్లిలో దారుణం



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో

షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న ఓయువతిని మాల్ యజమాని లైంగికంగా వేధించడంతో మనస్తాపం చెంది తల్లి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నగర శివారులోని మైలార్‌దేవ్‌పల్లిలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం నగరంలోని పాతబస్తీకి చెందిన కన్యాకుమారి (45) భర్త చనిపోవడంతో ముగ్గురు కుమార్తెలను తీసుకుని బతుకు దెరువు కోసం మైలార్‌దేవ్‌పల్లికి వచ్చింది. రెండో కూతురు కాటేదాన్‌లోని మౌనిక తరువాయి 6లో

శంషాబాద్‌లో రెండు కిలోల

బంగారం పట్టివేత

లిబియా తీరంలో వలసదారుల పడవలు మునిగి 10

170 మంది గల్లంతు

శబరిమల ఆలయం మూసివేత

నిరాదరణకు గురైన వ్యక్తులను ఆదరించడమే మానవత్వం : పోచారం



మన తెలంగాణ / హైదరాబాద్ : సమాజంలో నిరాదరణకు గురైన వ్యక్తులను ఆదరించడం గొప్ప మానవత్వమని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. డాక్టర్ లూయిస్ బ్రెయిలీ 210 జయంతి సందర్భంగా స్థానిక సరూర్‌నగర్‌లోని కర్మన్‌ఘాట్‌లో ఆదివారం సాయంత్రం వికలాంగుల కళ్యాణ వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, తాను ఇక్కడకు స్పీకర్ హోదాలో రాలేదని, ఒక వ్యక్తిగా మాత్రమే వచ్చానని అన్నారు. వికలాంగుల పట్ల చిన్నచూపు ఉండే నేటి రోజుల్లో కళ్యాణ వేదిక సంస్థ ఒక దేవాలయంగానూ, దాని నిర్వాహకులు సుభాష్ గుప్త దంపతులు మానవత్వం కలిగినదేవుళ్ళుగానూ సేవలందిస్తున్నారన్నారు. స్వలాభాపేక్ష లేకుండా సేవచేసే ఇలాంటి మానవతావాదులు అరుదుగా ఉంటారని, కళ్ళు లేనివారికి వసతి సౌకర్యాలు కల్పించడంతోపాటు చదువును, ఆ తర్వాత ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తున్నారని, ఇది ఎంతో మంది జీవితాలను నిలబట్టె నిస్వార్థ సేవ అని వ్యాఖ్యానించారు. వారికి వివాహాలు కూడా చేసి స్వంతంగా కాళ్ళపై నిలబడే విధంగా అండగా ఉంటున్నారని, కులమతాలకు అతీతంగా దివ్యాంగులకు సేవ చేయడంలో ఉన్న తృప్తి మరేదాంట్లోనూ ఉండదన్నారు. మనం మన కోసం, పిల్లలు, కుటుంబం కోసం చేసుకుంటున్నామని, కానీ ఈ దంపతులు మాత్రం ఏ సాయాన్నీ అందుకోలేని నిర్భాగ్యులకు అండగా ఉంటున్నారని అన్నారు. ప్రాంతాలకు అతీతంగా ఏ రాష్ట్రానికి చెందినవారైనా 'అందరూ మనవాళ్ళే, మన తెలంగాణ వారే' అనే దృక్పథంతో అక్కున చేర్చుకుని గడచిన పదేళ్ళుగా సేవలందిస్తున్నారని, ఎంతో మందికి ఇది స్ఫూర్తిదాయకమన్నారు.

న్యాయమూర్తుల సమస్యల పరిష్కారానికి కృషి

జస్టిస్ రాజేంద్ర ప్రసాద్



మన తెలంగాణ/సిటీబ్యూరో : ఆల్ ఇండియా జడ్జీస్ అసోసియేషన్ అన్ని రాష్ట్రాల్లో ఉన్న జడ్జీల సమస్యలపై పని చేస్తుందని అసోసియేషన్ అధ్యక్షుడు జస్టిస్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. రాష్ట్రంలో జడ్జీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆదివారం హైదరాబాద్ అబిడ్స్‌లోని ఓ హోటల్‌లో ఐదుగురు న్యాయమూర్తులు సమావేశమై చర్చించారు. కింది స్థాయి కోర్టులు ఇచ్చిన తీర్పులు కేవలం పేపర్లకు మాత్రమే పరిమితమవుతున్నాయని అఖిల భారత జడ్జీల అసోసయేషన్ అధ్యక్షుడు జస్టిస్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. అంతిమంగా కోర్టు తీర్పు కీలకంగా మారిందన్నారు. 1976 నుండి ఇప్పటి వరకు భారత జ్యుడిషియల్ వ్యవస్థలో ఎలాంటి మార్పు రాలేదని పేర్కొన్నారు. హై కోర్ట్ జడ్జీల నియామకంలో కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్టు మధ్య వివాదం కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణ న్యాయశాఖ అధికారులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లా కోర్టులలో ప్రజలకు న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని కల్పించవల్సిన అవసరం ఉందన్నారు. మెట్రో రైలు, విమానాశ్రయాలు అభివృద్ధి చెందినా ఒరిగేది ఏమి లేదని.. ప్రజలకు న్యాయం దక్కాలన్నారు. న్యాయమూర్తులపై జరుగుతున్న ఏసీ బీ సోదాలపై హైకోర్టు, సుప్రీం కోర్టు చూసుకుంటుందని అందులో మే ము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేశారు. సమావేశంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జస్టిస్ వసంత్, జస్టిస్ నాథని, జస్టిస్ అజిత్‌సింగ్ పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

మన తెలంగాణ/హైదరాబాద్: హెరిటేజ్ తెలంగాణ ఆధ్వర్యంలో 'దక్షిణాపథంలో సామ్రాజ్యాలు... తెలంగాణ' అన్న అంశంపై జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో జరిగిన ఈ సదస్సులో పలువురు జాతీయ, అంతర్జాతీయ చరిత్రకారులు, పరిశోధకులు పాల్గొన్నారు. తెలంగాణ కోణానికి విస్తృత చారిత్రక వైభవాన్ని అందించే దిశలో జరిగిన సదస్సుగా విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఆదివారం నాడు దక్షిణాపథంలో సామాజిక, ఆర్థిక పరిస్థితులు, చరిత్ర నుంచి వర్థమానాన్ని చదవడం, చెరువులు, పట్టణాలు, శాసనాలు, పురావస్తు అధ్యయనం తదితర అంశాలపై పరిశోధకులు తమ పత్రాలను సమర్పించారు. హెరిటేజ్ తెలంగాణ డైరెక్టర్ ఎన్ ఆర్ విశాలాక్షి ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సు ముగింపుకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బిపి ఆచార్య, పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం అతిథులుగా హాజరయ్యారు. చివరలో గురు కళాకృష్ణ బృందం చేసిన పేరిణి నృత్యం ఆహుతులను విశేషంగా ఆకర్శించింది.

ఖనిజ సంపదను కాపాడుకోవాలి

కేంద్ర గనుల శాఖ డైరెక్టర్ ప్రితుల్ కుమార్ పిలుపు

మన తెలంగాణ/ హైదరాబాద్ : జాతీయ ఆదాయంలో కీలకమైన గనులు, ఖనిజ సంపదను కాపాడుకోవాల్సి ఉందని కేంద్ర గనుల శాఖ డైరెక్టరు ప్రితుల్ కుమార్ పిలుపునిచ్చారు. గనుల భద్రతపై హైదరాబాద్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఆదివారం ఒకరోజు జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు హాజరైన ప్రితుల్ కుమార్ మాట్లాడుతూ గనులు, ఖనిజాలు సంపద సృష్టించి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని చెప్పారు. దేశ జిడిపిలో 2.3 శాతం ఖనిజ సంపద ద్వారానే లభిస్తోందన్నారు. దీన్ని మరింత పెంచుకోవాలంటే అక్రమ, అనధికార గనుల తవ్వకాలపై దృష్టిపెట్టాల్సి ఉందని సూచించారు. అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకు పోలీసు శాఖను కూడా సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రైవేటు, ప్రభుత్వ గనుల్లో భద్రతపై నిర్లక్ష్యం వహిస్తే వైపరీత్యాలు, ఆపదలు తప్పవని హెచ్చరించారు. గనుల తవ్వకాల కోసం ధ్వంసం చేసిన అడవులను తప్పనిసరిగా పునరుద్ధరించాలని తెలంగాణ మైన్స్, జియాలజీ డైరెక్టరు సుశీల్ కుమార్ మైనింగ్ వ్యాపారస్తులకు సూచించారు. చిన్నచిన్న భద్రతా చర్యలు తీసుకోవటం ద్వారా చాలా ప్రమాదాలను అరికట్టవచ్చని రాష్ట్ర ఖనిజాభివృద్ధి మేనేజింగ్ డైరెక్టరు జి. మల్సూర్ వెల్లడించారు. గ్రామాల్లో స్థానిక యువతను భాగస్వామ్యంచేయటం ద్వారా ఇసుక తరలించే లారీల ప్రమాదాలను అదుపుచేయగలిగామని వివరించారు. గనుల తవ్వకాల్లో, అక్రమ మైనింగు విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై సదస్సు చర్చించింది.

పిజి డిప్లొమా కోర్సుల మార్పుకు అనుమతి

మన తెలంగాణ/హైదరాబాద్: పిజి మెడికల్ డిప్లొమా కోర్సులను పిజి ఎం.డి, ఎం.ఎస్ కోర్సులుగా మార్చుకునేందుకు వీలు కల్పిస్తూ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) అనుమతించింది. ఈ మేరకు ఈ నెల 25 నాటికి దరఖాస్తు చేసుకోవాలని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలకు సూచించింది. ప్రస్తుతం ఉన్న డిప్లొమా సీట్లకు సరిసమానంగా పిజి డిగ్రీ సీట్లను కేటాయిస్తారు. పిజి మెడికల్ డిప్లొమా రెండేళ్ల కోర్సు కాగా, అదే పిజి డిగ్రీ (ఎం.డి లేదా ఎం.ఎస్) కోర్సు మూడేళ్లు ఉంటుంది. అయితే డిప్లొమా చేసినవారికి మెడికల్ ఫ్యాకల్టీగా పనిచేసే వీలు లేదు. పిజి డిగ్రీ చేసిన వారికి ఫ్యాకల్టీగా పనిచేసే వీలుంది. ఈ నేపథ్యంలో సీట్లను మార్చుకునేందుకు వీలుకల్పించారు. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోనే అధికంగా డిప్లొమా సీట్లున్నాయి. ప్రైవేటు కాలేజీలు డిప్లొమా కోర్సులను పెద్దగా తీసుకోలేదు. వాటివల్ల పెద్దగా ఫీజులు వచ్చే పరిస్థితి లేదు పైగా డిమాండ్ లేదు. ఈ నేపథ్యంలో ఎంసిఐ నిర్ణయంపై పలు కాలేజీలు ఆనందం వ్యక్తంచేస్తున్నాయి.

బంగారు తెలంగాణ దిశగా అడుగులు

- ముళ్లబాట నుంచి పూలబాటలోకి
- అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో మనమే టాప్
- మండలిలో హోమ్ మంత్రి

మన తెలంగాణ/హైదరాబాద్: కొత్తగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు రాష్ట్రంలో అంతా అయోమయం నెలకొందని, అలాంటి పరిస్థితి నుంచి అనతి కాలంలోనే బంగారు తెలంగాణ దిశగా రాష్ట్రం పరుగులు తీస్తోందని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమ్మూద్‌అలీ అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ప్రజలకు ముళ్ళ బాట తప్పదని గత పాలకులు భయపెట్టారని, కానీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎంతో ముందుచూపుతో అనేక విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుని రాష్ట్రాన్ని పూల బాట దిశగా తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా మండలిలో సభ్యులు లేవనెత్తిన పలు అంశాలపై ఆయన సమాధానమిచ్చారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా భావించి కెసిఆర్ పాలన సాగిస్తున్నారన్నారు. ఏ రాష్ట్రమూ అమలు చేయని అనేక కార్యక్రమాలను అమలు చేస్తూ ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పండుగలు వస్తే ప్రజల్లో పెద్దఎత్తున భయాందోళనలు నెలకొని ఉండేవన్నారు. బోనాలు, రంజాన్, దేవి నవరాత్రి ఉత్సవాలు, వినాయక చవితి తదితర పండుగలు వచ్చాయంటే ఎక్కడ మతఘర్షణలు జరుగుతాయోననే భయంతో ప్రజలు వణికిపోయేవారని, కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత హైదరాబాద్‌లో కర్ఫ్యూ అంటే ఏమిటో ప్రజలకు తెలియని విధంగా కెసిఆర్ పాలన అందిస్తున్నారన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా పోలీసు శాఖకు పూర్తి అధికారాలు ఇచ్చారన్నారు. అలాగే మెరుగైన విధుల నిర్వహణ కోసం నూతన వాహనాలను సమకూర్చారని, పెద్దఎత్తున అలవెన్సులు పెంచడం వల్ల వారు మరింత బాధ్యతతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. నగరంలో పోలీసు కమాండ్ కంట్రోల్‌ను ఏర్పాటు చేసి కీలకమైన ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు తెలుసుకుంటున్నారన్నారు. దీని కారణంగానే తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు ఎలాంటి మతఘర్షణలు చోటుచేసుకున్న దాఖలాలు లేవన్నారు. తెలంగాణ వస్తే నక్సలిజం పెరుగుతుందని అప్పట్లో పెద్దఎత్తున ప్రచారం చేసినప్పటికీ అసలు రాష్ట్రంలో నక్సలైట్ల కదలికలు అంటూ లేకుండా పోలీసు యంత్రాంగం సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. అలాగే రాష్ట్రంలో పరిశ్రమలకు, వ్యవసాయ రంగానికి, గృహ అవసరాలకు ఇరవైనాలుగు గంటల పాటు నాణ్యమైన కరెంటు సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం కూడా



తెలంగాణే అని మహమ్మూద్ అలీ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డిమాండ్‌కు సరిపడా కరెంటు లేని కారణంగా పరిశ్రమలకు మూడు రోజుల పాటు పవర్ హాలిడే ప్రకటించేవారని, కానీ కెసిఆర్ పాలనలో ఏ రంగానికీ కరెంటు కోతలు లేకుండా కడుపు నిండా సమకూరుస్తున్నారన్నారు. విద్యుత్ ఉత్పాదనకు అవసరమైన అన్ని చర్యలనూ యుద్ధప్రాతిపదికన తీసుకోవడం వల్లే రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఢోకా లేకుండా పోయిందన్నారు. కొత్తగా పరిశ్రమలు రావడంతో రాష్ట్రానికి ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. పరిశ్రమలకు టిఎస్ ఐపాస్ విధానం ద్వారా కేవలం పదిహేను రోజుల్లోనే అనుమతులు జారీ చేస్తుండడంవల్ల రాష్ట్రంలో కొత్తగా అనేక పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీనివల్ల రాష్ట్ర వృద్ధి రేటు బాగా పెరుగుతోందన్నారు. వరుసగా నాలుగేళ్లపాటు 17.17% ఉన్న ఆర్థిక వృద్ధి రేటు డిసెంబర్ నాటికి 29.93 శాతం పెరిగిందన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాల పునర్విభజన, గిరిజన తండాలను గ్రామాలుగా మార్చడం, కొత్తగా అరవై ఎనిమిది మున్సిపాలిటీలను ఏర్పాటు చేయడం వంటి అనేక సంస్కరణలు తీసుకరావడం వల్ల రాష్ట్రంలో అభివృద్ధి మారుమూల గ్రామాల్లో సైతం పరుగులు తీస్తోందన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాలను తీసుకొచ్చి రైతుల కుటుంబాలకు భరోసా కల్పించారన్నారు. కోటి ఎకరాలకు నీళ్ళు ఇవ్వాలన్న కెసిఆర్ కల కాళేశ్వరం ప్రాజెక్టుతో పూర్తి కానుందన్నారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళ, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తోపాటు పలు సంక్షేమ పథకాలపై ఏటా నలభై వేల కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నది కూడా దేశంలో ఒక్క తెలంగాణ ప్రభుత్వమేనని అన్నారు. ముస్లింలకు 12శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు అన్ని యూనివర్సిటీల్లో అధ్యాపయకుల నియామకాలను త్వరలోనే ప్రభుత్వం భర్తీ చేస్తుందన్నారు.

మల్లు భట్టికి కెసిఆర్ శుభాకాంక్షలు

మన తెలంగాణ / హైదరాబాద్ : కాంగ్రెస్ శాసనసభాపక్ష నాయకుడిగా ఎంపికైన మల్లు భట్టి విక్రమార్కకు ముఖ్యమంత్రి కెసిఆర్ శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభ సమావేశాల ముగింపు సందర్భంగా ఆదివారం ఉదయం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి ముందే స్వయంగా సిఎం కెసిఆర్ సిఎల్‌పి నేత మల్లు భట్టి విక్రమార్క దగ్గరకు వెళ్ళి కరచాలనం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సభా కార్యకలాపాలు ప్రారంభం కావడానికి ముందే స్వయంగా సిఎం కెసిఆర్ సిఎల్‌పి నేత కూర్చునే సీటు దగ్గరకే వెళ్ళి పలకరించడం సభలోని సభ్యులందరికీ ఆశ్చర్యం కలిగించింది. నూతన స్పీకర్‌గా ఎన్నికైన పోచారం శ్రీనివాసరెడ్డిని సీటులో కూర్చోబెట్టడానికి వెళ్ళిన సమయానికి సిఎల్‌పి నేత ఎంపిక పూర్తికాకపోవడంతో ఉత్తమ్ వెళ్ళారు.

బొల్లం మల్లయ్య యాదవ్‌తో సిఎం ముచ్చట్లు

కోదాడ నియోజకవర్గం నుంచి గెలుపొందిన బొల్లం మల్లయ్య యాదవ్‌తో ముఖ్యమంత్రి కెసిఆర్ అసెంబ్లీ హాల్‌లోనే కొద్దిసేపు ముచ్చటించారు. సిఎం కుర్చీలో కూర్చున్న తర్వాత సైగలతో బొల్లం మల్లయ్య యాదవ్‌ను దగ్గరకు రావాల్సిందిగా పిలిచారు. అయితే తనను కాదేమోనని భావించిన యాదవ్ రెండుసార్లు గమనించినా స్పందించలేదు. మళ్ళీ మూడవసారి సైగల ద్వారా పిలవడంతో సిఎం దగ్గరకు వెళ్ళారు. పక్కన కూర్చోమని స్పష్టం చేయడంతో సిఎం పక్కనే కూర్చున్నారు. కొద్దిసేపు ఇద్దరూ మాట్లాడుకున్నారు. అయితే వారిద్దరూ ఏం మాట్లాడుకున్నారనేది ఆ సమయంలో చాలా మంది సభ్యుల్లో ఆసక్తి రేకెత్తించింది.

అసెంబ్లీ నిరవధిక వాయిదా

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ నెల 17న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగా, శాసనమండలి సమావేశాలు ఈ నెల 19న ప్రారంభమయ్యాయి. గవర్నర్ నరసింహన్ ఉభయ సభలను ఉద్దేశించి శనివారం ప్రసంగించారు. ఆ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఉభయ సభల్లో ఆదివారం చర్చలు జరిగి ఆమోదం లభించడంతో నిరవధికంగా వాయిదా పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టానికి సవరణలు చేస్తూ తీసుకొచ్చిన ఆర్డినెన్స్ స్థానంలో బిల్లును ప్రభుత్వం ఉభయ సభల్లో ఆదివారం ప్రవేశపెట్టింది. శాసనసభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు.

ఈ నెల 17న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన వెంటనే ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ కొత్తగా ఎన్నికైన సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. మరుసటిరోజు పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పీకర్‌గా ఎన్నికయ్యారు. నాలుగు రోజుల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో 9 గంటల 28 నిమిషాల పాటు ఐదుగురు ప్రసంగించగా, శాసనమండలి ఒకేరోజున 4.54గం -



పుట్టినరోజు సందర్భంగా ఆదివారం అసెంబ్లీలో సిఎం కెసిఆర్‌ను కలిసి ఆశీర్వాదాలు తీసుకుంటున్న కొడంగల్ ఎంఎల్‌ఎ పట్నం నరేందర్‌రెడ్డి

ఒకే అంతస్థులో జూబ్లీహిల్స్ మెట్రోస్టేషన్

- ఈ కారిడార్‌లోనే ప్రత్యేకం
- ప్రారంభానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు



మన తెలంగాణ / హైదరాబాద్ సిటీబ్యూరో : హైదరాబాద్ మెట్రోస్టేషన్‌లకు కొత్త అందాలను తీసుకురావడంపై హెచ్‌ఎంఆర్ ఆధునిక పోకడలను అద్దుతోంది. అందులో భాగంగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు స్టేషన్‌ను సాంకేతికంగా, ఆకారంలోనూ, నమూనాల పరంగా అత్యాధునికంగా ఏర్పాటు చేస్తున్నది. ఈ స్టేషన్ విశ్వనగరంలోనే ఐకాన్‌గా నిలిచేట్టుగా అధికారులు తీర్చిదిద్దుతున్నారు. సాధారణంగా మెట్రోస్టేషన్‌లన్నీ రెండు అంతస్తుల్లో నిర్మాణాలు జరుగుతుంటే జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు స్టేషన్ మాత్రం ఎంతో ప్రత్యేకంగా ఆధునికంగా ఒకే అంతస్తులో నిర్మిస్తున్నారు. దీనికంతటికీ కారణం అక్కడి స్థలాభావమేనని అధికారులు పేర్కొంటున్నారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద నిర్మిస్తున్న మెట్రో స్టేషన్ మాత్రం విభిన్నంగా ఒకే అంతస్తులోనే కన్‌కోర్ లెవల్, ప్లాట్‌ఫాం లెవల్ నిర్మిస్తున్నారు. ఎంతో ఆధునీకరంగా ఇంజనీరింగ్ ప్రమాణాలను అనుసరించి ఒకే అంతస్తులోనే ఫ్లాట్‌పారం లెవల్‌తోనే నిర్మాణాన్ని పూర్తిచేశారు. ఈ అంతస్తులోనే టికెట్ బుకింగ్, స్టేషన్ నిర్వాహణకు అవసరమైన గదులు, ఇతర నిర్మాణాలుంటాయి. ఇందుకు ప్రధాన కారణం స్థలం కొరతయనే అధికారులు వివరిస్తున్నారు. అయితే మరో ప్రక్క జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వైపు నుంచి హైటెక్ సిటీకి వెళ్లే మార్గం ఎత్తయిన ప్రాంతంలో ఉండడంతో రెండతస్తుల్లో మెట్రో స్టేషన్ నిర్మించలేక పోయామని ఇంజనీరింగ్ అధికారులు వివరిస్తున్నారు. దీనితో మెట్రో రైలు ప్రాజెక్టులోనే ఇలాంటి ప్రత్యేకత కలిగిన మరో మెట్రోస్టేషన్ లేదని అధికారులు తెలుపుతున్నారు. ప్రస్తుతం నగరంలోని మెట్రోస్టేషన్‌లో ఉండే మొదటి అంతస్తును కన్‌కోర్ లెవెల్ అంటారు. దీనిలో ప్రధానంగా టికెట్ బుకింగ్, స్టేషన్ నిర్వాహణకు, సెక్యూరిటీకి సంభందించిన గదులు ఉంటాయి ప్రయాణికుల చెకింగ్, వారి బ్యాగేజి చెకింగ్ కూడా ఇక్కడే స్కానర్‌ల ద్వారా జరుగుతుంది. రెండవ అంతస్తులో ఫ్లాట్‌ఫాం లెవల్ అంటారు ఇక్కడ ప్రయాణికులు రైలు ఎక్కిదిగడానికి అనుగుణంగా ఫ్లాట్‌ఫాంలు నిర్మిస్తారు.

వంపులు, ఎత్తుపల్లాలే అధికం

అమీర్‌పేట నుంచి హైటెక్ సిటీ వరకు నిర్మాణం జరుగుతున్న మెట్రో కారిడార్3లో వంపులు, ఎత్తుపల్లాలే అధికంగా ఉన్నాయి. అమీర్‌పేట, మధురానగర్, యూసుఫ్‌గూడ, కృష్ణానగర్, జూబ్లీహిల్స్, మాదాపూర్, హైటెక్ సిటీ వరకు ప్రతీ కి.మీ కు ఒక మలుపు వస్తుంది, దీంతో మెట్రో మార్గం చాలా విభిన్నంగా నిర్మాణం జరుగుతోంది. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 5 వెంకటగిరి సమీపంలో ఎత్తైన మెట్రో పిల్లర్లను నిర్మించారు. ఇక్కడ వెంటనే మలుపు తిరగాల్సి ఉండడంతో రోడ్డు మార్గం గుండా కాకుండా పూర్తిగా ఇళ్ల మీదుగానే మెట్రో ఫిల్లర్లను, వయాడక్ట్‌లను నిర్మించామని అధికార్లు తెలుపుతున్నారు.

హైటెక్ సిటీకి మెట్రో పరుగులు

హైటెక్ సిటీ మార్గంలో ఫిబ్రవరిలోనే మెట్రో రైళ్లు పరుగులు పెట్టనున్నాయి. ఫిబ్రవరి నెల మొదటి వారంలో ప్రారంభించాలనే లక్ష్యంతో ఉన్న అధికారులు క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేశారు. ఒకవైపు రాత్రి పూట ట్రయల్ రన్స్‌లో భాగంగా రైళ్లు పరుగులు పెడుతుంటే, మరో ప్రక్క మెట్రో స్టేషన్‌లలో ప్రత్యేకంగా మౌలిక వసతులకోసం నిర్మాణాలు జరుగుతున్నాయి. అమీర్‌పేట నుంచి హైటెక్ సిటీ వరకు 10 కీ.మీ మార్గంలో ఉన్న 8 మెట్రోస్టేషన్‌లలో మిగిలి ఉన్న పనులను ప్రారంభోత్సవం నాటికి నిర్మాణం పూర్తి చేయడంతో పాటు స్టేషన్‌లను సుందరీకరణకు కార్యాచరణ సిద్ధం చేశారు. కమీషనర్ ఆఫ్ మెట్రో రైల్ సేఫ్టీ (సీ.ఎం.ఆర్.ఎస్) నుంచి అనుమతులు రాగానే ఈ మార్గంలో మెట్రో రైళ్లను అధికారులు ప్రారంభిస్తామన్నారు.

గవర్నర్ ప్రసంగం ప్రజల ఆకాంక్షలకు దర్పణం

- కొత్త రాష్ట్రమైనా ఇతర రాష్ట్రాలకు ఆదర్శం
- దేశానికే స్ఫూర్తిదాయకంగా కెసిఆర్ పాలన
- గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టిన కొప్పుల

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని టిఆర్‌ఎస్ శాసనసభ్యుడు కొప్పుల ఈశ్వర్ అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి కెసిఆర్ పాలన సాగిస్తున్నారని, అందువల్లే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టిఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. ఆదివారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, తెలంగాణ కొత్త రాష్ట్రమే అయినా ప్రజలకు జనరంజక పాలన అందించడంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. గత అరవై సంవత్సరాల్లో పాలకులు చేయని పనులను, రాని ఆలోచనలను కెసిఆర్ కేవలం నాలుగున్నర సంవత్సరాల్లోనే చేసి చూపించారన్నారు. ఇది కెసిఆర్ పాలనా దక్షతకు నిదర్శమని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వాల హయాంలలో అభివృద్ధి కొన్ని ప్రాంతాలకే పరిమితమైందని, కానీ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు, ప్రాంతాలు, గ్రామాలు సమగ్రంగా అభివృద్ధి చెందినప్పుడే నిజమైన అభివద్ధి సాధించినట్లు అవుతుందన్నారు. ఇప్పుడు కెసిఆర్ పాలనలో



అదే జరుగుతోందని, గవర్నర్ ప్రసంగంలోనూ ప్రతిబింబించిందన్నారు. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్ర ఆర్థిక వృద్ధి రేటు కేవలం 4.7 శాతం ఉండగా గతేడాది 17.17% నమోదైందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నవంబర్ నెల నాటికి 29.93 శాతానికి చేరుకుందని, ఇది కెసిఆర్ పాలనకు నిదర్శనమన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వస్తే ఏదో అయిపోతుందని ఆంధ్ర పాలకులు చేసిన అనేక తప్పుడు ప్రచారాలను కెసిఆర్ పటాపంచలు చేస్తూ రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపారన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు, ఇవ్వని హామీలను కూడా నిలబెట్టుకున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రస్తుతం తెలంగాణలో విద్యుత్ కోతలు లేవని, ఎరువుల కోసం రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితు లేవని, పెట్టుబడి సాయం కోసం నిరీక్షించాల్సిన అవసరం లేకుండా ఎకరాకు రెండు పంటలకు ఎనిమిదివేల చొప్పున రైతుబంధు పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారని గుర్తుచేశారు. ఇలాంటి రాష్ట్రం తెలంగాణ తప్ప దేశంలో మరోటి లేదన్నారు. రైతు బంధు పథకానికి కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున ప్రశంసలు అందుతున్నాయని, ప్రధాని నరేంద్రమోడీ సైతం రైతులను ఆదుకునేందుకు రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నట్లు ఇటీవల కాలంలో మీడియాలో కథనాలు వస్తున్న విషయాన్ని కొప్పుల ఈశ్వర్ గుర్తుచేశారు. ప్రమాదవశాత్తు మరణించిన రైతు కుటుంబాలను ఆదుకునేందుకు రైతు బీమా పథకాన్ని ప్రవేశపెట్టి ఒక్కొక్క కుటుంబానికి ఐదు లక్షల రూపాయల చెక్కును అందిస్తున్న ఘనత కూడా తెలంగాణ ప్రభుత్వానిదేనని అన్నారు. నీటి పారుదల, పారిశ్రామిక రంగాలకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ తెలంగాణను అన్ని రాష్ట్రాల్లో కంటే మిన్నగా ఉందన్నారు. అలాగే పాలనలోనూ పలు సంస్కరణలు తీసుకవచ్చి జిల్లాలు, రెవిన్యూ డివిజన్లను, కార్పొరేషన్లు, పంచాయతీలను పూర్తిగా పునర్విభజన చేశారన్నారు.

ప్రజలే కేంద్రంగా పాలన

ప్రజలే కేంద్రంగా కెసిఆర్ పాలన సాగించడం వల్లే రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధిస్తోందని టిఆర్‌ఎస్ సభ్యుడు ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గత పాలకులు దీనిని విస్మరించి పాలన చేయడం వల్లే ఎక్కడి సమస్యలు ఎక్కడి ఉండిపోయాయన్నారు. ఫలితంగా రాష్ట్రానికి అన్న పెట్టే రైతులు కూలీలుగా మారిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం రావడం, ముఖ్యమంత్రి కెసిఆర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించడంతో రైతుల జీవన విధానంలో అనేక మార్పులు వచ్చాయన్నారు. ప్రజలు, రైతులను రెండు కళ్ళుగా చేసుకోని కెసిఆర్ పాలన సాగించడం వల్ల రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. నాలుగున్నర సంవత్సరాల కెసిఆర్ పాలనలో ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వడం వల్లే వాటిని అడ్డుకునేందుకు కొందరు న్యాయస్థానంలో వేసిన కేసులు నిలువలేదన్నారు. ఒక రైతు బంధుకోసమే రాష్ట్ర ప్రభుత్వం పదివేల కోట్లను కేటాయించడం దేశంలోనే ప్రపథమం అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో సంపదను సృష్టించడం, దానిని రైతులకు పంచడం కెసిఆర్‌కే తెలిసిందన్నారు. అందుకే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్షాలకు చెందిన నాయకులు ఎన్ని హామీలు ఇచ్చినా ప్రజలను మాత్రం కెసిఆర్ మాటలనే విశ్వసించారన్నారు. ఎన్నికల్లో టిఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పట్టారని వ్యాఖ్యానించారు. దీనిని కూడా కొందరు నేతలు జీర్ణించుకోలేక ఈవిఎంలపై పడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రం ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతిబింబించే విధంగా కెసిఆర్ పాలన సాగుతున్నదని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు రాష్ట్రాభివృద్ధి కోసం టిఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న కృషికి సంపూర్ణ మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.



ఏ పార్టీలో ఉన్నా ప్రజల మధ్యనే

ప్రమాణ స్వీకారం చేసిన సండ్ర వెంకటవీరయ్య

మన తెలంగాణ / హైదరాబాద్ : నిత్యం ప్రజల మధ్య ఉంటేనే ఎవరైనా గెలుస్తారని, ప్రజలు విశ్వసిస్తారని, పార్టీతో లభించే గుర్తింపు, ఆదరణ కంటే వ్యక్తిగతంగా ప్రజల సంబంధాల్లో ఉంటేనే ఎక్కువ విలువ ఉంటుందని తెలుగుదేశం శాసనసభ్యుడు సండ్ర వెంకటవీరయ్య వ్యాఖ్యానించారు. పార్టీ మారినంతమాత్రమే గెలుపు ఖాయమని భావించలేమని, ప్రజల్లో ఉండడం ద్వారానే గెలుస్తామన్నది తన అభిప్రాయమని అన్నారు. శాసనసభ్యుడిగా సభలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తాను త్వరలో తెలుగుదేశం పార్టీని వీడనున్నట్లు, అధికార టిఆర్ఎస్‌లో చేరనున్నట్లు పత్రికల్లో, ప్రసార మాధ్యమాల్లో ఊహాగానాలు వస్తున్నాయని, అయితే తాను ఏం చేసినా ప్రజాస్వామికంగానే చేస్తానని స్పష్టం చేశారు. ప్రజలకు చెప్పిన తర్వాత వారి అభిప్రాయం మేరకే నిర్ణయం తీసుకుంటాను తప్ప తనంతట తానుగా నిర్ణయం తీసుకోనని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీలు మారనని అన్నారు. ఒకవేళ తాను పార్టీని మారాలనే నిర్ణయమే తీసుకుంటే తప్పకుండా ప్రజలకు చెప్పిన తర్వాతనే దాన్ని పాటిస్తానని, ప్రజలకు చెప్పకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోనని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికల కారణంగానే ఇన్ని రోజుల పాటు తాను నియోజకవర్గంలో తిరిగానని, అందువల్లనే సమావేశాలకు హాజరుకాలేకపోయానని, ఇప్పుడు ప్రచారపర్వం ముగిసిపోవడంతో వచ్చానని తెలిపారు. తాను నియోజకవర్గంలో తిరిగినందువల్లనే చాలా పంచాయతీలను ఏకగ్రీవం చేసుకున్నానని తెలిపారు.

ప్రభుత్వంపై నిర్మాణాత్మకంగా పోరాడుతాం

ఇక ప్రతి రెండు వారాలకు ఒకసారి సిఎల్‌పి సమావేశం



మన తెలంగాణ/హైదరాబాద్ :టిఆర్ఎస్ ప్రభుత్వంపై నిర్మాణాత్మకంగా పోరాటం చేస్తామని సిఎల్‌పి నేత మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ప్రస్తుతం జరిగిన అసెంబ్లీ సమావేశాలు కేవలం ఫార్మల్‌గా నిర్వహించడం వల్లే తాము ఏమీ మాట్లాడలేదన్నారు. కానీ వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో మాత్రం వివిధ అంశాలపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తా మన్నారు. ఆదివారం అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం సిఎల్‌పి కార్యాలయంలో ఆయన కొద్దిసేపు మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఇరిగేషన్‌పై పెద్దఎత్తున ఖర్చు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క ఎకరానికైనా నీళ్ళు ఇచ్చిందా అని ప్రశ్నించారు. నీళ్ళు, నిధుల ఖర్చుపై సమగ్రమైన ఆడిట్ జరగాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. రెండున్నర లక్షల కోట్ల ఖర్చుతో కూడిన ప్రాజెక్టులకు తానే డిజైనర్ అని సిఎం అంటున్నారని, మరి అలాంటప్పుడు ఇక ఇంజనీర్లు ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వం చేసి ప్రతిదానికి కాపలాగా ఉండాలనే తమను ప్రజలు గెలిపించారన్నారు. అందుకే ప్రభుత్వం వేసే ప్రతీ అడుగును నిశితంగా గమనిస్తామన్నారు. సిఎల్ నేతగా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత జానారెడ్డి దీవెనలు కూడా తీసుకున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కాంగ్రెస్ సభ్యులకు ఏ సబ్జెక్టుపై ఆసక్తి ఉంటే దానిపై మాట్లాడుతారన్నారు. పిసిసి చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో తనకు మంచి సంబంధాలే ఉన్నాయని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అసెంబ్లీలో రెండు సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై పూర్తి స్థాయిలో చర్చ జరగలేదన్నారు. కనీసం వచ్చే సమావేశాలు అయినా కనీసం పక్షం రోజులు నిర్వహించాలని కాంగ్రెస్ పక్షాన డిమాండ్ చేస్తామన్నారు. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి సిఎల్‌పి సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యచరణ ప్రణాళికను తయారు చేస్తామన్నారు.

చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు : జగ్గారెడ్డి

చంద్రబాబు నాయుడు మంచి విజన్ ఉన్న నాయకుడని కాంగ్రెస్ శాసనసభ్యుడు జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. ఏపీలో ఆయన రెండవసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. అసెంబ్లీ ఆవరణలో కొద్దిసేపు ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబుపై ప్రశంసల జల్లు కురిపించారు. అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని గత ఎన్నికల్లో ఆ రాష్ట్ర ప్రజలు నమ్మారని, రానున్న ఎన్నికల్లో కూడా అదే జరుగుతుందన్నారు. ఆయన సిఎం అయితేనే ఏపీకి మంచిదన్నారు. చంద్రబాబు రాష్ట్రానికే పరిమితమైన నాయకుడు కాదని, జాతీయ స్థాయి నాయకుడంటూ ప్రశంసలు కురిపించారు. ఏపీలో టిడిపి, తెలంగాణలో కాంగ్రెస్ బతికితేనే ప్రజలకు మంచిదన్నారు. సంగారెడ్డి ప్రజలు తనను గెలిపించినందుకుగాను వచ్చే నెలలో లక్షమందితో ప్రజా కృతజ్ఞత సభను నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్‌పిఎఫ్ ప్రవేశ పరీక్షలో గందరగోళం

మనతెలంగాణ/హైదరాబాద్ : రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) కానిస్టేబుల్ ప్రవేశ పరీక్ష నిర్వహణలో గందరగోళం నెలకొంది. కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని దుండిగల్ ఏరోనాటికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ పరీక్ష విధానంలో లాగిన్ సమస్యలు చోటుచేసుకున్నాయి. వేలది మంది రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) కానిస్టేబుల్ ప్రవేశ పరీక్షకు అభ్యర్థులు హాజరయ్యారు. అయితే అభ్యర్థులను పరీక్షకు అనుమతించేందుకు వారి వివరాలు నమోదు చేసేందుకు కేవలం 3 బయోమెట్రిక్ యంత్రాలు మాత్రమే ఏర్పాటు చేశారు. అభ్యర్థులు క్యూలో నిలబడాల్సి వచ్చింది. ఈ క్రమంలో బయో మెట్రిక్ యంత్రాల వద్ద గందరగోళం పరిస్థితి నెలకొంది. ఒకవైపు అభ్యర్థులు హాజరునమోదు జరుగుతున్న క్రమంలో మరోవైపు హాల్‌లోని అభ్యర్థులకు పరీక్ష పత్రాలు అందజేశారు. అభ్యర్థులు కాలేజీ ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో కేంద్రంలో పరీక్షను నిలిపివేశారు.

జాతీయ స్థాయిలో తెలంగాణ ఐటి కాంగ్రెస్

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ ఐటి కాంగ్రెస్‌ను జాతీయ స్థాయిలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) వ్యవస్థాపకుడు, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు సందీప్‌కుమార్ మక్తాల తెలిపారు. రాష్ట్రానికి ఐటి ప్రాజెక్టులతో పాటు ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహించాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. గ్లోబల్, తెలంగాణ వర్కింగ్ కమిటీలకు ఇటీవల ఎన్నికైన కొత్త కార్యవర్గ సభ్యులు ఆదివారం సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. మూడేళ్లకోసారి ఈ కమిటీలను పునర్నిర్మిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఈ నూతన కమిటీలు కూడా మూడేళ్ల పాటు పనిచేస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా టీటా గ్లోబల్ అధ్యక్షుడు సందీప్‌కుమార్ మక్తాల మాట్లాడుతూ వివిధ దేశాల్లోని టీటా కమిటీల భాగస్వామ్యంతో ఆయా దేశాల్లో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి సదస్సును నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన మద్దతును ప్రభుత్వం నుంచి కోరతామన్నారు. స్టార్టప్‌లను పెద్ద ఎత్తున ప్రోత్సహించడమే నూతన కమిటీ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఇటీవల తమ కమిటీలు డిజిటల్ లిటరసీ ప్రాధాన్య అంశంగా తీసుకొని పల్లె సీమలను అభివృద్ధి చేశామన్నారు. ఈ సారి స్టార్టప్‌ల ప్రోత్సాహానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తెలంగాణ నుంచి ఔత్సాహిక వ్యాపారవేత్తలను ప్రోత్సహించడమే లక్ష్యంగా కమిటీలు పనిచేస్తాయని వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి ఛైర్మన్, టీటా సభ్యుడు వి.ప్రకాశ్, జెఎన్ టియుహెచ్ డైరెక్టర్ గోవర్ధన్ పాల్గొన్నారు.









ఎర్రవల్లికి యాగం కళ

- నేటి నుంచి చతుర్వేద సహిత మహారుద్ర సహస్ర చండీయాగం
- ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలించిన సిఎం కెసిఆర్
- ప్రజా ప్రతినిధులు ఆహ్వానితులే
- 300 మంది రుత్వికులతో ఐదు రోజుల పాటు యాగం
- ఈ నెల 25న పూర్ణాహుతి

మన తెలంగాణ / హైదరాబాద్ : గజ్వేల్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్ ఈ నెల 21 నుంచి ఐదు రోజుల పాటు చతుర్వేద సహిత మహారుద్ర సహస్ర చండీయాగం నిర్వహించనున్నారు. రాష్ట్రంలో సకాలంలో వర్షాలుపడి రైతులు సుభిక్షంగాఉండేలా, తలచిన అన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిరాఘాటంగా కొనసాగేలా, అనుకున్న లక్ష్యాన్ని సాధించేలా, బంగారు తెలంగాణ కల సాకారం అయ్యేలా, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం సకాలంలో పూర్తయ్యేలా అమ్మవారి అనుగ్రహం కోసం సహస్ర హోమాలను ముఖ్యమంత్రి చేయనున్నారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. యాగశాలల నిర్మాణం, ఐదు రోజుల పాటు జరిగే హోమానికి అవసరమైన ఏర్పాట్లను ముఖ్యమంత్రి కెసిఆర్ ఆదివారం సాయంత్రం దగ్గరుండి పరిశీలించారు. అవసరమైన మార్పులు చేర్పుల గురించి తగిన సూచనలు చేశారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ యాగ కార్యక్రమాల్లో 300 మంది రుత్వికులు పాల్గొంటున్నారు. నాలుగు వేదాల పండితులు ఇప్పటికే చేరుకున్నారు. మాడుగుల మాణిక్య సోమయాజులు, నరేంద్ర కాపే, హంపిలోని శృంగేరీ మఠానికి చెందిన ఫణి శశాంక శర్మ, భద్రకాళి వేణు తదితర వేద పండితుల ఆధ్వర్యంలో యాగం జరుగుతోందని పార్టీ వర్గాలు తెలిపాయి. యాగంలో సిఎం దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొంటున్నారని, తొలుత గోపూజ చేసిన తరవాత ప్రధాన యాగం కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపాయి. ఈ కార్యక్రమానికి పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్లు, ఆహ్వానితులని తెలిపాయి. ఈనెల 25వ తేదీన పూర్ణాహుతి ఉంటుందని, యాగంలో కర్ణాటక శృంగేరి పీఠం నుంచి యాగానికి వేద పండితులు ప్రత్యేకంగా హాజరవుతున్నారని తెలిపాయి. విశాఖ శారదా పీఠం అధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి సమక్షంలో యాగం ప్రారంభమవుతుందని తెలిపాయి. యాగశాల పనులను, ఏర్పాట్లను విశాఖ శారదా పీఠ వేద బ్రాహ్మణులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. కర్నాటకలోని శృంగేరీ పీఠాధిపతుల ఆశీస్సులతో శిష్య బృందం ఆధ్వర్యంలో ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలోని దక్షిణ ద్వారాన్ని ఆనుకుని యాగశాలల నిర్మాణం జరిగింది. యాగంలో 27 హోమగుండాలను ఏర్పాటుచేశారు. ఇదే వ్యవసాయ క్షేత్రంలో మూడేళ్ళ క్రితం ఆయుత చండీయాగం, తాజా అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజశ్యామల యాగాన్ని సిఎం నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రకృతి కరుణించాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కాంక్షిస్తూ ఈ యాగాన్ని కెసిఆర్ నిర్వహిస్తున్నారు.

ఆంధ్రలో బిసిలను ఏకం చేస్తా

పది జిల్లాల్లో ప్రభావం చూపిస్తా

ఎంఎల్‌ఎ తలసాని శ్రీనివాస్



మన తెలంగాణ / హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తానే స్వయంగా పర్యటించి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బి.సి.లను ఏకం చేస్తానని, కనీసంగా పది జిల్లాల్లో ప్రభావం చూపిస్తానని మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి అక్కడి వెనకబడిన కులాలకు నాయకత్వం వహిస్తానని, ఆ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి తనను ఆహ్వానిస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బిసిలను ఏకం చేసేందుకు తన దగ్గర భేషైన రాజకీయ ఆయుధాలు ఉన్నాయన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా లాబీలో ఆదివారం మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ, ఆ రాష్ట్రంలో ఒక్క శాతం ఓట్లనైనా ప్రభావితం చేయగలుగుతాననే నమ్మకం ఉందని, కనీసంగా పది జిల్లాల్లో బి.సి.ల ఓట్లను ప్రభావితం చేస్తానన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ నియోజకవర్గంలో సుమారు పాతిక వేల యాదవుల ఓట్లు ఉన్నాయని, ఆయన్ను ఓడించడానికి ఆ ఓట్లు చాలని వ్యాఖ్యానించారు. తెలంగాణలో వచ్చినట్టు భారీ మెజార్టీలు ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే అవకాశం లేదని, వందల ఓట్ల తేడాతోనే నేతల జాతకాలు మారిపోతాయన్నారు. సినీ నటుడు బాలకృష్ణ, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు తెలంగాణలో ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తన నియోజకవర్గంలో తనకు వ్యతిరేకంగా ప్రచారం చేశారని, కానీ వారిద్దరూ ఏమీ చేయలేకపోయారని, తన ఓటుబ్యాంకును కదిలించలేకపోయారని అన్నారు. ఇటీవల తానొక్కడినే విజయవాడకు వెళ్తే అక్కడి తెలుగుదేశం పార్టీ నేతలు వణికిపోయారని, ఇక టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ వెళ్తే ఇంకెంత భయపడతారోనని అన్నారు. తెలంగాణలో బిసిలకు రాజ్యసభ సీట్లు ఇచ్చిన ఘనత, గత శాసనసభలో స్పీకర్, శాసనమండలి చైర్మన్ పదవులను బిసిలకు కట్టబెట్టిన ఘనత కెసిఆర్‌దేనన్నారు. ఎన్‌టిఆర్ ఉన్నప్పుడు బిసిలకు న్యాయం జరిగిందని, కానీ చంద్రబాబు హయాం వచ్చేటప్పటికి బిసిలకు ఆయన చేసిందేమీ లేదన్నారు. జగన్, కెసిఆర్ కలవటం వల్ల వైఎస్‌ఆర్‌సిపికి నష్టంలేదని స్పష్టంచేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న రాజకీయ పరిస్థితిని చూస్తే తెలుగుదేశం పార్టీ మూటాముల్లె సర్దుకునేట్లుగానే ఉందని, టిఆర్ఎస్ నాయకులు కూడా అక్కడ ప్రచారం చేయడం మొదలుపెడితే ఇక తెలుగుదేశం దుకాణం మూసుకోవాల్సిందేనని అన్నారు.



నల్లగొండ జిల్లా, నియోజకవర్గాల సమస్యలు, అభివృద్ధి పనులపై సిఎం కెసిఆర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎంఎల్‌ఎలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య.

ఆర్థిక నేరాలకు 'పోలీసు' చెక్

- ప్రత్యేక పోలీసు బృందం ఏర్పాటు
- చిట్‌ఫండ్స్,ఫైనాన్స్ కంపెనీలపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్ర వ్యాప్తంగా సమాచార సేకరణ

మనతెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్న పలు సంస్థలపై పోలీసులు ప్రత్యేక నిఘా సారించనున్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో ఆర్థిక నేరాలు అధికం కావడంతో సామాన్య ప్రజలు ఆర్థికంగా కష్టపోకుండా ముందస్తుగా పోలీసులు తమదైన శైలిలో నేరాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర డిజిపి మహేందర్‌రెడ్డి సన్నాహాలు ప్రారంభించారు. రాత్రికి రాత్రి కోట్ల రూపాయలు ఎగొట్టి ఉడాయిస్తున్న ఆర్థిక మోసాలను కట్టడి చేసేందుకు పోలీసులు సరికొత్త వ్యూహాలకు తెర తీస్తున్నారు. తాము మోసపోయామని గుర్తించిన బాధితులు ఫిర్యాదు చేయకముందే ఆయా సంస్థలలో జరుగుతున్న లావాదేవీల సమాచారాన్ని సేకరించనున్నారు. వెరసి రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు ఆర్థిక నేరాల నియంత్రణ, నిలువరించేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దింపనున్నారు. ఇప్పటికే సిసిఎస్, సైబర్ క్రైం, నేర విభాగం పోలీసులు, టాస్క్‌ఫోర్స్, ఎస్ఒటి తదితర విభాగాలు నేర నియంత్రణ, నేర పరిశోధనలో కీలక భూమిక పోషిస్తున్న విషయం విదితమే. అయినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా ఆర్థిక లావాదేవీలు సాగిస్తున్న సంస్థలపై ప్రత్యేక నిఘా సారించేందుకు రాష్ట్ర పోలీసు బాసులు ఒక డిఐజి, ఎస్‌పి, ఎఎస్‌పి, సిఐ స్థాయి అధికారులకు ఒక బృందంగా ఏర్పాటు చేయనున్నారు. సదరు పోలీసు బృందం రాష్ట్రంలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలోని ప్రైవేట్ చిట్స్, ఫైనాన్స్, ప్రైవేట్ బ్యాంక్స్‌తో పాటు ఆన్‌లైన్‌లో అధిక వడ్డీల ఆశ చూపే వారిపై నిఘా సారించనున్నారు. ప్రజలు బాధితులుగా మారక మునుపే వారికి భరోసా కల్పించేందుకు పోలీసు ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం . రాష్ట్రంలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న ఫైనాన్స్, చిట్‌ఫండ్, అనధికారిక ప్రైవేట్ చిట్స్‌పై ఆరా తీసి క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులు నివేదిక సమర్పించే విధంగా విధి విధానాలు రూపొందించారు. ఈక్రమంలో అధిక వడ్డీలు వసూళ్లు, ప్రైవేట్ చిట్స్ సంస్థలు నిర్వహిస్తున్న వారి వివరాలు సేకరించేందుకు స్థానిక పోలీసుల సహాయం తీసుకోనున్నారు. ఈక్రమంలో రాష్ట్రంలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న, నిర్వహిస్తున్న చిట్ ఫండ్స్, ఫైనాన్స్ సంస్థలను సమాచారాన్ని సేకరించాలని రాష్ట్ర పోలీసు బాసులు అన్ని జిల్లాల ఎస్‌పిలకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఇటీవల కాలంలో క్యూనెట్, హీరాగోల్డ్ ఫైనాన్స్, మనీ సర్క్యులేషన్, కరక్కాయ, మునక్కాయ,ఆన్‌లైన్ వ్యాపారం, లక్కీడ్రా, చిట్టీల పేరిట ఆర్థిక నేరాలు అధికం కావడంతో పోలీసు బాసులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే కరక్కాయ, మునక్కాయ స్కీంల పేరిట కోట్లాది రూపాయలు నష్టపోయిన బాదితులు ఫిర్యాదు చేసే వరకు తమ దృష్టికి రాకపోవడంపై పోలీసులు ముందస్తుగా ఆర్థిక నేరాల నియంత్రణకు చెక్‌పెట్టేందుకు సన్నాహాలు ప్రారంభించారు. ఉత్పత్తులు, కమీషన్ల పేరుతో ప్రజలను మోసపోతున్న ఘటలను పునరావృతం కాకుండా ముందస్తుగా సమాచారం సేకరించాలని పోలీసు బాసులు కిందిస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో చోటుచేసుకున్న ఆర్థిక నేరాలను పూర్తిస్థాయిలో విశ్లేషించిన పోలీసు ఉన్నతాధికారులు ముమ్ముందు ఆర్థిక నేరాలను, మోసాలను నియంత్రించేందుకు ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా కైలాష్ చంద్ర ఆర్యా ఫ్యూచర్ మేకర్ లైఫ్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్(ఎఫ్ఎంఎల్‌సీ) పేరిట హైదరాబాద్ కేంద్రంగా చేసుకుని 60,000మందిని మోసగించిన కేసులో అధిక శాతం నిరుద్యోగులు, నిరక్షరాస్యులున్నట్లు గుర్తించారు. అలాగే అధిక శాతం వడ్డీ చెల్లిస్తామని వినియోగదారులకు ఎరవేస్తూ హీరాగోల్డ్ దేశవ్యాప్తంగా దాదాపు రూ.950 కోట్లు డిపాజిట్లు సేకరించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. డిపాజిట్ల గడువు దాటినా వడ్డీలు చెల్లించకపోవడం, ఆపై ఆయా మొత్తాలకు అధిక వడ్డీలు చెల్లిస్తామని నమ్మబలికి నట్టేట ముంచిన హీరా గ్రూప్ సంస్థ డిపాజిటర్ దారులు నిలువునా మోసపోయిన తరువాత పోలీసులకు ఆశ్రయించారు..తాజాగా క్యూనెట్ బాధితులు, రిషబ్ చిట్‌ఫండ్స్ బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగి కేసులు నమోదు చేశారు. రాష్ట్రంలో రోజుకో ఆర్థిక మోసం వెలుగు చూస్తున్న క్రమంలో వాటిని ముందే పసిగట్టేందుకు ప్రత్యేక పోలీసు బృందాన్ని రంగంలోకి దించాలని పోలీసు ఉన్నతాధికారులు సమాలోచనలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అనధికారిక చిట్స్, ఫైనాన్స్, ఆన్‌లైన్, అధిక వడ్డీల పేరిట మోసాలను కట్టడి చేసేందుకు పోలీసు బాసులు నడుం భిగించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలీసు బృందం సమాజంలో జరుగుతున్న నేరాల పట్ల, మోసాల పట్ల ప్రజలను చైతన్యవంతం చేయడంతో పాటు ఆర్థిక నేరాల నియంత్రణకు పాటుపడతారన్నది విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆర్థికంగా మోసపోతున్న బాధితులకు భరోసాగా, ఆర్థిక నేరగాళ్ల ఆటకట్టించేందుకు అనతికాలంలో ప్రత్యేక బృందాలు(ఆర్థిక నేరాల సెల్) రంగంలోకి దిగనున్నాయి.





జరుక్ శాస్త్రి


భాషణ భూషణాలు

తెలుగు సాహిత్యంలో పేరడీ అనగానే మనకు వెంటనే గుర్తుకు వచ్చే పేరు జరుక్ శాస్త్రి. పేరడీకి ఒక సాహిత్య ప్రక్రియగా గుర్తింపు తెచ్చి పెట్టిన జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి ఎంతో మందిని అనుకరిస్తూ ఎంత మందిని వెక్కిరిస్తూ పేరడీలు రాశాడు. ఎవరినో నొప్పించాలని లేక ఒప్పించాలని, అధిక్షేపించాలని పేరడీ చేయలేదు. అందుకే నాటి కవులందరికీ అత్యంత ప్రీతిపాత్రుడయ్యారు. 'జరుక్ నాథ జాంబక్, మరినీశాస్త్రి హాంబక్' అని శ్రీశ్రీ, 'చుళుకీకృత కాఫీ, టీ జలనిధి' అని పింగళి కాటూరి, రుక్కుటేశ్వరుడనీ, జలాలుద్దీన్ రుమీ అని, రుక్కాయ్ అని శ్రీశ్రీ, ఆరుద్రలు ప్రేమతో ఆదరించారు. నవలలు, నాటకం, వ్యాసాలు, కథలు ఇలా ఎన్ని రచనలు చేసినా పేరడీ ద్వారానే గుర్తింపు తెచ్చుకున్న వీరి పేరులోనే హాస్యం కనబడటం ఆశ్చర్యం కలిగిస్తుంది. మీ ఇంటి పేరు తమాషాగా ఉందండి అని ఎవరైనా అంటే వీరు నవ్వుతూ H20 ఫార్ములా (జలసూత్రాన్ని) మా వాళ్లే కనిపెట్టారని అనటమే కాకుండా 'నా అసలు పేరు కృష్ణశాస్త్రి. కృష్ణశాస్త్రి అనకుండా మా నాన్న బెంగాలీలను పేరడీ చేసి నాకు రుక్మిణీనాథ్ శాస్త్రి అని పేరు పెట్టారని' ఈ విధంగా తన ఇంటిపేరులోని, తన పేరులోని ప్రత్యేకతను హాస్యపూరితంగా చమత్కరించిన వీరు పేరడీ శాస్త్రిగా కీర్తిగాంచాడు.

పంపిన వారు : డా.వి. గంగారావు. 9948875892
హైదరాబాద్.

mail id : editor@manatelangana.org

నాటకరంగ మణిభూషణం మొదలి



డా.రాయారావు
సూర్యప్రకాశ్‌రావు
9441046839

కొందరు ప్రముఖుల జీవితాలను కూలంకషంగా పరిశీలిస్తే వారి జీవితానికి ఒక పరమార్థం ఉందనిపిస్తుంది. వారి జీవితం సమస్తం ఆ పరమార్థం చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటుందేమో ననిపిస్తుంది. అలాంటి మహనీయుల్లో ఒకరు ఆచార్య మొదలి నాగభూషణ శర్మ. ఆయన బాల్యంలోని మొదటి ఏడేళ్లు మినహాయిస్తే, జీవితం సమస్తం కళామతల్లి సేవకే అంకితం చేశారు. నటన, రచన, ప్రదర్శన, పరిశోధన, ప్రచురణ, అధ్యయనం, అధ్యాపకత్వం, దర్శకత్వం, మార్గదర్శనం ఇలా కళారంగంలో బహుముఖీనంగా విస్తరించిన ప్రజ్ఞ ఆయన సొంతం. పాశ్చాత్య నాటకాలను సైతం వైవిధ్యభరిత ప్రయోగరీతులతో ప్రదర్శించి, తెలుగు ప్రేక్షకులకు మనోల్లాసం కల్పించిన మహనీయుడాయన. తెలుగు నాటక రంగ చరిత్రను భవిష్యత్ తరాల కోసం అక్షరీకరించిన మహానుభావుడాయన. తెలుగునాట రంగస్థల కళలో తొలి ఆచార్యుడిగా పలువురు కళాకారులను తెలుగు నాటక కళారంగానికి పరిచయం చేసిన ఆదిగురువు ఆయన.

ఎనిమిదేళ్లకే కళారంగంలో తొలి అడుగులు వేశారు నాగభూషణ శర్మ. తండ్రి ప్రోత్సాహంతో ఆ వయస్సులోనే నాటకాన్ని రచించి, ప్రదర్శించి, పలువురి మెప్పు పొందారు. శరత్‌బాబు నవలను 'రాముని బుద్ధిమంతతనం' అనే పేరుతో పదహారేళ్ల వయసులోనే 1951లో నాటకీకరించారు. ఆ తర్వాతి సంవత్సరం నాటికలను, నాటకాలను ప్రదర్శించడం ప్రారంభించారు. సుప్రసిద్ధ రచయిత నార్ల వేంకటేశ్వరరావు రాసిన 'భంగపాటు', 'కొత్త గడ్డ' నాటికలు; మునిమాణిక్యం రాసిన 'గృహ ప్రవేశం' నాటకం మొదలైనవి ఆయన నాడు ప్రదర్శించారు.

గురజాడ అప్పారావు రచించిన 'కన్యాశుల్కం' నాటకం ఆ రోజుల్లో పెద్ద హిట్. ఆ నాటకంలోని గిరీశం, మధురవాణి పాత్రలు గ్రామీణుల నోళ్లలో నానిన గొప్ప పాత్రలు. పద్దెనిమిదేళ్ల వయసులో ఆ నాటకంలోని మధురవాణి పాత్ర పోషించి, ప్రేక్షకుల మన్ననలు పొందారు నాగభూషణశర్మ. ఆ పాత్రలో ఆయన యాభైకి పైగా ప్రదర్శనలు ఇవ్వడం విశేషం. పద్దెనిమిదో ఏటనే ఆయన రాసిన తొలి నాటిక 'అన్వేషణ' నాటి సుప్రసిద్ధ సాహిత్య పత్రిక 'భారతి'లో ప్రచురితమైంది. ఆకాశవాణి నిర్వహించిన నాటక రచన పోటీల్లో ఇరవయ్యేళ్ల వయసులోనే బహుమతి అందుకున్నారు.

తెలుగు నాటకరంగంలో అనేక ప్రయోగాలకు ఆయన శ్రీకారం చుట్టారు. సాధారణ వేదికలనే కాకుండా పరిసరాలను సైతం వేదికలుగా చేసుకుని, నాటక ప్రదర్శనలిచ్చే పద్ధతిని పరిచయం చేశారు. గిరీశ్ కర్నాడ్ రచించిన 'తుగ్లక్'తో పాటు 'నరజాతి చరిత్ర సమస్తం', 'దొరా! నీ చావు మూడింది' మొదలైన నాటకాలకు పరిసరాలే వేదికగా ప్రదర్శించారు. పాశ్చాత్య నాటకాలకు తెలుగు సాంప్రదాయాలను, స్థానిక కళారూపాలను మిళితం చేయడం ఆయన చేసిన మరో ప్రయోగం. పలు అమెరికన్ నాటకాలతో పాటు ఇతర భాషల నాటకాలను తెలుగులో ప్రయోగించినప్పుడు ఒగ్గు కథ, శారద కథ మొదలైనవాటిని మిళితం చేసి, ప్రదర్శించి, ప్రేక్షకుల మన్ననలు పొందారు. నాటకం సర్వకళల సమాహారం అంటారు. ఆ నానుడిని నిజం చేస్తూ 'కాయితం పులి' మొదలైన నాటకాలలో మైమ్, ఆట, పాటలను కలగలిపి ప్రదర్శించారు. టంగుటూరి ప్రకాశంపంతులు ఆత్మకథను 'ప్రజా నాయకుడు ప్రకాశం' అనే పేరుతో నాటకీకరించి, దేశమంతటా వందలాది ప్రదర్శనలిచ్చారు. ఇతర భాషలకు చెందిన 'రాజా ఈడిపస్', 'ది విజిట్', 'మ్యాడ్ విమెన్ ఆఫ్ చల్లియట్', హయవదన', 'మృచ్ఛకటిక' మొదలైన నాటకాలను ఆంధ్రీకరించడంతో పాటు ప్రదర్శించారు. ఇబ్సన్ నాటకాన్ని 'డాల్స్ హౌజ్'గా, బెర్తోల్ట్ బ్రెక్ట్ రాసిన నాటకాన్ని 'తెల్ల సున్నా'గా తెలుగులోకి అనువదించి, తెలుగు ప్రేక్షకులకు కానుకగా అందించారు. సుమారు 80కి పైగా నాటకాలకు ఆయన దర్శకత్వం వహించారు. వాటిలో ఇరవైకి పైగా ఆంగ్ల నాటకాలు కాగా అరవైకి పైగా తెలుగు నాటకాలు. 'మన్మథుడు మళ్లీ పుట్టాడు', 'సంభవామి', 'విషాదాంతం', 'జంట పక్షులు', 'నరజాతి చరిత్ర' మొదలైన నాటకాలు; 'జననీ జన్మభూమి', 'అన్వేషణ', 'ఆగస్టు 15', 'అడ్డదారి', 'రాజదండం' మొదలైన నాటికలు 70కి పైగా నాగభూషణ శర్మ రాశారు. స్వతంత్ర నాటకాల రచనతో పాటు రాజా ఈడిపస్ మొదలైన అనువాద నాటకాలను కూడా ఆయన తెలుగులోకి అనువదించారు. డజను ఆంగ్ల నాటకాలను తెలుగులోకి అనువదించడంతో పాటు మూడు సంస్కృత నాటకాలను, ఎనిమిది ఇతర భారతీయ భాషా నాటకాలను కూడా తెలుగులోకి తర్జుమా చేశారు.

సుప్రసిద్ధ నాట్యాచార్యులు నటరాజ రామకృష్ణతో కలిసి 300 కు పైగా గ్రామాల్లో పర్యటించి, 750 మంది కళాకారులు 1975లో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ జానపద కళోత్సవాల్లో పాల్గొనేలా చేశారు నాగభూషణ శర్మ. తోలు బొమ్మలాట బృందాన్ని జపాన్ దేశానికి తీసుకువెళ్లారు. ఆ దేశంలో తోలు బొమ్మలాటను 15 పట్టణాల్లో ప్రదర్శింపజేసి, తెలుగు ప్రదర్శన కళలకు అంతర్జాతీయ ఖ్యాతి లభించేలా కృషి చేశారు.



ఆచార్య మొదలి నాగభూషణ శర్మ
(24.07.1935–15.01.2019)

తెలుగు కళారంగ చరిత్ర రచనలో శర్మ కృషి అనన్య సామాన్యం. సాహిత్య, నాటక, నృత్య, జానపద ప్రక్రియల్లో పరిశోధనలు చేసి; 15 ఆంగ్ల గ్రంథాలను, 22 తెలుగు గ్రంథాలను వెలువరించారు. 'వంద సంవత్సరాల తెలుగు నాటక రంగ చరిత్ర'కు సంపాదకత్వ బాధ్యతలు నిర్వర్తించారు శర్మ. తెలుగు నాటకరంగానికి ఎనలేని సేవలందించిన ధర్మవరం రామకృష్ణమాచార్యులు, ఈలపాట రఘురామయ్య, స్థానం నరసింహారావు, బళ్లారి రాఘవ, ఆచార్య ఆత్రేయ మొదలైనవారి జీవితచరిత్రలను పరిశోధనాత్మకంగా రచించారు. 'సురభి నాటక సమాజాల చరిత్ర', 'కన్యాశుల్కం నూరేళ్ల సమాలోచనం', 'నాటక శిల్పం' మొదలైన గ్రంథాలతో తెలుగు నాటకరంగ చరిత్రను ప్రేక్షకులకు అందజేశారు. 'నాటక రంగ పారిభాషిక పదకోశం' అనే పేరుతో నాటకరంగంపై పారిభాషిక పదకోశాన్ని కూడా ఆయన రూపొందించారు. పురాణం సూరి శాస్త్రి రచించిన 'నాట్యాంబుజము నాట్య అశోకము' అనే గ్రంథానికి సంపాదకుడిగా వ్యవహరించారు. 64 కళారూపాలను 'ఫోక్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అనే పరుతో గ్రంథస్థం చేశారు. 'తెలుగు సాహిత్యం గాంధీజీ ప్రభావం', 'తెలుగు నవలావికాసం' అనే గ్రంథాలను వెలువరించి, తెలుగు సాహిత్యంలో తనదైన ముద్ర వేశారు. 'లోచన' అనే వ్యాస సంపుటిని రచించారు. 'ఇండియన్ థియేటర్ జర్నల్' అనే సుప్రసిద్ధ సాంస్కృతిక పత్రికకు నాగభూషణ శర్మ సంపాదకుడిగా బాధ్యతలు నిర్వహించారు. ప్రఖ్యాత శాస్త్రీయ నృత్య పరిశోధనా త్రైమాసిక పత్రిక 'నర్తనం'కు ప్రధాన సంపాదకుడిగా 2001 నుండి 2007 వరకు పనిచేసి; ఎంతోమంది నాట్యాచార్యులు, నృత్య కళాకారుల సేవలను తన ప్రత్యేక వ్యాసాల ద్వారా వెల్లడించారు. తెలుగు జానపద కళారూపాలపై పరిశోధనలు చేశారు. క్షేత్ర పర్యటనల ద్వారా ఆయన చేపట్టిన పరిశోధనల పర్యవసానంగా అంతర్జాతీయ వేదికల్లో తెలుగు జానపద కళలకు గుర్తింపు సాధ్యమైంది.

అమెరికాలోని ఇల్లినాయిస్ విశ్వవిద్యాలయంలో రంగస్థల కళల్లో ఎం.ఎఫ్.ఏ. చేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి అమెరికన్ నాటకంపై డాక్టరేటు స్వీకరించిన మొదలి నాగభూషణ శర్మ తెలుగు నాట రంగస్థల కళలకు తొలి ఆచార్యుడయ్యారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆంగ్ల శాఖలో ఆచార్యుడిగా పదహారేళ్లపాటు పనిచేసిన తర్వాత అదే విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన రంగస్థల కళల శాఖలో తొలి ఆచార్యుడిగా, తొలి శాఖాధిపతిగా బాధ్యతలు చేపట్టారు. హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 1988లో సరోజినీ నాయుడు స్కూల్ ఆఫ్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్‌ను ప్రారంభించినప్పుడు తొలి డీన్‌గా నియమితులయ్యారు. తెలుగు విశ్వవిద్యాలయంలో రంగస్థల కళల శాఖను ప్రారంభించినప్పుడు ఆ విశ్వవిద్యాలయంలోనూ ఆచార్యుడిగా పనిచేశారు. తెలుగు నాటకరంగ ప్రముఖులు డి.ఎస్.ఎన్.మూర్తి, తనికెళ్ల భరణి, తల్లావఝుల సుందరం, ఎన్.జె.భిక్షు, భాస్కర్ షెవాల్కర్, విద్యాసాగర్, జి.ఎస్. ప్రసాదరెడ్డి తదితరులు ఆయన ప్రత్యక్ష శిష్యులే. తెలుగునాట టిక్కెట్ కొని, నాటకం చూసే అలవాటును పెంపొందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన 'రసరంజని' మూలస్తంభాల్లో నాగభూషణశర్మ ఒకరు.

తెలుగు నాటక రంగానికి విశిష్ట సేవలందించిన ఆచార్య మొదలి నాగభూషణ శర్మ అనేక గౌరవాలు, పురస్కారాలు పొందారు. తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభామూర్తి పురస్కారం, ఎన్టీరామారావు రంగస్థల పురస్కారం, తానా జీవిత సాఫల్య పురస్కారం, కేంద్ర సంగీత నాటక అకాడమీ 'టాగోర్ రత్న' పురస్కారం, కళారత్న పురస్కారం, అప్పాజోస్యుల విష్ణుభొట్ల కందాళం ఫౌండేషన్ వారి ప్రతిభావైజయంతి జీవితకాల సాధన పురస్కారం మొదలైనవి ఆయన పొందారు. వీరేశలింగం, ఆచార్య ఆత్రేయ, బళ్లారి రాఘవ, ధర్మవరం రామకృష్ణమాచార్యులు మొదలైన ప్రముఖుల పేరిట ఏర్పాటు చేసిన పలు పురస్కారాలను ఆయన స్వీకరించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా మొదలైన సంస్థలు ఆయనను తమ కార్యవర్గ సభ్యుడిగా ఎంపిక చేసుకున్నాయి.తెలుగు నాటక రంగ చరిత్రను ఆంధ్రాంగ్ల భాషల్లో రూపొందించడం, 'సాహితి' పేరుతో ద్వైమాసిక పత్రిక ఏర్పాటు, కేంద్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో తెలుగునాట నటనాపాఠశాల ఏర్పాటు మొదలైన నాగభూషణశర్మ స్వప్నాలు పూర్తి కాకముందే ఆయన అస్తమయం చెందడం తెలుగు సాంస్కృతిక లోకానికి పూడ్చలేని విషాదం. ఇల్లస్ట్రేటెడ్ వీక్లీకి సంపాదకుడిగా వ్యవహరించిన ఎ.ఎస్.రామన్ జీవిత చరిత్ర, కూచిపూడి నాట్య చరిత్ర మొదలైన అంశాల్లో ఆయన పరిశోధనలు ముద్రణారూపంలోకి రాకపోవడం కూడా సాంస్కృతిక రంగానికి లోటు. ఆయన అసంపూర్ణంగా వదిలివేసిన ఈ పనులను పూర్తి చేయడమే ఆచార్య మొదలి నాగభూషణశర్మకు మనం అందజేసే నివాళి. ●

ఉగాది కవితల పోటీ

శ్రీ వికారి నామ సంవత్సరం ఉగాది సందర్భంగా సాహితీ కిరణం జాతీయ స్థాయి కవితల పోటీని నిర్వహిస్తున్నది. 20–30 లైన్ల మధ్యలో ఉండే ఏ కవితనైనా పోటీకి పంపవచ్చును. ఫిబ్రవరి 28వ తేదీ లోపు సాహితీ కిరణం, ఇం. నెం. 11–13–154, అలకాపురి, రోడ్ నెం. 3, హైదరాబాద్ – 102 చిరునామాకు అందేటట్లు పంపాలి. వివరాలకు 9490233148 సంప్రదించవచ్చు.

తెలంగాణ మహిళా సాహిత్య సదస్సు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పాలమూరు సాహితి – మహిళా విభాగం వారు మార్చి 9,10 తేదీలలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ మహిళా సాహిత్య సదస్సు నిర్వహిస్తున్నారు. ఆ సందర్భంగా జరిగే కవి సమ్మేళనంలో పాల్గొనే కవయిత్రులు తమ పేర్ల నమోదుకై ఈ నెల 31 వరకు 20 లైన్లకు మించని కవితల్ని రావూరి వనజ, ఫోన్ నెం. 9491486275ను సంప్రదించవలెను.

దివ్యాంగ మహిళల కథలను పంపండి

దివ్యాంగులైన మహిళల కథలను, అనుభవాలను కలిపి పుస్తకం వెలువరించే క్రమంలో ఆసక్తిగల వారు బి. అరుణ, రూమ్ నెం. 129, లేడీస్ హాస్టల్ – 1, యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్, గచ్చిబౌలి, హైదరాబాద్ –46కు రచనలను పంపండి. పూర్తి వివరాలకు 9395532951 సెల్‌లో సంప్రదించవచ్చు.

జగన్నాథ శర్మకు పురస్కారం

లక్ష్మీ నారాయణ జైనీ జాతీయ సాహితీ పురస్కారం (2019) కి, జగన్నాథ శర్మ ఆయల సోమయాజుల గారి ''మొదటి పేజీ కథలు'' కథా సంపుటి ఎంపికైంది. ఈ నెల 29న హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగే, ప్రదానోత్సవ కార్యక్రమంలో శర్మ కు లక్షరూపాయల నగదుతో సత్కరిస్తారు. ఈ కార్యక్రమంలో నందిని సిధారెడ్డి ముఖ్య అతిథిగా, సుధామ అధ్యక్షులుగా వ్యవహరిస్తారని డా॥ ప్రభాకర్ జైనీ తెలిపారు.

సత్యవతమ్మ స్మారక కవితల పోటీ ఫలితాలు

తెలుగు పూలతోట ఫేస్‌బుక్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెడ్నం సత్యవతమ్మ స్మారక జాతీయ స్థాయి కవితల పోటీల్లో ప్రథమ బహుమతిని రాంభట్ల పద్మావతి, ద్వితీయ బహుమతి యెలిషాల నాగమోహన్, తృతీయ బహుమతి బి.వి. శివప్రసాద్‌లు గెలుపొందారు. వీరికి వరుసగా, 3,2,1 వేయిల రూపాయల చొప్పున అందిస్తారు.

మనంలోంచి మనంలోకి

కాలం మెల్లమెల్లగా ఎదుగులను నా ఒంట్లో నింపేస్తోంటే
మనస్సూ మేధస్సూ మునపటికంటే
గొప్పగానూ పైస్థాయిగానూ ప్రవర్తిస్తుంటే
ఎక్కడో ఎవరెవరిలోనో ఉన్న నా మూలాలు
మెల్లమెల్లగా వదులవుతూ
నాకు నేనే మూలాధారం అవుతూ ఉంటే
మేము... మనము అనే భావనను
తడిచేసి తుడిచేస్తూ పొడిపొడిగా చేసి విసిరేస్తూ

నేను అనే భావజాలం
అహం అనబడే సాధికారతను ప్రదర్శిస్తుంటే
తోడు కావాలనే కోరిక కమ్ముకుని
వయసును కౌగిలించుకున్న మనసు
ఊహల ఊయలలో ఊగుతూ
చందమామకథల్లోని కలల లోకంలోకి
రెక్కలగుర్రాలెక్కి విజయవిహారం చేస్తుంటే
అనుభవం చెప్పిందో అనుబంధాల మాయ మరో పుట విప్పిందో
పెద్దరికం కలుగజేసుకుంంది ఎన్నెన్ని ఎంపికలు చేసిందో
ఎన్నెన్ని లెక్కలు ఎడతెగకుండా కట్టుకుందో
అటూతిరిగీ ఇటుతిరిగీ అంతానికి
పెళ్ళి పేరుచెప్పి పెద్ద కుట్రనే పన్నింది

కొంగు చెంగులు ముడివడి మూడుముళ్ళ బంధానికి ఒడబడి
ఉంగరాలు మార్చుకునీ సంతకాలు చేసుకునీ
నువ్వూ నేనూ ఒక్కటయ్యాము
సందడి చేసిన సాక్షులూ ఉన్నారు
సాక్షులయినవారు సందడి సందడి చేశారు
కాలానికి ఎదురు నిలిచేవీ కాలంతోపాటు కరిగి కనుమరుగైపోయేవీ
ఎన్నో ఎన్నెన్నో సాక్షాలూ ఉన్నాయి


ముసిముసి నవ్వుల మెరుపులతో
చిరుసిగ్గుల ఎరుపు బుగ్గల వెలుగులతో
మౌన సాక్షులుగా నీవూ నేనూ ఒప్పందానికి ఒప్పుకుంటూ
ఒకరికొకరం అని వీడని బాసలు చేసుకుంటూ
ఒంటరితనానికి జంట రంగు పులిమేసాము

అపుడపుడే గట్టిపడుతోన్న
నేను అన్న భావన ఎందుకు జండా ఎత్తేసిందో
ఎప్పుడు తెల్లజెండా ఊపేసిందో
తెలీకుండానే నీవూ, నేనూ ... మనం అయ్యాం
మనకంటూ అంటూ ఉన్న మనదీ అని అనుకుంటూ ఉన్న
ఒక ఇంటివారమయ్యాం

ఇప్పుడు ఓ కుటుంబం వేళ్ళూనుకుంటోంది
మూలాలు మెల్లమెల్లగా గట్టిపడుతున్నాయి
నీ పేరూ ... నా పేరూ తగిలించుకునే వారసుల తరాలు
మున్ముందు మొలకెత్తబోతున్నాయి
అలా..... అలా మొదలయ్యింది
మనంలోంచి మనంలోకి ... మనప్రయాణం

శ్రీధర్ చౌదారపు
9440032211


నారాయణపురం వరం పండిత రాఘవాచార్యులు



డా. నలిమెల భాస్కర్
9704374081

అది నారాయణపురం, పేర్చిన పెద్ద బతుకమ్మ వంటి ఊరు. ఒక నారాయణ భట్టు వాఙ్మయ దురంధరుడై తోడుగా నిల్వగా నన్నయ జగద్ధితంబుగ భారత సంహితా రచన బంధురుడయ్యాడు. మరొక నారాయణభట్టు సిరిసిల్ల పాత తాలూకాలోని ప్రస్తుత ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి ఒక మైలు దూరంలో ''నారాయణపురం'' అనే ఊరును పొందిచ్చాడు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఆ వూరు చదువులో, పదవుల్లో, కళల్లో మకుటాయమానంగా వెలుగుతున్నది. సరస్వతి మాత కటాక్షానికి నోచుకున్నది. అక్షరం అక్కడ బంగరు రథమ్మీద బ్రహ్మాండంగా ఊరేగుతున్నది.

నారాయణపురం ఊళ్లో ఒక రామాలయం. దానికి ఎదురుగా కారంచేటి తిరుమల వారి యిల్లు. వేంకటమ్మ, మనోహరాచార్య దంపతులకు (పుష్యమాస శుద్ధ ద్వాదశి నాడు) 1929లో జన్మి ంచారు. కే.వి. రాఘవాచార్యగారు (తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కే.వి. రమణాచారి తండ్రిగారు). మొదట తండ్రిగారి దగ్గరే విద్యాభ్యాసం. తదుపరి ఆవునూరులో ఆచ్చి నరసింహాచార్యుల వద్ద శిష్యరికం. రాఘవాచార్యుల ఇంటి పక్కనే పండిత భావికృష్ణ శాస్త్రి గారి గృహం. ఆవునూరిలోని ఆచ్చి వేంకటాచార్యులు కవిత్వం చెప్పడానికి ఈ కృష్ణశాస్త్రిగారే ప్రేరకులు. పైగా రాఘవాచార్యుల గురువుగారైన ఆచ్చి నరసింహాచార్యులూ. ఈ భావి కృష్ణశాస్త్రిగారూ ఇద్దరూ జంట కవులు. గోలకొండ కవుల సంచికలో నారాయణపురం ఊరు నుండి ముగ్గురి రచనలున్నాయి. అందులో ఒకరు పండితభావి కృష్ణశాస్త్రి. మరొకరు చిలకమఱ్ఱి వేంకటనృసింహాచార్యులు. ఇంకొకరు నమిలకొండ శ్రీరంగాచార్యులు. ఈ ముగ్గురూ కే.వి. రాఘవాచార్యగారి యింటికి మూడు వైపులా వుండేవారు. ఇట్లా తన యింటి చుట్టూ వున్న పెద్దల కవిత్వాలూ, ఆవునూరులోని తన గురువులైన ఆచ్చి వేంకటనృసింహాచార్యుల కవిత్వాలూ గోలకొండ కవుల సంచికలో అచ్చవడం చూసి అచ్చెరువందారు రాఘవాచార్యగారు. తనూ కవిత్వ రచన చేయాలనుకున్నారు. కానీ తండ్రిగారు శాస్త్రజ్ఞానం కవిత్వానికి జీవధాతువు అనగానే నాటక ఛందోలంకార శాస్త్రాల వైపు మరలారు రాఘవాచార్యగారు.1950 ప్రాంతాల్లో జీవనోపాధికి అవసరమైన లౌకిక విద్యార్హతలు పొందారు. మొదట ఏకోపాధ్యాయ పాఠశాలలో చేరారు. కే.వి.రాఘవాచార్య. ఇంటికి పెద్దవారు. రెండో వారు పార్థయ్యగారు, మూడో వారు తిరుమల శ్రీనివాసాచార్యగారు. నర్సయ్యగారు నాలుగో వారు. వేంకటరమణాచారిగారు చివరివారు.



కె.వి. రాఘవాచార్యులు

''మొదటి నాగలి ఎట్ల నడిస్తే వెనుక నాగలి అట్లనే నడుస్తది''. అన్నట్లు తన తమ్ముళ్లందరూ వాళ్ల వాళ్ల రంగాల్లో నిష్ణాతులవడానికి రాఘవాచార్యులే స్ఫూర్తిదాయకులు. మెతుకు కోసం వెతుక్కుంటూ మెతుకుసీమకు వెళ్లారు. మాసాయిపేట, చక్ర్యాల, సిద్ధిపేటల్లో ప్రసిద్ధిని పొందారు. ప్రసంగ వ్యాసంగంలో దిట్ట అయ్యారు. ఉపన్యాస విన్యాసంలో మేటి అయ్యారు. పురాణ ప్రవచనాల్లో ప్రముఖులయ్యారు. 'యువభారతి'ని తన 'మాఘకావ్య వైభవం' వ్యాఖ్యానంతో పండితభారతిని చేసారు. అట్లా వ్యాఖ్యానాల పరంపర కొనసాగింది. కే.వి. రాఘవాచార్యులు బహుభాషాకోవిదులు. మధురమైన మాతృభాష తెలుగు, అమృతసదృశ్యమైన ద్రవిడ భాష అంటే తమిళం, గీర్వాణ భాష సంస్కృతం, మార్దవోపేతమైన ఉర్దూ తదితర భాషల్లో ఆయన వైదుష్యానికి మరొక సాదృశ్యమే లేదు. ప్రధానంగా సంస్కృత ద్రవిడ భాషల్లోని సాహిత్య ఆధ్యాత్మిక గ్రంథాలకు వ్యాఖ్యానాలు రాశారు రాఘవాచార్యగారు. అందులో వేదాంతదేశికులు పాదుకా సహస్రి వ్యాఖ్య సాటిలేనిది.

రాఘవాచార్య గారి జీవితం నిరాడంబరం. వారిది నిస్వార్థమైన వ్యక్తిత్వం. దాదాపు తెలంగాణలో కవులందరూ పోతన వారసులు. అందులో రాఘవాచార్యులు ముందువరుసలో ఉంటారు. ప్రచార ఆర్భాటాలకూ, ఆడంబరాలకూ, కీర్తికండూతికి దూరంగా వుండి లోతైన పాండిత్యంతో వైష్ణవ తత్వసాహిత్యాన్ని బాగా పండించిన కృషీవలురు రాఘవాచార్యులు. పెద్ద జీయర్‌స్వామివారి ప్రశంసలు అందుకున్న అరుదైన వ్యక్తి. చిన్న జీయర్‌గారి నుండి పురస్కారాలు పొందినవారు. విశిష్టాద్వైత వేదాంత విశారద వంటి బిరుదులకూ, ఉభయ వేదాంత మొదలైన పురస్కారాలకూ గౌరవాన్ని సమకూర్చిపెట్టిన వారు. ''నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది'' అంటారు పెద్దలు. కానీ ఊరు మంచిదైతేనే మనుషులు మంచి వాళ్ళవుతారు. మనుషులు మంచి వాళ్ళయితేనే వాళ్ల మాటలూ మంచిగానే ఉంటాయి. నారాయణపురం గొప్ప ఊరు. ఆ రోజుల్లోనే సురవరం ప్రతాపరెడ్డి గారు అడుగుపెట్టిన మంచి ఊరు.

పక్కన మానేరు. చుట్టూ వాగులూ, వంకలూ, కాల్వలూ, ఒర్రెలూ. పచ్చని పంట చేల్లు. ఊళ్లో అనేక భజన మండళ్ళు. వేసవిలో హరికథాకలాపాలు. నాటకాలూ, యక్షగానాలకు కొదవే లేదు. ఇటువంటి పరిసరాలన్నీ కె.వి. రాఘవాచార్య గారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే గొప్ప పరికరాలయ్యాయి. వారికి శిష్య పరంపర గురించి చెప్పవలసిందేలేదు. వరంగల్లు, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ మొదలైన జిల్లాల్లో వేలాది మంది శిష్యకోటి వున్నారు. కె.వి. రాఘవాచార్య గారికి పూర్వం నుండి ఆ వూళ్ళో మొదలైన అక్షరయాత్ర ఇప్పటికీ నిరాఘాటంగా కొనసాగుతూ ఉండడం ఆ వూరి ప్రత్యేకత. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదవీ విరమణ చేసి కీర్తిశేషులైన ఎర్రం రాములు, వేళ్ళ మీదే గణితాన్ని కల్గి ఉన్న వెంకటయ్య లద్దునూరి, దర్శకేంద్రుడు రాఘవేంద్రరావుతో ప్రశంసలు పొందిన నటుడు నలిమెల శ్రీనివాస్, రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన నమిలికొండ ప్రభాకరాచార్యులు, పాత్రికేయ వృత్తిలో అద్భుతంగా రాస్తున్న , రాణిస్తున్న బొల్లం శ్రీనివాస్.. ఇట్లా ఎందరెందరో ఆవూరి బిడ్డలు. ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి ఉత్తీర్ణతా శాతం నారాయణపురంలోనే చాలా సార్లు అధికంగా ఉంటుంది. మా ఊళ్ళో యింటింటికీ దాదాపు ఒక ఉద్యోగి లేక ఒక విద్యాధికుడూ ఉంటారు. ఆ ఊరి మట్టి కె.వి. రాఘవాచార్యగారిని ఒక గొప్ప సాహిత్య ఆధ్యాత్మిక వైష్ణవ తత్త్వవేత్తగా తీర్చిదిద్దితే, ఆచార్యగారు ఆ వూరికి వన్నె తెచ్చారు. ఆ మట్టి మనిషికీ, గట్టి మనిషికీ ఇది అక్షర నివాళి.

మౌనం వీడు


భక్తోన్మాదం బరితెగించి
విద్వేషాగ్నులువిరజిమ్ము
తుంటే...
వికృత మతశక్తులు
విధ్వంసాల్ని సృష్టిస్తుంటే...
పవిత్ర 'దేవభూమి' నేడు
'మరుభూమి'గా మారింది
ప్రశాంత 'దీ(దివ్య)క్షాక్షేత్రం'
'వివక్షత'లమయమైంది.
జడలు విప్పిన మూఢత్వం
అంటూముట్టులంటూ...
'అతివ'ల అలయ ప్రవేశాన్ని
ఆంక్షలతో అడ్డగిస్తూ
అకృత్యాలకు ఒడిగడుతుంది
మతఛాందస ముష్కరమూక
నిరసనలు ఆందోళనలతో
'శబరిగిరి'ని కల్లోల
వలయంగా మారుస్తుంది
ఓ న్యాయదేవతా!
కట్టుకున్న 'నల్లతెర'ను
తొలగించి చూడు
'తీర్పు'లిచ్చి
మౌనంగుండడం వీడు
చట్టాలను దిక్కరించు
దుష్టుల శిక్షించ పూను
అప్పుడే
సమైక్య జీవన కుసుమాలు
పరిమలిస్తాయ్
శాంతిసౌభాగ్యాల
సరాగాలు పల్లవిస్తాయ్

(కేరళలలో చెలరేగిన హింసాగ్నుల ఘటనలకు స్పందిస్తూ...)

కోడిగూటి తిరుపతి
9573929493

వేలాడుతున్న కత్తి!

నీ కళ్ళకొక భయం
పొరనతికించి నిన్ను
నిర్భయంగా వీక్షించమంటారు
నీ తలమీదొక కత్తిని వ్రేలాడదీసి
నిన్ను ప్రశాంతంగా
కూర్చోమంటారు



నీ కాళ్ళకు సంకెళ్ళు వేసి
నిన్ను స్వేచ్ఛగా తిరగమంటారు
నీ కంచంలో పిండాలు పెట్టి
నిన్ను రుచుల
నాస్వాదించమంటారు
ఆ కదిలే ప్రతిమబ్బూ
నీమనసునెలా సల్లబరుస్తుంది
అలా కురిసిన ప్రతి చినుకూ
నీజీవితాన్నెలా సస్యశ్యామలం
చేస్తుంది
ధైర్యం చెప్పే అధైర్యపరచడమే ఆ
విజయరహస్యం!
అందీ అందకపోవడమే
రాజ్యలక్ష్మి గడుసుతనం!

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు,
9182685231

గణతంత్ర మహాయజ్ఞం



గణతంత్ర మహాయజ్ఞం
జయతంత్ర కేతనం
ఎగురు చున్నది
ఎగురు చున్నది
కాంతి స్వప్న వెలుగులతో
శాంతి పూలు విరియంగా...
ఉద్యమమే ఊపిరిగా
ఉద్వేగం ఉషస్సుగా
అరుణారుణ కిరణంలా
ధ్వజమెత్తిన ధీర పుత్రులు
అమర వీరులు త్యాగధనులు
ఆత్మార్పణ ఫలితంగా
అవతరించిన గణతంత్ర
రణ వీరుల పుణ్యధాత్రి
శ్రమ జీవుల రత్న గర్భ
సిరులు పండిన జీవగడ్డ
మన భారత మధుర చరిత
నవ్యభవ్య జననీ
నమో దివ్య ధరణీ
నమో నమో దివ్య ధరణీ

కె. హరనాథ్

మన తెలంగాణ
5
హైదరాబాద్
సోమవారం
21 జనవరి, 2019
www.manatelangana.news

సకుటుంబం



తీరికలేని జీవితాలకు ఉపయోగాలెన్నో..!



పండక్కి రావా అదేమిటే?

సెలవేదీ ? కొత్త ప్రాజెక్ట్... క్షణం తీరిక లేదు.

కొత్త బట్టలు కొనుక్కొన్నావా?

చెప్పాకదా తీరిక లేదు. ఆఫీసు నుంచి వచ్చాక కూడా పని చేస్తూనే ఉన్న?

అమ్మ దగ్గరకు వెళ్తావా మరి? మీ ఆయన ఏమన్నాడు?

ఏవిటీ అంటం, అస్సలు వారంలో మేం పదినిమిషాలు కూడా మాట్లాడుకోలేదు. ఫుల్ బిజీ... నాకీరోజు డాక్టర్ అపాయింట్‌మెంట్ ఉంది...నువ్వు ఫోన్ పెట్టేస్తే నేను పరుగెత్తుతా?

ఆస్పత్రి ఏమిటే... ఏదైన విశేషమా ?

టైమ్ లేదు అనబోయి నాలుక కొరుక్కొని ఏదో టెన్షన్‌లేమ్మా... బుర్ర ఖరాబుగా ఉంది అన్నది ఆ ఇరవై ఆరేళ్ళ ఐ.టీ. ప్రొఫెషనల్.

అందరూ ఇంతే. తీరిక లేని జీవితమే. ప్రతి నిత్యం ఒక పని తర్వాత ఒక పని. ఇంట్లో పని.. ఆఫీసులో సంక్షోభం. క్షణం క్షణం పుట్టుకొస్తున్న అవసరాలు. ఇవన్నీ ఈ తరం జీవన శైలిలో ఒక భాగం. విశ్రాంతి తీసుకోవటానికి, కాసేపు వ్యాయామం చేసేందుకు, దేనికీ సమయం సరిపోదు. ఒత్తిడి, ఆందోళన ఇతర మానసిక శారీరక ఇబ్బందులు. ఇవే.. వీటి మూలంగానే ఇతర ప్రాణాంతక వ్యాధులు వస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ దగ్గర నుంచి ఎందరో శాస్త్రవేత్తలు పరిశోధకులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఇప్పుడు తక్షణ కర్తవ్యం ఏమిటీ? నిజానికి ఆరోగ్య పరిరక్షణకు గొప్ప తీర్మానాలు అవసరం లేదు. చిన్న జాగ్రత్తలు... కొన్ని మార్పులు చాలు. కొద్ది సమయం కేటాయిస్తే సరిపోతుంది.

కొన్ని చక్కని అలవాట్లలోనే జీవన సౌందర్యం కూడా ఇమిడిపోయి ఉంది. మంచి సంగీతం, చక్కని కళలు, ఆరోగ్యవంతమైన భోజనం, వ్యాయామం, ప్రకృతి సహజమైన వనరులన్నీ ఉపయోగించుకుంటే చాలు. అనారోగ్యపు మూలాలే నశించి పోతాయి. ప్రతి రోజూ ఉదయాన్నే నిద్రలేవటం అలవాటు చేసుకొని వట్టి కాళ్ళతో పచ్చని పచ్చికలో కాసేపు నడిస్తే ఆ సమయంలో చక్కని సంగీతం వింటే మనసుకి ఎంత శాంతి.

అసలు సంగీతం సహజ సిద్ధమైన చికిత్స. ఆధునికశాస్త్రం కొన్ని రాగాలు మానవ శరీరంలోని కొన్ని న్యూరాన్లను స్పందింపజేసి అనారోగ్యాలకు స్వాంతన ఇస్తాయంటున్నాయి. రాగాల ఆరోహణ అవరోహణలు మానసికస్థితిని ప్రభావితం చేస్తాయట. మెదడు పనితీరు మెరుగుపరిచి జీవితాన్ని వికసింపజేస్తాయి. ఒత్తిడి తగ్గించుకొనేందుకు మానసిక బలాన్ని పెంచుకొనేందుకు కాఫీ దర్బారీ రాగాలు, అద్భుతమైన తెలివితేటల కోసం శివరంజని, మానసిక హింస వదిలించుకొనేందుకు సహన రాగం వినాలి. భాగేశ్వరి, మాల్కేన్స్, తోడి, పూర్వ అహిర్ భైరవి, వైజయింతి రాగాలు రక్తపోటును అదుపులో పెడతాయి. గుండె సమస్యలు సారంగ్ కుటుంబానికి చెందిన కళ్యాణీ రాగం, చారుకేసి రాగాలు వింటే తగ్గుతాయి. మంద్రస్థాయి నుంచి మధ్యస్థాయి వరకు సాగే భజనలు మనసుకి ప్రశాంతత ఇస్తాయి. సమయం దొరికినప్పుడల్లా శ్రావ్యమైన సంగీతం వినాలి. ఇది మనసుకి హాయినిస్తుంది.

సత్సంబంధాలు కొత్త శక్తినిస్తాయి. బంధువులతో, స్నేహితులతో సంబంధాలు గల వాళ్లు మరింత ఆనందంగా ఎక్కువ కాలం జీవిస్తారని హార్వర్డ్ విశ్వవిద్యాలయం అధ్యయనం చెబుతోంది. మనకు అండగా ఉన్న చుట్టు ప్రపంచం భోరోసాని కొండంత బలాన్ని ఇస్తోంది. నిజమే. సమయం లేని మాట కానీ కొద్ది సేపు రాత్రి పడుకొనే ముందర మొబైల్స్, డెస్కటాప్‌లు ల్యాప్‌టాప్, టీ.వీ.లు కట్టిపెట్టి, మెదడు ఆరోగ్యం కోసం మంచి పుస్తకం పదినిమిషాలు చదువుకొన్న చాలు. చక్కని నిద్ర వస్తుంది.

ఎందుకు మనసు దాచుకోవటం, నవ్వితే చాలు ఎండార్ఫిన్లనే రసాయనాలు ఉత్పత్తి అవుతాయి. మనసు తేలికవుతోంది. కనీసం ఒక అరగంట పాటు చేసే వ్యాయామం శృంగార సామర్థ్యాన్ని కూడా పెంచుతుంది. సంతోషకరమైన కుటుంబ జీవనం అనుభవంలోకి తెస్తోంది.

ఒకే రకంగా చేసే వ్యాయామానికి శరీరం అలవాటుపడి స్పందించటం మానేస్తుంది. సరికొత్త ఉత్సాహాన్ని ఇచ్చే డాన్స్‌యోగా, పవర్ యోగా, ఏరియల్ యోగాలు ప్రయత్నించవచ్చు. కొన్ని రకాల నాట్య ముద్రలు కూడా కొన్ని



నొప్పులను తగ్గిస్తాయంటున్నారు నిపుణులు. కీళ్ళు, కాళ్ళనొప్పుల నుంచి ఉపశమనం ఇచ్చే డాన్స్ యోగా నేర్చుకోవచ్చు. ఇవన్నీ మన పూర్వీకుల దగ్గర నుంచి వారసత్వంగా వస్తూ ఉన్నాయి. వ్యాయామం అంటే శరీరాన్ని యాక్టివ్‌గా ఉంచటం. అలాగే యోగా అంటే ఒక మ్యాట్ వేసుకుని ఒక్క చోటే చేసే విన్యాసాలు కాదు. ఎన్నో సరికొత్త ప్రక్రియలు అందుబాటులోకి వచ్చేశాయి. సినిమా నటులు శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకునేందుకు చేసే ఏరియల్ యోగా పిల్లలు ఆడుకొనే ఉయ్యాల ఆట వంటిదే. ఇంట్లో సీలింగ్‌కు ఓ బలమైన వస్త్రాన్ని వేలాడదీసి చిన్నప్పుడు ఆడిన ఆటలు గుర్తు చేసుకుంటే ఏరియల్ లిఫ్ట్ ఏరియల్ బాలెన్స్ ఏరియల్ హాండ్ స్టాండ్, ఏరియల్ ఏరోబిక్ ఇవన్నీ చేసేయొచ్చు. మరీ భయం వేస్తే ఓసారి జిమ్‌లో ప్రాక్టీస్ చేస్తే సరి. 15 నుంచి 50 ఏళ్ళ వాళ్ళు కూడా ఈ యోగాసనాలు వేసేయచ్చు. జిమ్నాస్టిక్స్, కరాటే, కుంఫూలోని కొన్ని ముద్రలు ఈ ఏరియల్ యోగాలో చేర్చారు. నేర్చుకోవాలి అంతే . కొంత శిక్షణ తీసుకొంటే ఇవన్నీ ఎంత సేపు.. తీరిక లేకుండా గడపటం మన జీవన శైలిలో భాగం అయిపోయింది. ఇలా ఉన్నాం కనుకనే అనారోగ్యాలు. మరి ఈ జబ్బులు ఊరికే వచ్చాయా? మన కష్టార్జితాలు.

శారీరక శ్రమతో పాటు ఆరోగ్య వంతమైన చక్కని భోజనం అవసరం. బయట తిండి తినేవాళ్లతో పోలిస్తే ఇంట్లో వండుకొనే ఆహారం తినేవాళ్ళలో 50 శాతం మంది పదేళ్ళు ఎక్కువగా జీవిస్తున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. వంట ఎలా ఉండాలి? ఏమేం దినుసులు ఏ మోతాదులో వాడాలి మనసు పెడితే చాలు. చక్కని భోజనంతో మెదడు పని తీరు మెరుగవుతుంది. గంటల కొద్ది కూర్చోకుండా కాసేపు కాళ్ళకు పని చెపితే మధుమేహం, రక్తపోటు, అధిక బరువు తగ్గిపోతాయి. నిజమే కెరీర్ పరుగు తీయమని హెచ్చరిస్తూ ఉంటుంది. ఇంటి బాధ్యతలు, బరువులు తరుముతాయి. మానవ సంబంధాలు కాళ్ళకు అడ్డం పడతాయి. వీటన్నింటినీ బాలెన్స్ చేసుకోవాలి. ఒక గమ్యం గురించి, విజయ సాధన కోసం పరుగులు పెడుతూనే జీవితానందాల్ని పొందాలి. సమయాన్ని మన గుప్పెట్లో కి తీసుకోవాలి. ఒక టైం టేబుల్ కూడా ముఖ్యమే. కానీ ఏ లెక్కలకీ అందనీ, ఈక్వేషన్లకు లొంగని చక్కని అందమైన జీవితాన్ని అనుభవం లోని రానివ్వకపోతే అసలు జీవితమే వృథా.

ఇంట్లోనే లిప్‌గ్లాస్ తయారీ



పెదవులను మెరిపించే లిప్ గ్లాస్‌ను సులభంగా ఇంట్లోనే తయారుచేసుకోవచ్చు తెలుసా. అందుకు ఏమేమి కావాలంటే...

కావలసినవి: వాజిలైన్ (పెట్రోలియం ఫ్రీ వాజిలైన్ మెడికల్ షాపుల్లో లభిస్తుంది.), మొక్కజొన్న పిండి, తేనె, చిన్న గాజు సీసా లేదా లిప్ బామ్ పెట్టుకునే డబ్బా.

తయారీ: లిప్ గ్లాస్ నిల్వ చేసే డబ్బా లేదా గాజు సీసా సైజ్‌ని బట్టి ఎంత మొత్తం తయారుచేయాలో నిర్ణయించుకోవాలి.

రెండు టేబుల్ స్పూన్ల వాజిలైన్‌ను చిన్న కప్పులో వేసుకోవాలి. అందులో మూడు టీస్పూన్ల మొక్కజొన్న పిండి వేసి కలపాలి. తరువాత రెండు టేబుల్ స్పూన్ల తేనె కలపాలి. అంతే లిప్ గ్లాస్ రెడీ. దీన్ని నిల్వ చేసే డబ్బాలో నింపాలి. లిప్ గ్లాస్ నింపిన డబ్బా అందంగా కనిపించాలంటే రంగురంగుల పేపర్లను ఆ డబ్బాకి అతికిస్తే డబ్బా అందంగా కూడా కనిపిస్తుంది

లంచ్ బాక్సుల్లో చెడు వాసన రాకుండా..

ప్లాస్టిక్ బాక్సుల్లో లంచ్ పెట్టుకుని ఆఫీసులకు తీసుకెళ్లడం సర్వసాధారణ విషయం. కొన్న కొత్తల్లో ఈ బాక్సులు ఎంతో శుభ్రంగా ఉంటాయి. కానీ కొన్ని రోజులు వాడిన తర్వాత వీటితో సమస్యలు మొదలవుతాయి. డబ్బాల మీద మచ్చలు పడటమే కాకుండా, బాక్సు మూత తీయగానే ఒకలాంటి దుర్వాసన వస్తుంది. అందుకే ఇలాంటి బాక్సులు ఎప్పుడూ శుభ్రంగా ఉండేట్టు కొన్ని జాగ్రత్తలను తప్పనిసరిగా తీసుకోవాలి. అందులోనూ అవి ప్లాస్టిక్‌వి కావడం వల్ల జాగ్రత్త తప్పనిసరి.

రాత్రి లంచ్ బాక్సు కడిగిన తర్వాత అందులో కాస్త ఉప్పు చల్లి గట్టిగా మూతపెట్టాలి. ఇలా చేయడం వల్ల లంచ్ బాక్సు చెడు వాసన రాదు. అంతేకాదు లోపల చేరిన సూక్ష్మ జీవులు కూడా పూర్తిగా నశిస్తాయి. రోజు విడిచి రోజు కొన్ని కాఫీ గింజలను ఆ బాక్సులో వేసి రాత్రంతా ఉంచితే కూడా బాక్సు దుర్వాసన రాదు. ఇవి రెండూ కాకుండా మరో చిట్కా కూడా ఉంది. బాక్సును తోమిన తర్వాత అందులో నిమ్మ తొక్కను వేసి రాత్రంతా అలాగే ఉంచేస్తే బాక్సులో ఉండే చెడు వాసన పోతుంది. లేకపోతే న్యూస్‌పేపర్‌ను ఉండచుట్టి బాక్సులో వేసి గట్టిగా మూతపెట్టి రాత్రంతా అలాగే ఉంచి కడిగేస్తే కూడా దుర్వాసన పోతుంది.







కేశాలకు మెరుపు

ఆరోగ్యం విషయంలో ఎన్నో మెలకువలు పాటించే వాళ్లు తప్ప 'బార్లీ'ని ఆహారంగా తీసుకునేవారు మన సమాజంలో తక్కువే. అయితే బార్లీ గింజల్లోని పోషకాలు ఎంతో ఆరోగ్యకరం కాబట్టే వీటిని హెల్త్ డ్రింక్స్‌లో విరివిగా వాడుతుంటారు. అంతేకాదు... ఆరోగ్యకరం అంటూ ఉత్పత్తి చేసే బ్రెడ్లూ, బిస్కెట్లలోనూ దీన్ని వాడుతుంటారు. బార్లీగింజలతో సమకూరే ఆరోగ్య ప్రయోజనాల్లో కొన్నింటిని తెలుసుకుందాం..

బార్లీలో పోటాషియమ్ పుష్కలంగా ఉంటుంది. అందుకే ఇది రక్తపోటును అదుపులో ఉంచుతుంది. బార్లీలో పీచు పదార్థాలు కూడా ఎక్కువ. అందువల్ల అది జీర్ణాశయపు ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుతుంది. బార్లీలోని పీచుపదార్థాల వల్ల అవి రక్తంలో చక్కెరను అతి మెల్లగా విడుదలయ్యేలా చేస్తాయి. దాంతో చక్కెర అదుపునకు బాగా తోడ్పడతాయి. ఈ కారణం వల్లనే అవి డయాబెటిస్‌ను నియంత్రణలో ఉంచడంతో పాటు, డయాబెటిస్ లేనివారిలో నివారణకూ తోడ్పడతాయి. ఈ గింజలు కొలెస్ట్రాల్‌ను బాగా అదుపు చేస్తాయి. రక్తపోటుతో పాటు కొలెస్ట్రాల్‌నూ అదుపు చేసే గుణం ఉండటం వల్ల ఇవి అనే రకాల గుండెజబ్బులనూ, గుండెపోటునూ నివారిస్తాయి. బార్లీలోని విటమిన్‌ఏ కారణంగా ఇవి కంటిచూపును దీర్ఘకాలం పాటు పదిలంగా కాపాడతాయి. వీటిల్లో ఐరన్ కూడా ఎక్కువే. అందువల్ల రక్తహీనతను నివారిస్తాయి. బార్లీలో ఉండే క్యాల్షియమ్, ఫాస్ఫరస్ ఎముకలను మరింత శక్తివంతం చేస్తాయి. ఇందులోని మెగ్నీషియమ్, జింక్ వంటి ఖనిజాలు చర్మానికీ, వెంట్రుకలకూ మెరుపునిస్తాయి. బార్లీలోని విటమిన్ బికాంప్లెక్స్‌తో పాటు విటమిన్‌సి... మనలో వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. తద్వారా అనేక రకాల వ్యాధుల నుంచి మనల్ని కాపాడతాయి.





నిత్యం శుభ్రంగా ఉండేందుకు..

కొందరి ఇళ్లలో స్టెయిన్‌లెస్ స్టీల్ సింక్ ఎప్పుడూ కొత్తదానిలాగానే కనిపిస్తుంది. అలా కనిపించడం వెనక ఎటువంటి మాయాజాలం లేదు. దాన్ని శుభ్రం చేసేందుకు వాళ్లు పాటించే కొన్ని కిటుకులు తప్ప. అది కూడా ఇంట్లో ఉన్న వస్తువులతోనే చేయొచ్చు. అందుకు ఏం కావాలో చూద్దాం...

స్పాంజ్, బేకింగ్ సోడా, వెనిగర్, నిమ్మ తొక్క, ఆలివ్ నూనె, పేపర్ టవల్

సింక్‌లో ఆహార పదార్థాలు ఏవైనా మిగిలిపోతే శుభ్రంగా తీసేయాలి. తరువాత బేకింగ్ సోడా చల్లి, స్పాంజ్‌ని గుండ్రంగా తిప్పుతూ బేసిన్ అంతా రుద్దాలి. బేకింగ్ సోడా స్టెయిన్‌లెస్ స్టీల్ సింక్ మీద గీతలు పడకుండా శుభ్రం చేస్తుంది. తరువాత సింక్‌ను వెనిగర్‌తో శుభ్రం చేయాలి. వెనిగర్ వేయగానే నురగ వస్తుంది. వెనిగర్ డిస్ ఇన్‌ఫెక్టెడ్‌గా పనిచేయడమే కాకుండా ఉప్పు నీళ్ల వాడకం వల్ల పడిన మరకల్ని కూడా తొలగిస్తుంది. వెనిగర్ వేశాక నెమ్మదిగా స్పాంజ్‌తో రుద్ది నీళ్లతో సింక్ కడగాలి. ఆ తరువాత నిమ్మ తొక్కలతో సింక్ బేసిన్ రుద్దాలి. ఇలా రుద్దేటప్పుడు నిమ్మతొక్క లోపలివైపు, బయటి వైపు నుంచి కూడా రుద్దాలి. అంతే సింక్ కొత్తదానిలా మెరిసిపోతుంది.

చివర్లో ఆలివ్ నూనె చుక్కలు వేసి పేపర్ టవల్‌తో రుద్దితే కొన్ని వారాలపాటు సింక్ మెరిసిపోతూ తాజాగా ఉంటుంది.

చిట్కాలు

✻ పంచదార కంటె బెల్లం ఆరోగ్యపరంగా శ్రేష్ఠం, బెల్లంలో ఇనుము మొదలైన మూలకాలు ఉంటాయి. తియ్యని పిండివంటల తయారీలో చాలామంది చక్కెర కంటే బెల్లాన్నే ఉపయోగిస్తారు. ఆయుర్వేద వైద్యశాస్త్రంలో బెల్లాన్ని చాలా రకాల మందులలో వాడతారు.

✻ పొడి దగ్గు ఇబ్బందిపెడుతుంటే, గ్లాసు బెల్లం పానకంలో కొద్దిగా తులసి ఆకులు వేసి రోజుకు మూడుసార్లు తీసుకుంటే ఉపశమనం కలుగుతుంది.

దారిదీపం మనమే

(మొదటిపేజీ తరువాయి)

ఇస్తూ, వ్యవసాయ రంగాన్ని, ఆ తర్వాత రోడ్లకు ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానం చర్చ సందర్భంగా ఆదివారం అసెంబ్లీలో సభ్యులు లేవనెత్తిన పలు అంశాలపై సిఎం కెసిఆర్ తన సమాధానంలో పై విధంగా స్పష్టత ఇచ్చారు.

ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పెడతాం

ప్రస్తుతానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌నే ప్రవేశపెట్టి వ్యయానికి సభ ఆమోదం తీసుకోనున్నట్లు సిఎం కెసిఆర్ తెలిపారు. జాతీయ ఆర్థిక సంఘం నివేదిక ఆధారంగా,చేసిన సిఫార్సులకు అనుగుణంగా బడ్జెట్ ఉండాల్సి ఉంటుందన్నారు. వచ్చే నెల ఫిబ్రవరి 15,16 తేదీల్లో రాష్ట్రానికి ఆర్థిక సంఘం వస్తుందని, తాను కూడా ఆ సమావేశానికి హాజరై అవసమైన వాటిని ప్రతిపాదిస్తానని వివరించారు. ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే నివేదికను కేంద్రంలో కొత్తగా వచ్చే ప్రభుత్వం ఆమోదిస్తుందా లేదా అనే దానిపై స్పష్టత లేదన్నారు. అలాగే కేంద్రం కూడా పరిమితి మేర బడ్జెట్ ప్రవేశపెడుతుందన్నారు. అందువల్ల రాష్ట్రంలోనూ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌నే ప్రవేశపెట్టనున్నట్లు సిఎం స్పష్టం చేశారు. వృద్ధాప్య, ఆసరా, వితంతు, బీడీ వంటి పెంచిన పింఛన్‌లు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచే అమలు చేస్తామన్నారు. నిరుద్యోగ భృతికి మాత్రం నాలుగైదు, ఆరు నెలల సమయం తీసుకుంటుందని, దీనిపై సమగ్ర అధ్యయనం అవసమన్నారు. అన్నీ పార్టీలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

ఐదేళ్లలో రూ.5 లక్షల కోట్లు అభివృద్ధికే

రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్ల ఆదాయం సమకూర్చుకోవడంతో పాటు ఖర్చు చేస్తామన్నారు. ఒకవేళ కేంద్రంలో అనూకూల ప్రభుత్వం వస్తే రూ.2 లక్షల కోట్లు అదనంగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ ఐదేళ్లలో రూ.2.40 లక్షల అప్పులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వీటిని చెల్లిస్తే మరో రూ.1.30 లక్షల కోట్లు రుణ సదుపాయం వస్తుందన్నారు. అప్పులు, మిగతావి పోను రూ.8 లక్షల కోట్లు ఉంటాయని, ఇందులో ఉద్యోగుల జీతాలు, అవసరాలు ఇతరత్రా పోను మిగిలిన రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల కోట్ల వరకు అభివృద్ధికే కేటాయిస్తామన్నారు. చీకట్లో బాణం వేసినట్లు వెళ్లమని, రాబోయే ఐదేళ్లలో తెలంగాణ ఆర్థిక ప్రగతికి సరైన అంచనాలతోనే ముందుకు వెళ్తామన్నారు. నాలుగేళ్లుగా స్థిరమైన వృద్ధి రేటును సాధిస్తున్నామని, జిఎస్‌టి వసూళ్లలోనూ దేశంలోనే టాప్‌లో ఉన్నామన్నారు. అన్నింటిలోనూ నంబర్ వన్ ఉన్నామని, అందుకే ప్రజలు కూడా నంబర్ వన్‌గా ఆశీర్వాదించారన్నారు. చాలా విషయాలలో అవినీతి రహితంగా ఉన్నామని, ఎటువంటి కుంభకోణాలు, లంబకోణాలు జరగనివ్వలేదన్నారు. ఆదాయం గాలిలో పెరగదన్న సిఎం కెసిఆర్, 50 ఏళ్ల గత పాలకుల హయాంలో ఇసుక మీద రూ. 9.56 కోట్లు వస్తే తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 4 సంవత్సరాల 10 నెలల కాలంలోనే రూ. 2208 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. మార్చి చివరి నాటికి ఇంకో రూ.200 కోట్లు వస్తాయని, మొత్తంగా ఇసుక ఆదాయం రూ.2400 కోట్ల పైనే ఉంటుందని తెలిపారు.

కేంద్రం ఒక్క రూపాయి ఇయ్యలే

కేంద్రంలో రాష్ట్రానికి అనుకూలమైన ప్రభుత్వం ఉందన్నారు. దీంతో రాజ్యాంగబద్ధంగా రావాల్సినవి తప్ప అదనంగా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ నష్టపోయిందని, అభివృద్ధికి సహకరించాలని తాను, మంత్రులు, ఎంపిలు కేంద్రానికి 500ల వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలు అద్భుతంగా ఉన్నాయని, నీతి ఆయోగ్ రూ.24 వేల కోట్లు ఇవ్వాలని సిఫార్సు చేస్తే 24 రూపాయాలు కూడా ఇవ్వలేదన్నారు. ఏదైన ఒక నీటిపారుదల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదన్నారు.

మొదటి ప్రాధాన్యత ఇరిగేషన్‌కే

ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత సాగునీటి ప్రాజెక్టులేనని సిఎం కెసిఆర్ మరోమారు స్పష్టం చేశారు. ఇప్పటి వరకు కోటి ఎకరాలుగా ఉండేనన్నారు. ఇటీవల ఇరిగేషన్ అధికారుల సమీక్షలో అది 1.25 కోట్ల ఎకరాలకు పెరిగిందని, వచ్చే మూడేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి మొత్తానికి నీళ్లు అందిస్తామని తెలిపారు. ప్రాజెక్టులకు ఇప్పటి వరకు రూ.99 వేల కోట్లపైన ఖర్చు చేశామన్నారు. ఈఏ డాది మార్చి ఆఖరు వరకు మరో రూ.8 వేల కోట్ల వరకు ఖర్చు చేయనున్నట్లు వివరించారు. దీంతో రూ.1.07 లక్షల కోట్లు సాగునీటి రంగానికే ఖర్చు పెట్టిన ప్రభుత్వం తమదే అవుతుందన్నారు. మొత్తంగా ఉన్న ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసి 1.25 కోట్ల ఎకరాలకు నీరివ్వాలంటే రూ.2.25 లక్షల కోట్లు అవసరమవుతాయన్నారు. సమైక్య పాలనలో గోదావరి, కృష్ణా బేసిన్‌లలో రాష్ట్రానికి కేటాయించిన 1300 టిఎంసిల నీటిని ఖచ్చితంగా వాడుకుంటామన్నారు.

ఆరోగ్యశ్రీయే ఉత్తమం.. త్వరలో ఇఎన్‌టి

మంచి పథకాలు ఎవరు తెచ్చినా మెచ్చుకోవాల్సిందేనని సిఎం అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ ప్రారంభించిన ఆరోగ్యశ్రీ చాలా మంచి పథకమని చెప్పారు. అందుకే ఎలాంటి మార్పులు లేకుండా తెరాస కూడా ఆరోగ్యశ్రీని అమలు చేసిందన్నారు. ఆరోగ్యశ్రీ బాగున్నందునే కేంద్రం అమలు చేస్తున్నఆరోగ్య పథకంలో తెలంగాణ చేరలేదని తెలిపారు. కాంగ్రెస్ సభ్యులు గండ్ర వెంకటరమణ రెడ్డి చెప్పిన దాంట్లో వాస్తవం లేదన్నారు. వరంగల్ జిల్లాలో ఎవరికీ కళ్లు పోలేదన్నారు. కంటి వెలుగు కింద ఇప్పటి వరకు ఆపరేషన్‌లు ప్రారంభం కాలేదన్నారు. అసంబద్ధంగా మాట్లాడటం సరికాదన్నారు. నిజాలు మాట్లాడితే విపక్ష సభ్యుల గౌరవం పెరుగుతుందన్నారు. కంటివెలుగు పథకం కింద ఇప్పటి వరకు 1.32 కోట్ల మందికి పరీక్షలు జరిగాయన్నారు. సునేత్ర పేరుతో ఇతర రాష్ట్రాలు అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. త్వరలో చెవి, ముక్కు, గొంతు పరీక్షల శిబిరాలు కూడా నిర్వహిస్తామన్నారు.

ఎస్‌టి తండాలు.. ఆదివాసీ గూడెంలకు బి.టి రోడ్లు

రోడ్లు దేశ, రాష్ట్ర సంస్కృతిని ప్రతిబింబిస్తాయని నాటి దివంగత సిఎం చెన్నారెడ్డి అన్నారని సిఎం కెసిఆర్ గుర్తు చేశారు. రోడ్ల విషయంలో ఒక విధానంతో ముందుకు వెళ్తామన్నారు. కొత్తగా ఏర్పాటైన ఎస్‌టి తండాలు, ఆదివాసీ గూడెలకు మొదటి ప్రాధాన్యత కింద బి.టి రోడ్లు వేయిస్తామన్నారు. మొత్తంగా 12,751 పంచాయతీలకు బిటి రోడ్లు వేయిస్తామన్నారు. అలాగే పాత రోడ్లన్నింటిని మరమ్మత్తులో భాగంగా అద్భుతంగా చేసుకుంటామని, ఇందుకోసం ఏడాదిన్నర వరకు కొత్తగా ఏ రోడ్డుకు అనుమతివ్వబోమన్నారు. ఎటువంటి పక్షపాత, వివక్ష ధోరణి లేకుండా రోడ్లు వేస్తామన్నారు. తెలంగాణ ఏర్పాటు ముందు వరకు గత 50 ఏళ్ల పాలనలో రాష్ట్రంలో రెండున్నర వేల కిలో మీటర్లు మాత్రమే రహదారులు ఉండేనన్నారు. అయితే ఈ విషయంలో కేంద్రం తమ విజ్ఞప్తిని పట్టించుకుని మూడు వేల కిలోమీటర్లకు గుర్తింపునిచిందన్నారు. జాతీయ సగటును దాటి, ఇప్పుడు 5500 పైచిలుకు కిలో మీటర్లకు చేరుకున్నామన్నారు. మరో రీజినల్ రింగ్ రోడ్డు కూడా పాక్షికంగా అనుమతులు వచ్చాయని తెలిపారు. మొత్తంగా రాష్ట్రంలో 27 వేల కిలోమీటర్లకు పైచిలుకు రోడ్లు ఉన్నాయన్నారు. పంచాయతీలన్ని మురికి కుపాలుగా మారాయాని, దీనిని సరిదిద్దాడానికే 9 వేల పైచిలుకు పంచాయతీ కార్యదర్శులను నియమించామన్నారు. సరిగ్గా పనిచేస్తేనే రెగ్యులర్ చేస్తామని, నిబంధనలు కూడా అలాగే ఉన్నాయన్నారు. రోడ్ల మీద చెత్త వేస్తే రూ.500 ఫైన్ వేస్తున్నామన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా చేసుకుందాం. అవసరమైతే ఈ శాఖ తన వద్దనే ఉంచుకుంటానని సిఎం పేర్కొన్నారు.

ఉన్నత విద్యలో ప్రైవేట్ భాగస్వామ్యం

రాష్ట్రంలో విద్య విషయంలో ప్రైవేట్ వారిని భాగస్వామ్యం చేసే ఆలోచనలో ఉన్నట్లు సిఎం వెల్లడించారు. ఉన్నత విద్యలో ప్రైవేట్ విద్యాసంస్థలను ఎలా మిళితం చేయవచ్చుననే దానిపై కసరత్తు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో ప్రైవేట్ విద్యాసంస్థలు పోటీ పడుతున్నాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నందున, వాటికి భాగస్వామ్యం కల్పించడంపై ఎలా ఉంటుందన్న దానిపై చర్చ చేసి ముందుకెళ్తామన్నారు. రాష్ట్రానికి వివిధ సంక్షేమ పథకాలకు 36,37 అవార్డులు వచ్చాయన్నారు. వైద్య రంగంలోనూ దేశంలోనూ మూడో స్థానంలో నిలిచామన్నారు. మొదటి రెండు స్థానాల్లో కేరళ, తమిళనాడు మాత్రమే ఉన్నారన్నారు.

శాంతి భద్రతలు ప్రభుత్వ ఘనతే

ఒక్క అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా అసెంబ్లీ ఎన్నికలు జరగడం టిఆర్ఎస్ ప్రభుత్వ ఘనతేనని కెసిఆర్ అన్నారు. డ్రగ్స్ మన దగ్గర అంతగా లేవన్నారు. బెట్టింగ్‌లపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. శాంతిభద్రతలను గాడిలో పెట్టామని, వచ్చే ఐదేళ్లు అలాగే కొనసాగిస్తామన్నారు. మరో మూడు, నాలుగు నెలల్లో అబ్బురపడేలా పోలీస్ కమాండెట్ టవర్స్ అందుబాటులోకి వస్తాయన్నారు. అక్కడ సిఎం, సిఎస్‌లకు కూడా ప్రత్యేక గదులు నిర్మిస్తున్నారన్నారు. ఎప్పటికప్పుడు ఎటువంటి పరిస్థితినైనా అక్కడి నుంచి సమీక్షించేలా నిర్మాణం జరుగుతుందన్నారు.

కౌలుదారులపై పెద్ద మనస్సు చేసుకోండి

కౌలురైతులకు రైతుబంధు పథకం వర్తించడం కుదరదని మరోమారు సిఎం కెసిఆర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కౌలు రైతులకూ పెట్టుబడి ఇస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. కౌలుదారుడు ప్రతిసారీ మారుతారని ఆ వివరాలు రాయడం ప్రభుత్వం పని కాదన్నారు. పట్టాదారులవైపే తాము ఉంటామన్నారు. కాకపోతే భూ యాజమానులే కౌలురైతులపై పెద్ద మనస్సు చేసుకుని సహకరించాలన్నారు. రైతుబంధు పథకం మూడు రాష్ట్రాలు ప్రారంభించాలని ప్రయత్నించి విఫలమయ్యాయని కేంద్ర అధికారులు చెప్పారని తాము మాత్రం విజయవంతంగా పూర్తి చేసామన్నారు. ఇప్పుడు దేశానికే ఆదర్శంగా మారిందన్నారు. వచ్చే ఖరీఫ్ నుంచి ఎకరాకు రూ.5వేలు అందిస్తామన్నారు. ఇప్పటి వరకు 6062 మంది రైతులు దురదృష్టవశాత్తు మృతి చెందగా, వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.303 కోట్లు రైతుబీమా కింద అందించామన్నారు. మిగులు విద్యుత్ దిశగా వెళ్తామని, ప్రస్తుతం ఉన్న 17 వేల మెగావాట్లు, 28 వేల మెగావాట్లకు పెంచుకుంటామన్నారు. ప్రాజెక్టులు వచ్చిన తరువాత అవసరమైతే వెయ్యి, రెండు వేల మెగవాట్లు కొనుగోలు చేస్తామని, అంతేగానీ 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా ఆపేది లేదని స్పష్టం చేశారు.

సమగ్ర అధ్యయనం తర్వాతే రుణమాఫీ

రుణాలపై సమగ్ర అధ్యయనం చేసిన తర్వాత ఎన్ని విడతల్లో మాఫీ చేయాలనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని సిఎం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంజాబ్‌లో ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని చెప్పింది. కానీ ఇప్పటి వరకు అమలు చేయలేదు. మధ్యప్రదేశ్‌లోనూ ప్రభుత్వం ఏర్పాటై నెల రోజులవుతుందని, ఒక్క రూపాయి రుణమాఫీకి ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో ఎలాంటి బేదాభిప్రాయాలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేస్తామన్నారు. తాము రూ. ఒక లక్ష మాఫీ చేస్తామంటే, కాంగ్రెస్ రూ. 2 లక్షలు చేస్తామని చెప్పింది. అయినా ప్రజలు తమకే పట్టం కట్టారన్నారు. ప్రస్తుతం రూ.24 వేల కోట్ల వరకు రుణాలు మాఫీ చేయాల్సి ఉంటుందని అంచనాగా ఉంది. విధివిధానాల రూపకల్పన జరుగుతుంది. లోసుగులు లేకుండా ఒకసారా లేక రెండుసార్లు, మూడు సార్లు ఎలాగైనా నూటికి నూరుశాతం చేస్తామన్నారు.

పోడు భూముల సమస్యకు పరిష్కారం

కొన్ని పనుల ప్రారంభానికి ఎన్నికల కోడ్ అవరోధంగా మారిందన్నారు. లోక్ సభ ఎన్నికలు పూర్తి కాగానే పనులు, సంస్కరణల్లో వేగం పెరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్లే పోడు భూముల సమస్య పరిష్కారం కాకుండా పోయిందన్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి కోయలు వలస రావడం కూడా పోడు భూముల విషయంలో సమస్యగా మారిందని,సమస్యను తప్పకుండా పరిష్కారిస్తామన్నారు. త్వరలో గిరిజన ఎంఎల్‌ఏలతో సమావేశం ఏర్పాటు చేసి పరిష్కారం కనుక్కుంటామన్నారు. ప్రజా దర్బార్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందులో సిఎంతో సహా, ఉన్నతాధికారులు ఉంటారన్నారు. ఢిల్లీ మాదిరి పరిస్థితి మనకు రాకూడదన్నారు. 459 మంది కలప దొంగల జాబితాను తయారు చేశాము. రెండున్నర వేల కోట్ల రూపాయల కంపా నిధులు రావాల్సి ఉందన్నారు.

40 ఏళ్ల ముందుచూపుతో మిషన్ భగీరథ



మిషన్ భగీరథను 40 ఏళ్ల ముందుచూపుతో తీసుకువస్తున్నట్లు సిఎం కెసిఆర్ తెలిపారు. ఇప్పటికే బల్క్ వాటర్ అన్ని 23,968 ఆవాసాలకు చేరాయన్నారు. కాకపోతే కొన్ని గ్రామాల్లో పూర్తిగా నలాలు బిగించకపోవడం, కొన్ని పనులు మిగిలి ఉండటంతో ఆ నీటిని వాడం లేదన్నారు. 18,692 గ్రామాల్లో నలాలు బిగించారన్నారు. మిషన్ భగీరథ నీటితోనే పారిశ్రామిక అవసరాలు కూడా ఉంటాయన్నారు.

మండలానికొక ప్రాసెసింగ్ యూనిట్

పంట ఉత్పత్తులకు మంచి ధర వచ్చేందుకు నియోజకవర్గానికి రెండు లేదా మూడు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని సిఎం కెసిఆర్ అన్నారు. అవసరాన్ని బట్టి మండలానికొక యూనిట్ ఏర్పాటు చేసే వీలును పరిశీలిస్తామన్నారు. గిట్టుబాటు ధర కేంద్రం పరిధిలోదని, దీనిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడిని కలిసిన ప్రతిసారి చెబుతున్నా అయినా ఆయన సరైన సమాధానం చెప్పడం లేదు. దీంటో ఐకెపి, మహిళల సంఘాలకు భాగస్వామ్యం కల్పిస్తామన్నారు. ఎక్కడి పంటలు అమ్ముకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో ప్రతిదీ కల్తీ అయిందని, చిన్న పిల్లలు తాగే పాలు కూడా కల్తీ అవుతున్నాయి. ఇజ్జత్ పాపడ్‌లా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను విస్తృతంగా ఏర్పాటు చేస్తామన్నారు.

54 లక్షల మందికి పాసు పుస్తకాలు

గత ప్రభుత్వాలు రైతులను నిర్లక్ష్యంగా వదిలేశాయని సిఎం కెసిఆర్ తెలిపారు. పహాణి, ఆర్ఒఆర్‌లు అవసరం లేకుండా బ్యాంకుల్లో రైతులకు నేరుగా రుణాలు అందాలన్నారు. ఎలాంటి దస్త్రాలు లేకుండా కేవలం ధరణి వెబ్‌సైట్ ఆధారంగానే రైతులకు రుణాలు అందాలన్నారు. ధరణిలో వచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్ అనుగుణంగా రెవిన్యూ రికార్డులు కూడా మారిపోతాయన్నారు. వంద శాతం భూరికార్డుల ప్రక్షాళన చేస్తామన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, పాసు పుస్తకాలు అందేలా చూస్తామన్నారు. ఇప్పటి వరకు 54 లక్షల మందికి పాసు పుస్తకాలు అందించినట్లు వివరించారు. కొత్తగా 100 మంది సర్వేయర్లను నియమించుకోనున్నట్లు తెలిపారు.

లాటరీ విధానంలోనే ఇళ్లు కేటాయిస్తాం

ఇళ్ల నిర్మాణాల విషయంలో ప్రభుత్వం సాహసం చేయబోతోందని సిఎం చెప్పారు. గతంలో సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 8 లక్షల ఇళ్లు నిర్మిస్తే సరిపోతుందని తేలిందన్నారు. ఇల్లు అవసరమైనవాళ్లు ఎంతమంది ఉన్నారో కచ్చితమైన లెక్కలను త్వరలో తీస్తామని చెప్పారు. దీంట్లో సర్పంచ్, కార్యదర్శి కీలకమన్నారు. కేంద్రంలో వచ్చే ప్రభుత్వ విధానాల మేరకు తాము నిర్ణయం తీసుకుంటామన్నారు. పేదవాళ్ల పేర్లను లాటరీలో వేసి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలోనూ లాటరీ విధానానికి మినహాయింపు లేదని కెసిఆర్ స్పష్టం చేశారు. 2.70 లక్షల రెండు పడకగదుల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇప్పటికే కొన్నింటిని నిర్మించామన్నారు. ఒక్క మంథని నిమోజకవర్గంలోనే డబుల్ బెడ్‌రూమ్‌లు 104 శాతం కట్టించామని, కానీ ఇంకా అక్కడ ఇళ్లు లేని వారున్నారని కాంగ్రెస్ పాలనలో ఇండ్ల నిర్మాణనికి ఇదొక నిదర్శనమన్నారు.

అన్ని జిల్లా కేంద్రాల్లో మెడికల్ కాలేజీలు

అన్ని జిల్లా కేంద్రాల్లో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. అక్కడున్న ప్రైవేట్ కళాశాలలకు అనుగుణంగా మంజూరు చేస్తామన్నారు. ఎన్నికల్లో ఐదారు చోట్ల హామీ ఇచ్చానని సంగారెడ్డిలో కూడా ఇచ్చానన్నారు. ఆ నియోజకవర్గం కాంగ్రెస్ సభ్యుడు జగ్గారెడ్డి ఈ విషయాన్ని ప్రస్తావించగా సిఎం సమాధానమిచ్చారు. మొదటి ప్రాధాన్యతలోనే సంగారెడ్డి ఉంటుందన్నారు. అంతటా అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. బిజెపి సభ్యులు రాజాసింగ్ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు ఏడాది ఆలస్యమవుతున్నాయని, తొందరగా అయ్యేలా చూడాలని కోరారు. అలాంటిదేమి లేదని, తక్కువ సమయంలోనే ఇస్తున్నామని సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సిఎం కెసిఆర్ బదులిచ్చారు.

రాజకీయ పరిణతితో మాట్లాడాలి

కెసిఆర్ ఎన్నికల ప్రచారంలా గవర్నర్ ప్రసంగం ఉందని విపక్షలు విమర్శలు చేస్తున్నాయని, రాజకీయ పరిణితి చెందిన వారెవరూ ఇలాంటి వ్యాఖ్యాలు చేయరన్నారు. ఏ ప్రభుత్వం ఉన్నా ఆ క్యాబినేట్ ఏం నిర్ణయించి ఇస్తారో అదే గవర్నర్ చదవి వినిపిస్తారన్నారు. టిఆర్ఎస్ చేసిన నిర్ణయాలే ప్రభుత్వ నిర్ణయాలని, వాటినే గవర్నర్ చెప్తారన్నారు. గతంలో చెప్పిన దానికంటే ఎక్కువ చేశామన్నారు. అపోహాలు అవసరం లేదన్నారు. ఇప్పుడు తమ మ్యానిఫెస్టో చాలా పరిమితంగా ఉందని, అమలుకు ఐదేళ్ల సమయం ఉందన్నారు.

పార్లమెంట్‌లాగే కొనసాగిద్దాం

ఈసారి గవర్నర్ ప్రసంగం సందర్భంగా సభ్యులందరూ చాలా హుందాగా వ్యవహరించారని సిఎం కెసిఆర్ అభినందించారు. ఇదే పద్ధతిని కొనసాగించాలని కోరారు. ఎప్పుడు ఏదో ఒక విషయంలో సభలో గందరగోళం చోటు చేసుకోవడం సహజమేనన్నారు. అదే పార్లమెంట్‌లోనూ జరుగుతుందని, అయితే రాష్ట్రపతి ప్రసంగం సందర్భంగా మాత్రం హుందా వ్యవహరిస్తారన్నారు. అదే పద్ధతిని రాష్ట్ర శాసనసభలోనూ కొనసాగిద్దామన్నారు. సభను ఎన్నిరోజులైనా నడిపేందుకు, దేనిమీదైనా చర్చించేందుకు తాము సిద్ధమేనన్నారు. విపక్షాలు కూడా నిర్మాణత్మకమైన సలహాలు ఇవ్వాలన్నారు. ధన్యవాద తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడంపై సిఎం హర్షం వ్యక్తం చేశారు. ఈవిషయంలో సిఎల్‌పి నేత భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త సృష్టిపై దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

ఎదిగేందుకు పురుషులు సహకరించాలని సూచించారు. రెండు రోజుల పాటు జరిగిన సదస్సులో 50 శాతం మహిళా ప్రతినిధులు హాజరయ్యారని తెలిపారు. సదస్సుకు హాజరైన మహిళల ఎదుగుదలకు తోడ్పాటు అందించాలని సభకు హాజరైన ప్రతినిధులను కోరారు. గాంధేయ మార్గంలో సుస్థిర అభివృద్ధి, ఆవిష్కరణలు అంశంపై సదస్సు అన్ని కోణాల్లో విస్తృతంగా చర్చిందని తెలిపారు. తెలంగాణ జాగృతి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించే లక్ష్యంతో నైపుణ్యత శిక్షణ, అభివృద్ధి కేంద్రాలను నిర్వహిస్తుందని తెలిపారు. ఇప్పటివరకు 19 వేల మందికి పైగా ఉద్యోగాలు లభించాయని వెల్లడించారు. పూర్ణ, రెజ్లర్ బబితలు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని చెప్పారు. వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేందర్ సింగ్ తన జన్మదినోత్సవాన్ని తెలంగాణలో జరుపుకుని తెలంగాణ ప్రభుత్వం నీటి పారుదల రంగానికి చేస్తున్న కృషిని కొనియాడటం ప్రశంసనీయమన్నారు. తెలంగాణ ప్రభుత్వం నీటివనరుల సంరక్షణచేపడుతూనే నీటివనరులను సద్వినియోగం చేసేందుకు కృషి చేస్తుందని చెప్పారు. ఇదిలా ఉండగా రెండు రోజులపాటు జరిగిన ఈసదస్సుకు 135 దేశాలనుంచి 550 మంది ప్రతినిధులు హాజరై సుస్థిరాభివృద్ధి నూతన ఆవిష్కరణలపై చర్చించారు. పాల్గొన్న ప్రతినిధుల్లో సగ భాగం మహిళా ప్రతినిధులే ఉండటం గమనార్హం. జాగృతి ఫెల్లో షిప్ పొందిన చిరాక్ గుప్తా, సర్వేష్ పాండే, లక్ష్మీ ప్రసాద్‌లు తెలంగాణలో వ్యవసాయరంగంలో పసుపు ఉత్పత్తిపై ప్రసంగించగా ఖ్యాతి, షికా బాలికల్లో రక్తహీనతపై సూచనలు చేశారు. అనంతరం ప్రత్యేక ప్రతినిధిగా హాజరైన శ్రీలంక మంత్రి పతిరాణకు జాగృతి ఫెల్లో షిప్ ఇవ్వడంతో పాటు సత్కరించారు. గవర్నర్ సతీమణి విమలా నరసింహన్ ప్రతినిధుల స్థానంలోనే ఆసీనులై కార్యక్రమాన్ని తిలకించారు. ఏవరెస్టు శిఖరాన్ని అతి పిన్న వయస్సులో అధిగమించిన మాలవత్ పూర్ణ, రెజ్లర్ బబితా పోగొట్ తదితరులకు గవర్నర్ నరసింహన్ యంగ్ అచీవ్‌మెంట్ అవార్డులను ప్రదానం చేశారు. లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును వాటర్‌మ్యాన్ రాజేందర్ సింగ్ అందుకున్నారు.

కీచక మాల్ యజమాని

(మొదటిపేజీ తరువాయి)

షాపింగ్ మాల్‌లో మూడు నెలల నుంచి పనిచేస్తోంది. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి యువతిని మాల్ యజమాని పులిజల వివేకానంద లైంగికంగా వేధిస్తున్నాడు. ఈ విషయం యువతి తల్లికి చెప్పగా వివేకానందను హెచ్చరించింది. అయినా కూడా అతడి ప్రవర్తనలో మార్పు రాకపోగా ఏకంగా తల్లినే కూతురిని తన వద్దకు పంపించాలని వేధించడం ప్రారంభించాడు. యువతి ఉద్యోగం మానివేసినా కూడా షాపింగ్ యజమాని వేధింపులు మానకపోవడంతో మనస్థాపంచెందిన కన్యాకుమారి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి గతంలోనే మృతి చెందడం, తల్లి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, షాపింగ్ యజమాని వివేకానందను అరెస్టు చేశామని మైలార్‌దేవ్ పల్లి ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ప్రజలు మెచ్చేలా సభ నిర్వహణ

(మొదటిపేజీ తరువాయి)

వచ్చినవారు కాదన్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ప్రజల ఆశయాలు, ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా సభలో హుందాగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. సభా నియమాలు, నిబంధనలపై తొలిసారిగా ఎన్నికైన సభ్యులకు శిక్షణా తరగతులను నిర్వహిస్తామని, రాష్ట్ర ప్రయోజలను దృష్టిలో పెట్టుకొని సభ్యులందరికీ మాట్లాడే అవకాశం తప్పకుండా ఉంటుందని, గాడి తప్పి మాట్లాడిన వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో సభకు పంపారని, ఖచ్చితంగా అందరికీ మాట్లాడే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపు అంటే శాసనసభ్యులు తమ సొంత ఇష్టంతో పార్టీ మారుతుంటారని, పార్టీలలో చేరికలపై తేడాలు ఉంటే చర్యలు తప్పవని ఒక ప్రశ్నకు సమాధానంగా బదులిచ్చారు. రాష్ట్ర రెండవ శాసనసభ తొలి సమావేశాలు ముగిసిన అనంతరం ఆదివారం సాయంత్ర పోచారం శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ప్రజల చేత ఎన్నుకోబడిన తర్వాత సభ్యులకు మరింతగా బాధ్యతలు పెరిగాయని, అహం భావం పెరగకూడదన్నారు. ఎంత ఎదిగితే అంత ఒదిగి ఉండాలనే వాస్తవాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఇదొక పవిత్రమైన సభ అని, రాష్ట్రానికే ఉన్నతమైనదని గుర్తుచేశారు. ఇక్కడ ప్రతీ ఒక్కరూ హుందాగా వ్యవహరించాలని, పేదల అభ్యున్నతి, రైతాంగం శ్రేయస్సు కోసం ఫలప్రదమైన చర్చలు జరిపి వారి ఆశయాలను నెరవేర్చాల్సిన కర్తవ్యాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యులంతా అనుభవజ్ఞులేనని, సభా గౌరవాన్ని కాపాడే విధంగా సహకరిస్తారని ఆశిస్తున్నానని అన్నారు. అడ్డగోలు విమర్శలతో ప్రయోజనం లేదని, ప్రజలు ఇచ్చిన విలువైన అవకాశాన్ని, సమయాన్ని కాపాడుకుని నడుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

శాసనసభ నిర్వహణలోనూ ఆదర్శంగా ఉందాం : తెలంగాణ రాష్ట్రం కొత్తగా ఏర్పడినదే అయినా రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీటి రంగానికి ఇస్తున్న ప్రాధాన్యత తదితర పథకాల అమలు దేశానికే ఆదర్శంగా మారాయని, చాలా రాష్ట్రాల నేతలు ఆశ్చర్యపోతున్నారని, ఇకపైన శాసనసభ నిర్వహణలో సైతం అదే తరహా గుర్తింపును తీసుకురావాలని, దేశమే గర్వించే స్థాయిలో నిర్వహించుకోవాలని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అభిప్రాయపడ్డారు. ఇందుకోసం తగిన ప్రణాళికలతో వ్యవహరిద్దామని, సభ్యులంతా వారి బాధ్యతలను, సభా సంప్రదాయాలను గుర్తెరిగినప్పుడు ఇది కష్టమేమీ కాదన్నారు. సభలో కొత్త సభ్యులు అనుకోని సందర్భంలో ఏదైనా తప్పులు చేసినట్లయితే సరిదిద్దుకోడానికి సీనియర్ల సహకారంతో పాటు మీడియా కూడా సంయమనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. సభలో ప్రతీ నిమిషం, మాట చాలా విలువైనదని, ఇష్ట మొచ్చినట్లు మాట్లాడితే సభా సమయం వృధా అవుతుందని, ప్రజలు ఏమనుకుంటారో సభ్యులంతా ఆలోచించాలని కోరారు. ప్రజలకు సంబంధించిన అంశాలపై సభలో చర్చించడానికి ప్రతీ ఒక్కరికీ అవకాశం ఉంటుందని, వీలైనంత ఎక్కువ రోజుల పాటు సభను నడుపుకునేందుకు తనవైపు నుంచి తన సహకారం ఉంటుందన్నారు. స్పీకర్ ఎన్నికల ఏకగ్రీవమయ్యేందుకు కృషి చేసిన ముఖ్యమంత్రి కెసిఆర్‌కు, సహకరించిన అన్ని పార్టీల నేతలకు పోచారం శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

నేడే తొలివిడత

(మొదటిపేజీ తరువాయి)

మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఆ తరువాత వార్డుల వారీగా సభ్యులకు, పంచాయతీ సర్పంచ్‌కు వచ్చిన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. వార్డు సభ్యులందరూ వారిలో ఒకరిని ఉపసర్పంచ్‌ను ఎన్నుకుంటారు. అన్ని జిల్లాల్లో మొదటి విడతలో ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీల్లో 34,010 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. సర్పంచ్ పదవికి 12,202 మంది, వార్డు మెంబర్‌కు 70,094 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. దాదాపు 70 వేల మంది పోలింగ్ సిబ్బంది (బూత్) వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్‌లకు కొందరు ఆదివారం సాయంత్రం చేరుకోగా, దగ్గరగా ఉన్నవారు ఉదయం 6 గంటల వరకు చేరుకున్నారు. మొత్తం రాష్ట్రవ్యాప్తంగా 1.10 లక్షల బ్యాలెట్ బాక్సులు జిల్లా కేంద్రాల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధంగా ఉంచింది. అలాగే ఓటరు ఓటు వేసేందుకు బ్యాలెట్ పేపర్‌లను మొత్తం 3.50 కోట్లు ముద్రించింది. వీటన్నింటిని అవసరాలకు అనుగుణంగా ఆయా జిల్లా కేంద్రాల నుంచి మండల కేంద్రాలకు రాష్ట్ర ఎన్నికల సంఘం పంపింది. ఏయే మండలాల్లోని పంచాయతీలకు, వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయో వాటికి అనుగుణంగా పోలింగ్ సిబ్బందికి బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్‌లను అధికారులు అందించారు. వాస్తవానికి మొదటి విడతలో మొత్తం 4479 పంచాయతీలకు, 39,616 వార్డులకు ఈ నెల 7వ తేదీన రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చింది. అందులో 769 పంచాయతీలు, 10,654 వార్డులు ఏకగ్రీవమైనాయి. అలాగే నామినేషన్ల దాఖలు కాకపోవడం, వేసినవి తిరస్కరణ గురికావడంతో 11 పంచాయతీలకు ఎన్నిక జరగడం లేదు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల్లో మొత్తం 1.49 కోట్ల ఓటర్లు ఉన్నారు.

750 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్ : పంచాయతీ ఎన్నికల్లోనూ రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్ క్యాస్టింగ్ చేయనుంది. మొత్తం 34,010 పోలింగ్ కేంద్రాలకు గాను సమస్యాత్మక కేంద్రాలైన 750 చోట్ల వెబ్‌క్యాస్టింగ్ చేయాలని నిర్ణయించారు. నేరుగా రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంతో పాటు, డిజిపి, జిల్లా ఎస్‌పి కార్యాలయాల్లో పోలింగ్, ఓట్ల లెక్కింపును పరిశీలించనున్నారు. వెబ్‌క్యాస్టింగ్ కాకుండా మిగతా చోట్ల వీడియో రికార్డింగ్ చేయనున్నారు.

పంచాయతీలో మొదటిసారి నోటా

పంచాయతీ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్‌లో మొదటి సారి నోటా గుర్తును అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో అభ్యర్థులకు ప్రతి ఓటూ కీలకం కానుంది. అలాగే గుర్తుపై కాకుండా అటు ఇటు మధ్యలో వేసినా ఓటు చెల్లదని అధికారులు చెబుతున్నారు. ఏమైనా ఇబ్బందులు తలెత్తితే పోలింగ్ అధికారులు తమకు సమాచారం ఇచ్చి, లెక్కింపును నిలిపివేసే అవకాశం ఉందన్నారు.

మొదటి విడత ఎన్నికలు జరిగే పంచాయతీలు, వార్డులు

జిల్లా పేరు	పంచాయతీ సర్పంచ్	వార్డులు
ఆదిలాబాద్	103	638
ఆసిఫాబాద్	95	634
మంచిర్యాల్	101	753
నిర్మల్	77	480
జగిత్యాల్	121	821
కరీంనగర్	93	728
పెద్దపల్లి	102	795
సిరిసిల్ల	67	533
కొత్తగూడెం	150	1181
ఖమ్మం	167	1460
గద్వాల	76	620
మహబూబ్‌నగర్	205	1592
నాగర్‌కర్నూల్	118	972
వనపర్తి	62	502
మెదక్	122	948
సంగారెడ్డి	235	2080
సిద్ధిపేట	165	1395
నల్లగొండ	252	1914
సూర్యాపేట	145	1166
భువనగిరి	102	809
కామారెడ్డి	133	1020
నిమామాబాద్	141	1004
మేడ్చల్	29	282
రంగారెడ్డి	159	1342
వికారాబాద్	215	1632
జనగాం	82	640
భూపాలపల్లి	125	977
మహబూబాద్	120	930
వరంగల్ రూరల్	100	794
వరంగల్ అర్బన్	39	334
మొత్తం	**3701**	**28,976**

ఎయిర్‌పోర్టుల్లో హైఅలర్ట్



మన తెలంగాణ/శంషాబాద్ : రిపబ్లిక్ డే దినోత్సవం సందర్భంగా దేశంలోని అన్ని ఎయిర్‌పోర్టుల్లో హైఅలర్ట్‌ను విధించినట్లు ఆదివారం జిఎంఆర్ ఎయిర్‌పోర్టు అధికారులు మీడియాకు తెలిపారు. ఈ హైఅలర్ట్ ఈనెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. దేశీయా, అంతర్జాతీయ విమానా ప్రయాణికులు సాధ్యమైనంత త్వరగా డిపార్చర్‌కు వచ్చి బ్యాగేజ్ చెకింగ్ చేయించుకోవాలన్నారు. ఎయిర్‌పోర్టులోని అన్ని రకాల పాసులను సైతం నిషేధిస్తున్నట్లు తెలిపారు. ఈ అసౌకార్యాన్ని ప్రయాణీకులు మన్నించి అధికారులకు సహకరించాలని కోరారు. హైఅలర్ట్‌తో ఎయిర్‌పోర్టులోని ఎయిర్‌పోర్టు విలేజి, పార్కింగ్, రోటరీ, అన్నిప్రాంతాల్లో డాగ్ స్కాడ్, సిఐఎస్‌ఎఫ్, స్థానిక పోలీసులతో అణువణువు తనిఖీ చేస్తున్నారు.

కాళేశ్వరం సందర్శించిన డిఐజి బృందం



మన తెలంగాణ/ధర్మారం : కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనలో భాగంగా మేడారంలోని ఆరవ ప్యాకేజీని కరీంనగర్ రెంజ్ డిఐజి ప్రమోద్ కుమార్ బృందం ఆదివారం నాడు సందర్శించారు. డిఐజి ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో టిఎస్‌సిఎస్సీ సభ్యులు సి.విఠల్, రాష్ట్ర ఉన్నత విద్య కౌన్సిల్ వైస్ చైర్మన్ వి.వెంకటరమణ, రిటైర్డ్ న్యాయమూర్తి రాజేంద్రకుమార్, టిఎస్ జిఓ అధ్యక్షులు జగదీష్ బృందం సందర్శించారు. భూగర్భంలోని సొరంగ మార్గాలతోపాటు, సర్జిపూల్, పంపుహౌస్‌లు, గ్యాస్ అధారిత స్టేషన్‌ను, డిఐజి బృందం సందర్శించారు. ఈ సందర్భంగా ఇఇ నూనె శ్రీధర్, ఎఇఇ ఉపేందర్ వివరించారు. ఈ సందర్భంగా ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ కాళేశ్వరం పనుల నిర్మాణం అద్భుతంగా వుందని కితాబు నిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం పనుల్ని యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేసిన ఇంజనీరింగ్ బృందాన్ని అభినందించారు. డిఐజి బృందం రాకతో ధర్మారం ఎస్ఐ కె.ప్రేమ్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

భద్రాద్రి రామయ్యకు రూ.20లక్షలు విరాళం



మన తెలంగాణ / భద్రాచలం : సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి వెంకటేశ్వరరావు అనే భక్తుడుఆదివారం రూ.20 లక్షల విరాళం అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా బాపులపాడుకు చెందిన యార్లగడ్డ వెంకటేశ్వరరావు, తన భార్య యార్లగడ్డ సీతమ్మ జ్ఞాపకార్థం నిత్యాన్నదానికి రూ.6 లక్షలు, గోశాల నిర్మాణానికి రూ.6 లక్షలు, గుట్టపై కాటేజి నిర్మాణానికి మరో రూ.8 లక్షలు ఆలయ అధికారులకు చెక్కుల రూపంలో అందజేశారు. ఆయనను దేవస్థాన అర్చకులు ఆశీర్వదించి, ఆలయ లాంఛనాలతో శాలువా కప్పి సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మన తెలంగాణ/ కొత్తగూడెం క్రైం : కొత్తగూడెం పట్టణంలోని సంతగ్రౌండ్ వద్ద నేషనల్ హైవే రోడ్డు పనులు చేస్తున్న వాహనం ఢీకొని ఆదివారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ట్రాఫిక్ అదనపు ఎస్ఐ హఫీజ్ కథనం ప్రకారం... రామవరం వైపు నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని నేషనల్ హైవే పనులుచేస్తున రోడ్డుపై పోసే మట్టిని చదును చేసేయంత్రం రివర్స్ చేస్తుండగా దాని కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు వాహనం కిందినుండి మృతదేహాన్ని తీసి, కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా ఎవరూ ఫిర్యాదు ఇవ్వడానికి ముందుకు రాకపోవటంతో ప్రమాదం జరిగిన ఏరియా విఆర్‌ఓ కృష్ణారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ట్రాఫిక్ అదనపు ఎస్ఐ హఫీస్ దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వద్ద ఒక చిన్న టార్చ్‌లైట్, సంచిలో ఒక దుప్పటి ఉందని, తెల్లటిచొక్కా, బూడిదరంగు పాత ప్యాంటు, బూడిదరంగు స్వెట్టర్ దరించి ఉన్నాడని, 55 ఏళ్ల వయస్సు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఆదివారం కొత్తగూడెంలో సంత ఉంటుంది. రాత్రి గ్రామంలో బయలు దేరి సంతకేమైనా వస్తున్నాడా? అని కూడా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పనుల్లో కూడా ఎటువంటి జాగ్రత్తలు, ముందస్తు హెచ్చరికలు లేకుండా నిత్యం రద్దీగా ఉండే కొత్తగూడెం_విజయవాడ రోడ్డుపై కాంట్రాక్టర్ పనులు చేయిస్తున్నాడు. అంతేకాకుండా పాతరోడ్డు తవ్వి ఆ రోడ్డు శిథిలాలు లోడ్ చేసే ముందు కూడా ఏ జాగ్రత్తలు తీసుకోవటం లేదన్న విమర్శ ఉంది. ఇప్పటికైనా పోలీసు శాఖ, నేషనల్ హైవే అధికారులు కాంట్రాక్టర్ తగిన జాగ్రత్తలు తీసుకుని పనులుచేసే విధంగా చూడాలని పలువురు కోరుతున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



మన తెలంగాణ / సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇటీవల సంచలనం రేపిన పత్రి సాయి హత్యకేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే ఆదివారం సాయంత్రం సిరిసిల్లలో ప్రకటించారు. వేములవాడ పట్టణానికి చెందిన పత్రి సాయి అనే యువకున్ని ఈనెల 15న అతని స్నేహితులైన కవిరాజు, నాగరాజు, అజయ్ భార్గవ్, కృష్ణ అలియాస్ కిట్టు, నగేశ్ అనే వ్యక్తులు చీర్లవంచచింతలఠాణ గుట్టల మధ్య హత్య చేసి పారిపోయారని ఎస్‌పి వివరించారు. వేములవాడకు చెందిన కవిరాజును పది రోజుల క్రితం అదే గ్రామంలోని సుభాస్‌నగర్ ప్రాంతానికి చెందిన రాము, మరి కొందరు పిలిపించి తమ గురించి బామ్మర్థులు అని వ్యాఖ్యానించావెందుకని కొట్టారు. తనను సుభాస్‌నగర్‌కు చెందిన వారు కొట్టడానికి తన మిత్రుడైన పత్రి సాయి సమాచారం ఇవ్వడమే కారణమని భావించి అతన్ని హతమార్చాలని నిర్ణయించుకున్న కవిరాజు తన స్నేహితులైన నాగరాజు, అజయ్ భార్గవ్, కృష్ణ అలియాస్ కిట్టు, నగేశ్ అనే వారి సహకారం కోరగా వారు కూడా అందుకు అంగీకరించారని ఎస్‌పి వివరించారు. దీంతో ప్రణాళిక ప్రకారం ఈనెల 15న సంక్రాంతి రోజు పత్రి సాయికి మద్యం తాగించి అక్కడి నుండి కవి రాజు తమ స్వగ్రామమైన చింతలఠాణలో తన స్నేహితుని బర్త్‌డే కార్యక్రమానికి వెల్దామని సాయిని ఒప్పించి చింతలఠాణచీర్లవంచ గ్రామాలమధ్యగల గుట్టల వద్దకు వెళ్లిన తరువాత సాయిని తీవ్రంగా కర్రలతో కొట్టి ఆ తరువాత కృష్ణ అలియాస్ కిట్టు షర్ట్ విప్పి దాంతో సాయి గొంతుకు ఉరి బిగించారని, ఆ సమయంలో కళ్లు తేలవేసిన సాయిని తమతో తెచ్చుకున్న బ్లేడ్లతో గొంతును ఒకరి తరువాత ఒకరు కోసి చంపారని, ఆ తరువాత అక్కడినుండి హైదరాబాద్‌కు పారిపోయారని ఎస్‌పి వివరించారు. తమవెంట తీసుకపోయిన డబ్బు అయిపోగానే ఆదివారం వేములవాడకు తిరిగి వస్తుండగా తంగళ్లపల్లి మండలంలోని టెక్స్‌టైల్ పార్క్ వద్ద వారిని పోలీసులు పట్టుకున్నారని ఎస్‌పి వివరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి వెంకటరమణ, సిఐ అనిల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

హామీల అమలుపై దృష్టి సారించాలి

మన తెలంగాణ / హైదరాబాద్ : ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నరసింహన్ చేసిన ప్రసంగంపై అసంతృప్తి వ్యక్తం చేసిన విపక్ష సభ్యులు ఆ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రభుత్వానికి పలు సూచనలు చేయడంతోపాటు వివిధ అంశాలపై వివరణ కోరారు. ప్రజలు ఎంతో విశ్వాసంతో భారీ మెజారిటీతో గెలిపించి అధికారాన్ని కట్టబెట్టినందున వారి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం నడుచుకోవాల్సిన అవసరం ఉందని విపక్ష సభ్యులు వ్యాఖ్యానించారు. చర్చ సందర్భంగా కాంగ్రెస్ సభ్యుడు గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో రుణమాఫీని ఏక కాలంలో చేయాలని కోరారు. దీనివల్ల రైతులకు మేలు జరుగుతుందని, వడ్డీ భారం తగ్గుతుందని అన్నారు.





పింఛన్లను రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చిన టిఆర్‌ఎస్ నిర్దిష్టంగా ఎప్పటి నుంచి అమలు చేస్తుందో స్పష్టతనివ్వాలన్నారు. నిరుద్యోగ భృతిని ఎప్పటి నుంచి, ఏ విధంగా అమలు చేస్తారనే విషయాన్ని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. వరుస ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉంటోందని, అభివృద్ధి కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. రాజ్యాంగ నిబంధనల మేరకు పూర్తిస్థాయిలో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని సూచించారు. భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత గ్రామాల్లో ఇంకా చాలా మంది రైతులకు పట్టాదారు పాస్ బుక్కులు అందలేదన్నారు. రెవెన్యూ అధికారులకు లంచం ముట్టజెప్పుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. పోడు రైతులను అటవీ శాఖ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని, భూమి పట్టా, పాస్‌బుక్కులున్నా వేధిస్తున్నారని గుర్తుచేశారు.

ఉత్తమ్ గడ్డం మరో పదేళ్లు అలానే ఉంటుంది : అహ్మద్ బలాల

తెలంగాణ పిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని పరోక్షంగా ప్రస్తావించిన ఎంఐఎం సభ్యుడు అహ్మద్ బలాలా, మరో పదేళ్ళపాటు ఆ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశమే లేదని, ఒసామాబిన్ లాడెన్ తరహాలో ఆయన గడ్డం పెరుగుతూనే ఉంటుందన్నారు. నగరంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రజలు కూడా టిఆర్‌ఎస్‌కే ఓటు వేశారని, చంద్రబాబు వచ్చి ప్రచారం చేసినా స్పష్టమైన నిర్ణయాన్ని తీసుకున్నారని గుర్తుచేశారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం వల్ల రాష్ట్రంతోపాటు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు అభివృద్ధి చెందాయన్నారు. అందుకే తమ పార్టీ టిఆర్‌ఎస్‌కు అండగా నిలిచిందని తెలిపారు. చిన్నపాటి ఘర్షణ కూడా లేకుండా రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. ఎపి సిఎం చంద్రబాబును లూటీకోర్, గజదొంగగా బలాలా అభివర్ణించారు. తాను సినిమాల్లో గబ్బర్ సింగ్ పాత్రను చూశానని, ఇప్పుడు ఎన్నికల సందర్భంగా చంద్రబాబును చూశానన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ టిఆర్‌ఎస్, ఎంఐఎం కలిసే ఉంటాయన్నారు. టిఆర్‌ఎస్‌కు 16, ఎంఐఎం ఒక పార్లమెంట్ స్థానం తథ్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో సైతం చంద్రబాబును ప్రజలు 'గెటవుట్' అంటారని, తెలుగుదేశం పార్టీ ఓడిపోక తప్పదన్నారు. పాతబస్తీ యువత అభివృద్ధి కోసం ఐటి పార్కును అభివృద్ధి చేయడంతోపాటు ప్రత్యేక నిధులు, ఉస్మానియా నూతన ఆసుపత్రి భవన నిర్మాణం పనులు చేపట్టాలని కోరారు.



గుడుంబా వ్యాపారులకు పునరావాసం: రాజాసింగ్

పాతబస్తీలోని గుడుంబా వ్యాపారులకు ప్రభుత్వం తగిన పునరావాసం కల్పించాలని బిజెపి శాసనసభ్యుడు రాజాసింగ్ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. స్వయంగా ధూల్‌పేటలో పర్యటిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినా రాలేదని, గుడుంబాను మానుకున్నవారికి తగిన ఉపాధి అవకాశాలను, పునరావాసాన్ని కల్పిస్తానని స్పష్టం చేసినా అమలులోకి రాలేదని గుర్తుచేశారు. నాలుగేళ్ళ టిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో కెసిఆర్ కిట్, కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు చాలా బాగున్నాయన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియాతోపాటు క్రికెట్ బెట్టింగ్ జోరుగా సాగుతోందని, దీన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రికి నూతన భవనాన్ని నిర్మించాలని, దాదాపు నాలుగేళ్ళపాటు శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నప్పటికీ ఇటీవలికాలంలో బహిరంగంగా నడిరోడ్లపైనే హత్యలు, నేరాలు జరుగుతున్నాయని, వీటిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ నిర్మాణం మందకొడిగా సాగుతోందని, వేగవంతం చేయాలని సూచించారు.

ప్రభుత్వం రాసిచ్చిందే గవర్నర్ చదవాలి : కెసిఆర్

గవర్నర్ ప్రసంగంపై అభ్యంతరం వ్యక్తం చేసిన కాంగ్రెస్ సభ్యుడు గండ్ర వెంకటరమణారెడ్డికి ముఖ్యమంత్రి కెసిఆర్ చురకలంటించారు. గవర్నర్ తాను స్వంతంగా ప్రసంగాన్ని రూపొందించుకోరని, ప్రభుత్వమే తయారు చేసి ఇస్తుందని, మంత్రివర్గం ఆమోదం ఉన్న ప్రసంగాన్నే సభలో చదవాలని కెసిఆర్ స్పష్టం చేశారు. ఇది గవర్నర్ ప్రసంగమే తప్ప బడ్జెట్ కాపీ కాదని, అందువల్లనే హామీల అమలుకు నిర్ణీత గడువు లాంటి అంశాలు ఉండవన్నారు. టిఆర్‌ఎస్ మేనిఫెస్టోలోని అంశాలే గవర్నర్ ప్రసంగంలో ప్రతిబింబిస్తాయని, టిఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రసంగంగా ఉందని గండ్ర వ్యాఖ్యానించడం ఆయన అపరిపక్వతను తెలియజేస్తోందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్‌లోని ప్రభుత్వాలను కాంగ్రెస్ ప్రభుత్వాలే అంటారని, తెలంగాణలో టిఆర్‌ఎస్ ప్రభుత్వంగానే వ్యవహరిస్తారన్నారు. ప్రజాస్వామ్య పరిణతి కలిగిన వారు అలాంటి వ్యాఖ్యలు చేయరని తెలిపారు. ప్రభుత్వాలకు పార్టీలే పునాదులని గుర్తుచేశారు. గవర్నర్‌ను టిఆర్‌ఎస్ గవర్నర్ అని పిలవడం సరికాదని, పార్టీకో గవర్నర్ ఉండరని, రాష్ట్రానికి ఒక్కరే గవర్నర్ ఉంటారన్నారు. అందువల్ల గండ్ర వ్యాఖ్యలను రికార్డుల్లోంచి తొలగించాలని స్పీకర్‌కు కెసిఆర్ సూచించారు. సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క జోక్యం చేసుకుని, సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చిన అంశాలకు వివరణ ఇవ్వాలే తప్ప వారిని దెప్పిపొడిచే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వాలు ఏమీ చేయలేదని చెప్పడం కూడా సరికాదన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రతీ ఏడాది రైతు సదస్సులు జరిగాయన్నారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వంలో మాత్రం రెవెన్యూ రికార్డు మార్పులు జరిగాయన్నారు. అయినంత మాత్రాన గత పాలకులపై నింద వేయడం సరికాదన్నారు. భట్టి వ్యాఖ్యలపై కూడా కెసిఆర్ ఘాటుగానే స్పందించి గత ప్రభుత్వాల హయాంలో జరిగిన అంశాలను గుర్తుచేశారు. అరవై లక్షల ఇందిరమ్మ ఇళ్ళు కట్టినట్లు చెప్పుకుంటున్నా ఇంకా రాష్ట్రంలో ఇళ్ళులేని కుటుంబాలు లక్షల సంఖ్యలో ఎందుకున్నాయని ప్రశ్నించారు.



ధన్యవాదాల తీర్మానంపై చర్చలో విపక్షాలు

విద్యుత్ ఉద్యోగుల కేటాయింపుల్లో ఎపి కుట్ర

- ఆప్షన్లకు విరుద్ధంగా తెలంగాణలోకి జొప్పించేందుకు యత్నాలు
- వ్యతిరేకిస్తున్న తెలంగాణ విద్యుత్ ఇంజనీర్ల సంఘం

మన తెలంగాణ/హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగులను అక్రమంగా తెలంగాణ సంస్థలలోకి చొరబెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ అసోసియేషన్ (టిఇఇఎ) అధ్యక్షులు శివాజీ ఆరోపించారు. దీన్ని అడ్డుకునేందుకు ఉద్యోగులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం నాడు టిఇఇఎ కార్యాలయంలో సంఘం నేతలు మధుసూధనరెడ్డి, అశోక్, శ్రవణ్ కుమార్ గుప్త తదితరులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మొదటి నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల విభజనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని శివాజీ అన్నారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు 1150 మంది ఉద్యోగుల ఆప్షన్లు కోరితే అధిక భాగం ఆంధ్రాకే ఇచ్చారని స్పష్టం చేశారు. జస్టిస్ ధర్మాధికారి నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను కోర్టు నియమించగా, ఇప్పుడు దాన్ని అడ్డుపెట్టుకొని ఆంధ్రా ఇంజనీర్లు చొరబడేందుకు కుట్ర పన్నుతున్నారని తీవ్ర ఆరోపణ చేశారు. ముల్కీ నిబంధనలు పాటించడం లేదని, ఆంధ్రాలో 100 శాతం ఆంధ్రా వాళ్లే ఉన్నారని, తెలంగాణలో నలభై శాతం ఎపి వారే ఉన్నారని స్పష్టం చేశారు. తెలంగాణలో ఎలక్ట్రిసిటీలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తే, ఇప్పుడు ఆంధ్రా వాళ్లు చొరబడాలని చూడడం సబబుకాదన్నారు. ఒక్క ఎపి ఉద్యోగిని కూడా తెలంగాణ విద్యుత్ సంస్థల్లో అడుగు పెట్టనిచ్చేది లేదని, మరో ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఎపి వారిని తీసుకుంటే, ఇక్కడి వారికి అన్యాయం జరుగుతుందన్నారు. సమస్య పరిష్కారం దిశగా ప్రయత్నించాలని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబుకు శివాజీ బహిరంగంగా విజ్ఞప్తి చేశారు. గవర్నర్ చొరవ తీసుకొని ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. ఆప్షన్ల పేరుతో బలవంతంగా ఆంధ్రా ఉద్యోగులను ఇక్కడే కొనసాగించేలా చూస్తే ఊరుకునేది లేదని శివాజీ హెచ్చరించారు. వేలాది మందిని బస్సుల్లో, కార్లలో హైదరాబాద్‌కు తరలించి బలవంతంగా హైదరాబాద్ ఎస్‌పిడిసిఎల్‌లో చేర్పించేందుకు సిద్ధమవుతున్నారని, ఈ కుట్రపూరిత ఆలోచనలను ఉద్యోగులుగా అడ్డుకుంటామని, ప్రభుత్వం కూడా తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రా ఇంజనీర్లను మళ్లీ విధుల్లోకి తీసుకుంటే, రోజుకు రూ.50 లక్షల చొప్పున జీత,భత్యాల కింద వారికి చెల్లించాల్సి వస్తుందన్నారు. దీనికితోడు తెలంగాణ యువతకు, నిరుద్యోగులకు రావాల్సిన అవకాశాలు దక్కకుండా పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. టిఇఇఎ ప్రధాన కార్యదర్శి మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయినా, ఆంధ్రా ప్రాంత ఇంజనీర్లు ఇంకా తెలంగాణలో ఉండాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. 370 (డి) ఆర్టికల్ ప్రకారం అన్యాయంగా చొరబడ్డారని, వీరిని ప్రభుత్వం వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. విభజన జరుగకుండా చూస్తున్నారని ఆరోపిస్తూ, ఎపి ప్రభుత్వ తీరును ఖండించారు. తెలంగాణ ఎలక్ట్రికల్ అకౌంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్ మాట్లాడుతూ 1157 మంది ఎపి స్థానిక ఇంజనీర్లను వారి ప్రాంతానికి పంపించాలని సుప్రీంకోర్టులో మేం కొట్టాడుతున్నామన్నారు. ఆంధ్రా వారంతా వారి రాష్ట్రానికి వెళ్లాలని, తెలంగాణ వారికి న్యాయం జరిగేలా చూడాలని సుప్రీంకోర్టును కోరుతున్నామని స్పష్టం చేశారు.



లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి

మన తెలంగాణ/ఇల్లందు టౌన్ : లారీ ఢీ కొని వాహనదారుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికు లు తెలిపన వివరా ల ప్రకారం ... మండల పరిధిలోని నామాలపాడు గ్రామానికి చెందిన వ రుస వీరస్వామి (55) తన భార్య గురువమ్మతో కలసి పట్టణానికి సమీపంలోని రైల్వేగేట్ వద్ద గల చర్చిలో ప్రార్థనకు బయలుదేరాడు. కాగా చర్చి సమీపంలో అక్కడే ఆగివుందనకున్న లారీని డ్రైవర్ ఒక్కసారిగా వెనుకకు పోనివ్వడంతో అటుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న వీరస్వామికి బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతని భార్యకు గాయాలు కావడంతో స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరస్వామికి ముగ్గురు కూమార్తెలు, ఓ కుమారుడు వున్నారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటా అధ్యక్షుడిగా నాగర్‌కర్నూల్ వాసి

తిమ్మాజిపేట మండలం పోతిరెడ్డిపల్లికి దక్కిన అరుదైన గౌరవం



మన తెలంగాణ/నాగర్‌కర్నూల్ ప్రతినిధి : అమెరికాలోని తెలుగు అసోసియేషన్ (ఆటా) నూతన అధ్యక్షుడిగా నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం, పోతిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన పరమేష్ భీం రెడ్డి పదవి బాధ్యతలు చేపట్టారు. ఇది నాగర్‌కర్నూల్ జిల్లాకు దక్కిన అరుదైన గౌరవంగా చెప్పవచ్చు. పరమేష్ భీంరెడ్డి వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. భీంరెడ్డి కొండారెడ్డి, కుమారుడైన పరమేష్ భీంరెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ పూర్తిచేసి 1991లో ఉన్నత విద్యను అభ్యసించడానికి అమెరికా వెళ్లి న్యూయార్క్‌లో విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. వృత్తిరీత్య కంప్యూటర్ ఇంజనీర్ అయినా పరమేష్ భీంరెడ్డి సాఫ్ట్‌వేర్ వ్యాపారాన్ని స్థాపించి ఇక్కడి ప్రాంతానికి చెందిన వారందరితో అమెరికాలో స్థిర పడటానికి సహాయ పడ్డారు. వారందరు అక్కడ మంచి హోదాలో కొనసాగుతున్నారు. ఆయన భార్య స్వర్ణ వృత్తిరీత్య వైద్యురాలు. ఆమె ప్రముఖ కార్డియాలజిస్ట్‌గా అక్కడే ప్రాక్టీస్ చేస్తున్నారు. అమెరికాలోని తెలుగు వారిని ఐక్యం చేస్తూ పలుపదవులు నిర్వర్తించారు. 1992లో ఆటాలో చేరిన పరమేష్ భీంరెడ్డి పలు హోదాలో పనిచేశారు. ప్రముఖంగా 12వ సదస్సుకు కార్యదర్శిగా, 13వ సదస్సుకు ఆయన సమన్వయ కర్తగా వ్యవహరించారు. భీంరెడ్డి పాలమూరు జిల్లాలోని ఎన్‌ఆర్‌ఐలతో కలిసి అమెరికాలో పాలమూరు ఎన్‌ఆర్‌ఐ ఫోరం స్థాపించి అనేక కార్యక్రమాలను మహబుబ్ నగర్ జిల్లాలో చేపట్టారు. 2017లో ఆటా అధ్యక్షుడిగా ఎన్నుకోబడి జనవరి 19. 2019న పరమేష్ భీం రెడ్డి ఆటా నూతన అధ్యక్షుడిగా నూతన బాధ్యతలు చేపట్టారు. అమెరికా తెలుగు సంఘం (ఆటా) అమెరికాలో తెలుగు సంతతి ప్రజల కోసం సుమారు 30 ఏళ్ల కింద స్థాపించిన సంఘం. తెలుగు సాహితి, సంస్కృతి, విద్యా, ఆరోగ్య, వ్యాపార, ధార్మిక, సాంఘిక, సామాజిక కార్యకలాపాలను చేపడుతూ జాతీయ స్థాయిలో ఆ సంఘం తమ సేవలను అందిస్తుంది. తెలుగు సంతతి ప్రజల కోసం స్థాపించిన ఈ సంఘం విదేశాలలో తెలుగు ఖ్యాతిని పరిరక్షించేందుకు పనిచేస్తుంది, అమెరికా, భారత్‌లోని తెలుగు సంతతి విద్యార్థులు, శాస్త్రవేత్తలు, వృత్తి విద్యానిపుణులు కలిసి అభిప్రాయాలు పంచుకునేలా మిలియన్ల డాలర్లు వెచ్చించి ప్రతి రెండేళ్లకు ఒకసారి అమెరికాలోని వివిధ నగరాలలో పెద్ద ఎత్తున సదస్సును నిర్వహిస్తుంది. అమెరికాలో నిర్వహించే కార్యక్రమాలకు తెలుగు పండితులు, కళాకారులు, వృత్తికళాకారులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులను రప్పించి అమెరికాలోని ఇక్కడి వారిచే ఉపన్యాసాలు, ప్రదర్శనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఈ సంఘం నిర్వహిస్తూ వస్తుంది. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన పరమేష్ భీంరెడ్డి అమెరికాలోని ఆటాకు అధ్యక్షుడిగా నియమించబడటం పట్ల జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జనంతో కిక్కిరిసిన కొమురవెల్లి



- ఘనంగా ప్రారంభమైన మల్లన్న బ్రహ్మోత్సవాలు
- వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- మల్లన్నను దర్శించుకున్న ప్రముఖులు
- భగవన్నామస్మరణతో పులకించిన ఆలయ ప్రాంగణం



మన తెలంగాణ / సిద్దిపేట ప్రతినిధి (కొమురవెల్లి) : పవిత్ర పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. వేలాది మంది భక్తజనం స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని తమ మొక్కులను, ముడుపులను తీర్చుకున్నారు. శనివారమే ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు చేరుకోవటం వల్ల జనంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. భగవన్నామస్మరణతో ఆలయం మారుమోగింది. భక్తులు కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారికి పట్నాలు వేసి, బోనాలు సమర్పించటంతోపాటు అభిషేకాలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రేణుకా ఎల్లమ్మకు బోనాలు తీసి, పట్నాలు వేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివసత్తుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు బోనాలు సమర్పించి తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. స్వామివారి దర్శనానికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయ చైర్మన్ సంపత్, పాలక మండలి, ఇఒ వెంకటేశం ఆధ్వర్యంలో తగు ఏర్పాట్లు చేశారు. భక్తుల సౌకర్యార్థం వైద్య శిబిరాలు, తాగునీటి సౌకర్యం కల్పించారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఘనస్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందించారు.

పటిష్టమైన బందోబస్తు : అడిషనల్ డిసిపి

బ్రహ్మోత్సవాల సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అడిషనల్ డిసిపి గోవిందు నర్సింహ్మారెడ్డి తెలిపారు. హుస్నాబాద్ ఎసిపి మహేందర్‌తో కలిసి ఆయన ఆదివారం ఆలయ ప్రాంగణాన్ని సందర్శించి మాట్లాడారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆలయంతోపాటు పరిసర ప్రాంతాల్లో 70 సిసి కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘాను కొనసాగిస్తున్నామన్నారు. ఆలయ ప్రాంగణంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి భక్తులకు తగు సూచనలు అందిస్తున్నామని అన్నారు. ఆయన వెంట చేర్యాల సిఐ రఘు, కొమురవెల్లి ఎస్ఐ సతీష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కొమురవెల్లిలో ఆధ్యాత్మికశోభ

మన తెలంగాణ / సిద్దిపేట ప్రతినిధి (కొమురవెల్లి) : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న జాతరలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మూడు నెలలపాటు జరిగే మల్లన్న బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేలాది సంఖ్యలో భక్తులు తరలిరావటంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు స్వామివారికి పట్నాలు వేసి, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పట్నం వారంగా పిలిచే మొదటి వారంలో భక్తులు లక్షలాది సంఖ్యలో పాల్గొంటారని ఆలయ కమిటీ అంచనా వేసింది. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ సెవెల్లి సంపత్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టారు.



మన తెలంగాణ
హైదరాబాద్
సోమవారం 21, జనవరి 2019
www.manatelangana.news

ట్విట్టర్‌లో నా ఫాలోవర్ల సంఖ్య మూడు మిలియన్ల మార్క్‌కు చేరడం ఆనందంగా ఉంది. ఇది నా బలం కాదు... మీ ఆశీర్వాదం. మూడు మిలియన్ల ఫాలోవర్లు నాపై చూపించిన ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు.
-స్టార్ హీరో అల్లు అర్జున్



'మిస్టర్ మజ్ను' ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నాగార్జున, ఎన్టీఆర్, అఖిల్, నాగచైతన్య, నిధి అగర్వాల్, వెంకీ అట్లూరి, బివిఎస్ఎన్ ప్రసాద్, థమన్ తదితరులు

ఆ గుణం అఖిల్‌లో ఉన్నట్లు ఎవరికీ ఉండదు

అఖిల్ అక్కినేని హీరోగా శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పి పతాకంపై 'తొలిప్రేమ' ఫేం వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'మిస్టర్ మజ్ను'. బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్ ఈనెల 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ హైదరాబాద్‌లోని జెఆర్‌సి కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్టీఆర్ విడుదల చేసిన థియేట్రికల్ ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ట్రైలర్ విడుదలైన 3 గంటల్లోనే 1 మిలియన్ వ్యూస్, 12 గంటల్లో 2 మిలియన్ వ్యూస్, 15 గంటల్లో 3 మిలియన్ వ్యూస్ సాధించి దూసుకెళ్తోంది. ఇదే వేదికపై 'మిస్టర్ మజ్ను' తొలి టికెట్‌ను నాగార్జున చేతుల మీదుగా ఎన్టీఆర్ కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ "ఎన్టీఆర్ మా పెద్దబ్బాయి. నన్ను ఎంతో ఆప్యాయంగా బాబాయ్ అని పిలుస్తుంటా డు. తారక్ నుండి అఖిల్ మాస్ యాక్టింగ్ నేర్చుకోవాలి. బివిఎస్ఎన్ ప్రసాద్‌కు నిర్మాతగా ఇది 25వ సినిమా. ఆయన ప్రొడక్షన్‌లో అఖిల్ ఈ సి ని మా చేయడం చాలా ఆనందంగా ఉంది. వెంకీ అట్లూరి చిత్రం 'తొలిప్రేమ' చూశాను. లవ్‌స్టోరీకి ఏ అంశాలు కావాలో అతనికి బాగా తెలుసు. నవ్వించడం, ఏడిపించడం, ప్రేమించడం వెంకీకి బాగా తెలుసు. ఈ సినిమాలోని పాటలు బావున్నాయి. సినిమా తప్పకుండా హిట్ అవుతుంది"అని అన్నారు. ఎన్టీఆర్ మాట్లాడుతూ "ఈ వేడుకకు నేను అతిథిగా కాకుండా కుటుంబ సభ్యుడిలా వచ్చాను. నాగార్జున, చైతన్య, అఖిల్ కాకుండా సినిమాకు పనిచేసిన వారిలో చాలా మంది నాకు కావాల్సిన వాళ్లు ఉన్నారు. ఆ వరుసలో ముందుగా బివిఎస్ఎన్ ప్రసాద్ ఉంటారు. ఆయన బ్యానర్‌లో నేను ఊసరవెల్లి, నాన్నకు ప్రేమతో చిత్రాలు చేశాను. బివిఎస్ఎన్ ప్రసాద్‌కు సినిమా అంటే వ్యామోహం. అదే ఆయనలో గొప్ప లక్షణం. 'మిస్టర్ మజ్ను' సినిమా ఆయన కెరీర్‌లో మైలురాయి కావాలి. నా త మ్ముడు అఖిల్ గురించి చెప్పాలంటే... ఓ నటుడికి తనను తాను ఆత్మ విమ ర్శ చేసుకునే గుణం అఖిల్‌లో ఉన్నట్లు ఎవరికీ ఉండదు. అతను భవిష్యత్తులో స్టార్ హీరో అవుతాడు. ఈ చిత్రం అఖిల్ కెరీర్‌లో ఒక గొప్ప చిత్రం గా నిలవాలని ఆ దేవుడిని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను"అని తెలిపారు. అఖిల్ మాట్లాడుతూ "దర్శకుడు వెంకీ నాకు మంచి ఫ్రెండ్. మూ డేళ్ల క్రితం నాకు ఈ స్క్రిప్ట్ చెప్పాడు. ఇప్పుడు ఆ సినిమా తెరకెక్కింది. నా మెంటర్, గైడ్ నాన్నగారే. ఆయన నాకు స్నేహితుడు. ఆయన లేకుంటే ఈ సినిమా లేదు. ఈ చిత్రం నాకు మంచి విజయాన్ని అందిస్తుందన్న నమ్మకం ఉంది"అని చెప్పారు. వెంకీ అట్లూరి మాట్లాడుతూ "నేను అక్కినేని అభిమానిని. నాగార్జున 'శివ' సినిమాలో చైన్ లాగడం చూసి నేను కూడా చైన్ లాగితే గ్రీజు అంటుకుంది కానీ చైన్ రాలేదు. 'ప్రేమనగర్'ను చూసి అలాంటి ఓ సినిమా చేయాలనుకున్నాను. అందుకే ఆ సినిమాలోని ముఖ్యమైన డైలాగ్ 'ఎక్స్క్యూజ్‌మీ మిస్'ను ఈ సినిమాలో హీరో క్యారెక్టరైజేషన్‌కు పెట్టాం"అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగచైతన్య, నిధి అగర్వాల్, బివిఎస్ఎన్ ప్రసాద్, థమన్, శ్రీమణి, ప్రియదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాల మధ్య జన్మదిన వేడుకలు

ప్రముఖ నటులు కృష్ణంరాజు, నరేష్‌లు తమ జన్మదినోత్సవాన్ని ఆదివారం ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. రెబల్‌స్టార్ కృష్ణంరాజు 79వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని తన నివాసగృహంలో కృష్ణంరాజు కేక్ కట్ చేసి తన బర్త్‌డేను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ వేడుకలో ఆయన భార్య శ్యామలదేవి, కుమార్తెలు, ప్రభాస్‌తో పాటు అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు. ఇక సూపర్‌స్టార్ కృష్ణ, విజయనిర్మల సమక్షంలో సీనియర్ నటుడు నరేష్ తన 59వ జన్మదినోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు. నానక్‌రామ్‌గూడలోని నివాస గృహంలో కుటుంబసభ్యులు, అభిమానుల కేరింతల మధ్య ఈ బర్త్‌డే వేడుక జరిగింది.



భార్య శ్యామలదేవి, ప్రభాస్ సమక్షంలో కేక్ కట్ చేస్తున్న కృష్ణంరాజు



కృష్ణ, విజయనిర్మల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న నరేష్



విద్యాబాలన్

మారాల్సింది మగవాళ్ల ఆలోచనే

నందమూరి తారకరామారావు జీవిత కథపై తెరకెక్కిన 'యన్.టి.ఆర్' బయోపిక్‌లో బసవతారకం పాత్రలో అద్భుతంగా నటించి ప్రేక్షకులను మెప్పించింది విద్యాబాలన్. ఈ చిత్రంలో ఎన్టీఆర్ పాత్రలో నటించిన నందమూరి బాలకృష్ణకు ధీటుగా ఆమె నటించి అలరించింది. అయితే తాజాగా విద్యాబాలన్ మహిళల డ్రెస్సింగ్‌పై మాట్లాడింది. "మహిళల డ్రెస్సింగ్‌పై మారాల్సింది మగవాళ్ల ఆలోచనే. తమకు నచ్చిన వస్త్రాలను అమ్మాయిలు వేసుకుంటారు. వారికి ఇవ్వాల్సిన గౌరవం డ్రెస్సులను బట్టి ఉండకూడదు. ఓ మహిళ అలా డ్రెస్ చేసుకోవడానికి ఎన్నో పరిస్థితులు ఉంటాయి. ఉద్యోగం కూడా కారణం కావచ్చు. ఎక్స్‌పోజింగ్ చేస్తున్నారని హీరోయిన్‌లకు గౌరవం ఇవ్వకుండా ఉంటారా"అని విద్యాబాలన్ ప్రశ్నించింది. దేశంలో ప్రతి చోటా ఈవ్ టీజింగ్ జరుగుతోందన్న విద్యాబాలన్... కొన్ని చోట్ల ఎక్కువ, కొన్ని చోట్ల తక్కువ జరుగుతోంది అంతే... అని చెప్పింది. అమ్మాయిలు భయపడకుండా జీవించాలి... అలాగే తమ సొంత కాళ్లపై నిలబడే ఆర్థిక స్వాతంత్ర్యం కూడా చాలా ముఖ్యమని హితబోధ చేసింది. ఇక 'యన్.టి.ఆర్' బయోపిక్‌లో నటించడంతో ఎంతో ఆనందంగా ఉందని... ఈ చిత్రం తన కెరీర్‌లో ఓ స్పెషల్ మూవీగా నిలిచిపోయిందని పేర్కొంది.

ఎన్నో జీవిత పాఠాలు నేర్చుకున్నా



రజనీకాంత్

సౌతిండియా సూపర్‌స్టార్ రజనీకాంత్ లైఫ్‌స్టైల్ గురించి కొత్తగా చెప్పేదేముంది. ఆయన జీవితం తెరచిన పుస్తకం మాత్రమే కాదు... ఎందరికో ఆదర్శం కూడా. అంత పెద్ద స్టార్ అయినా కూడా ఎలా నిరాడంబరంగా బ్రతకాలో, తోటి వాళ్లను ఎలా ప్రేమించాలో... ఆధ్యాత్మికంగా ఎలా జీవించాలో ఆయనను చూసే నేర్చుకోవాలి. అందుకే ప్రాంతీయ భేదం లేకుండా రజనీకాంత్ అంటే పడిచచ్చే వాళ్లు చాలామందే ఉన్నారు. అటువంటి రజనీకాంత్ కూడా గతంలో చెడు వ్యసనాలకు బానిస అయ్యారట. అయితే ఓ వ్యక్తి కారణంగా ఆ వ్యసనాలను వదిలిపెట్టి స్టార్‌గా ఎదగడం జరిగిందట. ఆ విషయాన్ని స్వయంగా రజనీయే చెప్పడం విశేషం. "కెరీర్ ప్రారంభంలో సీనియర్ నటుడు శివకుమార్ నుంచి ఎన్నో జీవిత పాఠాలు నేర్చుకున్నాను. అప్పట్లో సిగరెట్, మద్యం తాగే అలవాటు నాకుండేది. గొప్ప నటుడిగా ఎదగాలంటే ముందు నువ్వు ఈ అలవాట్లు అన్నీ మానేయాలని... ఆరోగ్యాన్ని నాశనం చేసుకోవద్దని ఆయన నాకు మంచి సలహాలిచ్చారు. శివకుమార్‌ది ఓ మహోన్నతమైన వ్యక్తిత్వం. చెడు వ్యసనాలతో నా ఆరోగ్యాన్ని పాడుచేసుకున్నా కూడా ఆయన ఇచ్చిన ఆరోగ్య సలహాలతో శారీరకంగా, మానసికంగా బలపడ్డాను"అని రజనీకాంత్ పేర్కొన్నారు. ఈవిధంగా ఏమాత్రం సంశయించకుండా గతంలో తనకున్న చెడు వ్యసనాలను రజనీ బయటపెట్టి వ్యక్తిత్వం విషయంలో స్టార్‌గా మరో మెట్టు పైకెక్కారు. ఇకపోతే ఈ సీనియర్ నటుడు శివకుమార్ వేరెవరో కాదు... తమిళంలోనే కాదు తెలుగులోనూ విశేష ప్రేక్షకాదరణ పొందుతున్న సూర్య, కార్తీల తండ్రే ఆయన. ఆయనతో కలిసి రజనీకాంత్ 1977లో కవికూయిల్, భువన ఒరు కెల్వికురి అనే చిత్రాల్లో నటించారు

పక్కా స్కెచ్‌తో ప్లానింగ్



నితిన్

త్రివిక్రమ్ దర్శకత్వంలో చేసిన 'అ..ఆ' గ్రాండ్ సక్సెస్ తర్వాత నితిన్ చేసిన మూడు సినిమాలు నిరాశపరిచాయి. అతను యాక్షన్ థ్రిల్లర్ 'లై', క్యూట్ లవ్‌స్టోరీ 'చల్ మోహనరంగా', దిల్‌రాజు బ్యానర్‌లో చేసిన 'శ్రీనివాస కళ్యాణం' సక్సెస్‌ను అందుకోలేకపోయాయి. దీంతో కాస్త విశ్లేషణ చేసుకున్న నితిన్ కొంత గ్యాప్ తీసుకొని సరైన కథలు, దర్శకులను ఎంచుకునే పనిలో పడ్డాడు. చివరికి 'ఛలో'తో బ్లాక్‌బస్టర్ హిట్‌ను అందుకున్న దర్శకుడు వెంకీ కుడుములతో కలిసి ఓ చిత్రాన్ని చేయబోతున్నాడు. 'భీష్మ' టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రం షూటింగ్ త్వరలోనే మొదలుకానుంది. రష్మిక మందన్న హీరోయిన్‌గా ఖరారైంది. ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు మంచి లవ్‌స్టోరీతో ఈ చిత్రం తెరకెక్కనుంది. దీంతో పాటు 'కుమారి 21ఎఫ్' ఫేం సూర్యప్రతాప్‌కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు నితిన్. ఇది వేసవిలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఇవికాకుండా తన ప్రొడక్షన్‌లో బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌తో ఓ తమిళ్ హిట్ మూవీని రీమేక్ చేయబోతున్నాడు నితిన్. ఇది అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. మొత్తానికి నాలుగు నెలలు గ్యాప్ తీసుకున్న నితిన్ పక్కా స్కెచ్‌తో తెలివిగా ప్లాన్ చేసుకుంటున్నాడు.

స్టార్ హీరోలకు దీటుగా పారితోషికం

ఓ పక్క తమిళంలో మరో పక్క తెలుగులో తిరుగులేని టాప్ హీరోయిన్‌గా రాణిస్తోంది నయనతార. వయసు మీద పడుతున్నా తగ్గని గ్లామర్‌తో అభిమానులను అలరిస్తోంది ఈ భామ. ప్రస్తుతం ఆమె తెలుగులో మెగాస్టార్ చిరంజీవి చిత్రం 'సైరా'లో హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక కోలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న ఈ భామ సౌత్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎంతో పాపులారిటీని సంపాదించుకుంది. స్టార్ హీరోలకు సమానమైన రేంజ్‌లో ఈ భామ భారీ పారితోషికాన్ని తీసుకుంటూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఈమధ్యన ఆమెను తన సినిమా కోసం ఓ నిర్మాత సంప్రదించాడట. కథ ఓకే అన్న నయనతార తన రెమ్యునరేషన్ గురించి చెప్పగానే ఆ నిర్మాత షాక్ తిన్నాడట. మొన్నటివరకు మూడు కోట్లను తీసుకున్న ఈ బ్యూటీ తాజాగా తన రెమ్యునరేషన్‌ను నాలుగు కోట్లకు పెంచేసిందట. ఆమెకున్న క్రేజ్ గురించి తెలిసిన సదరు నిర్మాత ఆమె చెప్పిన రెమ్యునరేషన్‌ను ఇచ్చేందుకు సిద్ధమయ్యాడట. దీంతో సౌత్‌లో అత్యధిక పారితోషికం తీసుకుంటున్న హీరోయిన్‌గా నయనతార నిలిచింది.



నయనతార

అంతే క్రేజ్‌తో..



నందిత శ్వేత, సుమంత్ అశ్విన్

'ప్రేమకథా చిత్రమ్'తో ట్రెండ్ సృష్టించిన ఆర్‌పిఎ క్రియేషన్స్ బ్యానర్‌లో ప్రొడక్షన్ నం.3గా తెరకెక్కుతున్న చిత్రం 'ప్రేమకథా చిత్రమ్2'. ఈ చిత్రంతో హరికిషన్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. సుమంత్ అశ్విన్, సిద్ధి ఇద్నాని, నందిత శ్వేత హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇక ఈ చిత్రం శాటిలైట్, హిందీ డబ్బింగ్ రైట్స్ ద్వారా కోటి 43 లక్షలు దక్కించుకోవడం విశేషం. సూపర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో నందిత శ్వేత నటన హైలైట్‌గాఉంటుంది. ఆర్.సుదర్శన్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం రావు రమేష్ వాయిస్ ఓవర్‌తో నడుస్తుంది. ఆయన వాయిస్ ఓవర్ ఈ చిత్రానికి మరో హైలైట్‌గా ఉంటుంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఫిబ్రవరి 22న ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ "ప్రేమకథా చిత్రమ్ ఎంతటి ఘన విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా వస్తున్న 'ప్రేమకథా చిత్రమ్ 2'ను కూడా అంతే క్రేజ్‌తో రూపొందిస్తున్నాం. రావు రమేష్ ఈ చిత్రానికి వాయిస్ ఓవర్ చెప్పడం హైలైట్‌గా ఉంటుంది. ఆయన వాయిస్ ఓవర్‌తో ప్రేక్షకులు కథలో లీనమవుతారు. ప్రస్తుతం శరవేగంగా పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఫిబ్రవరి 22న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నాం"అని అన్నారు. కృష్ణతేజ, విద్యుల్లేఖ, ప్రభాస్ శ్రీను, ఎన్.టి.విసాయి తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరామెన్: సి.రాంప్రసాద్, సంగీతం: జెబి, ఎడిటర్: ఉద్ధవ్ యస్.బి, డైలాగ్స్: గణేష్.



సోనమ్‌కపూర్

సలహాలిస్తే కోపం వస్తుందట

బాలీవుడ్ బ్యూటీ సోనమ్‌కపూర్ ఎప్పుడూ ఓపెన్‌గా మాట్లాడుతుంది. అమ్మడి నోట్లో సీక్రెట్ అనేదే దాగదు. తాను మెరుపుతీగలా కనిపించడం గురించి సోనమ్ మాట్లాడుతూ "అప్పట్లో బిపాసా బసు నేను కలిసి ఓ మూవీ చేస్తున్నాం. అప్పుడు తను బికినీలో మెరుపులు మెరిపించింది. నేను కూడా ఇలా సన్నగా అయిపోవాలని తెగ అనేకునేదాన్ని. అప్పుడు వెళ్లి తననే ఎలా సన్నబడాలని అడిగాను. అప్పుడు బిపాసా డైట్ ప్లాన్ గురించి నాకు చెప్పింది. ఈ డైట్ ప్లాన్ నా జీవితంలో బోలెడన్ని మార్పులు తీసుకొచ్చింది. బిపాసా వల్లే నేను మెరుపుతీగలా మారాను"అని చెప్పింది. సినిమాల విషయంలో తనకెవరైనా సలహాలు ఇస్తే సోనమ్‌కు బాగా కోపం వస్తుందట. అప్పట్లో 'నీర్జా' సినిమా చేయవద్దని ఎవరో ఆమెకు చెప్పారట. కానీ ఈ సినిమా కథ నచ్చి చేయగా... నీర్జా మంచి విజయాన్ని అందుకోవడంతో సోనమ్ ఎంతో సంతోషపడిపోయిందట.

టాప్ 6 కంపెనీల మార్కెట్ విలువ రూ.లక్ష కోట్లు పెరిగింది..

న్యూఢిల్లీ: గతవారం టాప్ 10 బ్లూచిప్ కంపెనీల్లో ఆరు సంస్థల మార్కెట్ విలువ(ఎం–క్యాప్) మొత్తంగా రూ.1,08,274 కోట్లు పెరిగింది. వీటిలో రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థ అత్యధికంగా లాభపడింది. ఇంకా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టిసిఎస్), హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి, ఇన్ఫోసిస్, కొటక్ మహీంద్రా బ్యాంక్‌లు మార్కెట్ విలువను పెంచకోగా, మిగతా హిందుస్థాయన్ యునిలీవర్(హెచ్‌యుఎల్), ఐటిసి, ఎస్‌బిఐ, ఐసిఐసిఐ బ్యాంక్‌లు నష్టపోయాయి. అయితే రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.53,918 కోట్లు పెరిగి రూ.7,49,829 కోట్లకు చేరి టాప్ 10లో అత్యధికంగా లాభపడిన సంస్థగా నిలిచింది. ఐటి దిగ్గజం టిసిఎస్ విలువ రూ.21,932 కోట్లు పెరిగి రూ.7,13,103 కోట్లకు చేరగా, మరో ఐటి సంస్థ ఇన్ఫోసిస్ మార్కెట్ విలువ రూ.20,663 కోట్లు లాభపడి రూ.3,19,348 కోట్లకు పెరిగింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ విలువ కూడా రూ.5,180.65 కోట్లు వృద్ధిని సాధించి రూ.5,79,580 కోట్లకు చేరగా, హెచ్‌డిఎఫ్‌సి ఎం–క్యాప్ రూ.3,507 కోట్లు పెరిగి రూ.3,45,278 కోట్లు అయింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ విలువ రూ.3071 కోట్లు పెరగడంతో మొత్తం విలువ రూ.2,36,029 కోట్లకు చేరింది. వీటికి విరుద్ధంగా ప్రభుత్వ రంగ ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) మార్కెట్ విలువ రూ.6,559 కోట్లు పతనమై రూ.2,63,453 కోట్లకు తగ్గింది. ఇక హిందుస్తాన్ యునిలీవర్ విలువ కూడా రూ.5,335 కోట్లు తగ్గి రూ.3,77,449 కోట్లకు చేరగా, ఐటిసి విలువ రూ.5,266 కోట్లు పడిపోయి రూ.3,56,507 కోట్లు అయింది. ఐసిఐసిఐ బ్యాంక్ విలువ రూ.4,274 కోట్లు తగ్గి రూ.2,39,547 కోట్లకు చేరింది. టాప్ 10 సంస్థల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత వరుసగా టిసిఎస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, హెచ్‌యుఎల్, ఐటిసి, హెచ్‌డిఎఫ్‌సి, ఇన్ఫోసిస్, ఎస్‌బిఐ, ఐసిఐసిఐ బ్యాంక్, కోటక్ మహీంద్ర బ్యాంక్‌లు ఉన్నాయి. గతవారం బిఎస్‌ఇ సూచీ సెన్సెక్స్ 1 శాతం లాభపడి 36,386 పాయింట్ల వద్ద స్థిరపడింది.

బంగారం ఆభరణాల ఎగుమతులు



కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	71.18
యూరో	81.08
బ్రిటిష్ పౌండ్	91.64
ఆస్ట్రేలియన్ డాలర్	51.02
కెనెడియన్ డాలర్	53.63
సింగపూర్ డాలర్	52.49
స్విస్ ఫ్రాంక్	71.80
చైనీస్ యువాన్	10.52
మలేషియన్ రింగిట్	17.32
న్యూజిలాండ్ డాలర్	48.14
హాంకాంగ్ డాలర్	9.08
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	234.95
సౌతాఫ్రికన్ రాండ్	5.20

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	31080	33240.64	0.19%
ముంబై	31660	33860.96	0%
ఢిల్లీ	31750	33957.22	0.47%
కోల్‌కతా	31990	34213.90	0.63%
కేరళ	30250	32352.94	0.33%
బెంగళూరు	30500	32620.32	0.53%
హైదరాబాద్	31080	33240.64	0.19%
గల్ఫ్	137.45	147.00	0.17%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42668.00
ముంబై	₹ 42668.00
ఢిల్లీ	₹ 42668.00
కోల్‌కతా	₹ 42668.00
హైదరాబాద్	₹ 42668.00



భారత్ బ్రిటన్‌ను దాటేస్తుంది



- అంతర్జాతీయంగా ఎలాంటి ఎదురుగాలులు లేకపోతే సాధ్యమే
- 2019లో భారత్ జిడిపి 7.6 శాతంగా ఉండనుంది
- అంతర్జాతీయ సంస్థ పిడబ్ల్యుసి నివేదిక

న్యూఢిల్లీ: ఈ సంవత్సరంలో ప్రపంచ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటైన బ్రిటన్‌ను భారత్ అధిగమించే అవకాశముందని గ్లోబల్ కన్సల్టెన్సీ సంస్థ పిడబ్ల్యుసి నివేదిక పేర్కొంది. బ్రిటన్, ఫ్రాన్స్‌లు వృద్ధిలో పోటాపోటీగా ఉంటూ సరిసమాన స్థాయిలను కల్గి ఉంటున్నాయి. వీటి జనాభా కూడా సమానంగానే ఉంటుంది. అయితే భారత్ ఓ మెట్టు పైకి ఎక్కి తన స్థానాన్ని శాశ్వతం చేసుకునే అవకాశముందని నివేదిక వివరించింది. 2019 సంవత్సరంలో బ్రిటన్ జిడిపి(స్థూల దేశీయ్పత్తి) 1.6 శాతంగా, ఫ్రాన్స్‌కు 1.7 శాతం, భారత్‌కు జిడిపి 7.6 శాతంగా ఉండనుందని పిడబ్ల్యుసి గ్లోబల్ ఎకానమి వాచ్ రిపోర్ట్ అంచనా వేసింది. 2019లో ప్రపంచ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటైన బ్రిటన్‌ను భారత్ గానీ, ఫ్రాన్స్ గానీ అధిగమించే అవకాశముందని, అంతర్జాతీయంగా బ్రిటన్ స్థానంలో ఐదు నుంచి ఏడుకు పడిపోవచ్చని నివేదిత తెలిపింది. ప్రపంచ బ్యాంక్ గణాంకాల ప్రకారం, 2017 ప్రపంచ ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్ ఫ్రాన్స్‌ను దాటనుందని తెలిపింది. అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధం, చమురు ధరల పెరుగుదల వంటి ఎదురుగాలులు లేనట్టయితే 2019–20 సంవత్సరంలో భారత్ 7.6 శాతంతో ఆరోగ్యకరమైన వృద్ధిని నమోదు చేయవచ్చని పిడబ్ల్యుసి పేర్కొంది. భారత్‌లో ఇటీవల చెపట్టిన సంస్కరణలు ఇందుకు దోహదం చేస్తాయి. జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) వంటి నిర్ణయాల ఫలితాలు వాస్తవ రూపంలోకి వస్తాయని, ఇవి కొత్త ప్రభుత్వానికి దోహదం చేస్తాయని పిడబ్ల్యుసి ప్రతినిధి రాణెన్ బెనర్జీ అన్నారు. పిడబ్ల్యుసి సీనియర్ ఆర్థికవేత్త మైక్ జేక్‌మన్ మాట్లాడుతూ, ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధిని సాధిస్తున్న దేశం భారత్ అని అన్నారు. భారత్ జనాభా పరంగా, సామర్థ్య పరంగా ముందుందని, తక్కువ జిడిపి వల్ల సామర్థ్యాన్ని వినియోగించుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలుగా బ్రిటన్, ఫ్రాన్స్‌లు పోటీ పడుతూ సమఉజ్జీలుగా ఉంటున్నాయని, 2018లో బ్రిటన్‌లో వృద్ధి మందగించడం ఫ్రాన్స్‌కు కలిసి వస్తుందని అన్నారు. జి7 దేశాలు దీర్ఘకాల సగటు వృద్ధి రేట్ల కారణంగా 2019లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నెమ్మదిగా ఉండనుందని పిడబ్ల్యుసి వెల్లడించింది.



అమెరికాలో భారత్ ఫార్మా ఉత్పత్తుల రీకాల్



న్యూయార్క్: భారత్‌కు చెందిన దిగ్గజ ఔషధ సంస్థలు లుపిన్, సన్‌ఫార్మా, గ్లెన్‌మార్క్‌లు తమ ఔషధాలను అమెరికా మార్కెట్ నుంచి రీకాల్ చేశాయి. వివిధ కారణాలతో ఈ సంస్థ తమతమ ఉత్పత్తులను వెనక్కి పిలిపించాయి. ఈ విషయం అమెరికా ఎఫ్‌డిఎ తాజా నివేదికలో వెల్లడైంది. లుపిన్ సంస్థ 55 వేల వైల్స్, 1.6 పెట్టెల యాంటి బ్యాక్టీరియల్ సెఫ్ట్రియాక్సిన్ ఇంజెక్షన్లను వాపస్ తీసుకుంది. వీటిని మధ్యప్రదేశ్‌లోని మందీదీప్ ప్లాంట్‌లో తయారు చేశారు. వీటిల్లో కొన్ని అవాంఛనీయ పదార్థాలను గుర్తించడంతో ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం. వీటితోపాటు 2.8 సీసాల సెఫ్డినీర్ సిరప్‌ను కూడా వెనక్కి రప్పించింది. ఇదే విధంగా సన్‌ఫార్మా 13,918 కార్టన్ల వెక్యూరోనమ్ బ్రొమైడ్ ఇంజెక్షన్లను వాపస్ తీసుకొంది. జనరల్ అనస్తీషియాగా దీనిని వినియోగిస్తారు.

11 వేల కోట్ల బొగ్గు ప్రాజెక్టుల జాప్యం

సిఐఎల్, ఎన్‌ఎల్‌సిలు నివేదిక ఇవ్వాలని కోరిన కేంద్రం



న్యూఢిల్లీ: దాదాపు రూ.11 వేల కోట్లు విలువైన బొగ్గు గనుల ప్రాజెక్టుల్లో ఆలస్యంపై కారణాలు తెలపాలని, నివేదిక సమర్పించాలని కేంద్రం కోల్ ఇండియా, ఎన్‌ఎల్‌సి ఇండియా లిమిటెడ్‌లను కోరింది. ఈమేరకు అధికార వర్గాలు వెల్లడించాయి. ఇటీవల రూ.35వేల కోట్లు విలువైన బొగ్గుగనుల ప్రాజెక్టులను పురోగతిపై కేంద్ర ప్రభుత్వం సమీక్ష సమావేశం నిర్వహించగా, దేశంలో బొగ్గు దిగమతులు పెరుగుతున్నాయని గుర్తించారు. ఈ సమావేశంలో కోల్ ఇండియాకు చెందిన మొత్తం 51 ప్రాజెక్టులు, 9 ఎన్‌ఎల్‌సి ప్రాజెక్టులు, రెండు సింగరేణి కాలరీస్ కంపెనీ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. దీనిలో 21 ప్రాజెక్టులు తీవ్ర ఆలస్యం కాగా, వీటిలో సిఐఎల్‌కు చెందినవి 17 ప్రాజెక్టులు, ఎన్‌ఎల్‌సికి చెందినవి నాలుగు ఉన్నాయని అధికార వర్గాలు తెలిపాయి

ఇద్దరు పిఎన్‌బి ఇడిలపై వేటు

నీరవ్ కేసులో స్విఫ్ట్ వ్యవస్థ దుర్వినియోగం ఆరోపణలే కారణం

న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు చెందిన ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లపై వేటుపడింది. నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీలకు చెందిన కంపెనీలు రూ.14,300 కోట్లు మోసానికి పాల్పడిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ఇడిలు కెవి బ్రహ్మాజీ రావ్, సంజీవ్ శరణ్‌లను విధుల నుంచి ప్రభుత్వం తొలగించింది. విధులను సరిగ్గా నిర్వహించకపోవడం, నియంత్రణ లేని కారణంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రుణాల మంజూరు కోసం బ్యాంకులు వినియోగించే ఇంతర్జాతీయ మేసేజింగ్ సిస్టమ్ 'స్విఫ్ట్'లో వీరు దుర్వినియోగానికి పాల్పడ్డారని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఎందుకు చర్యలు చేపట్టకూడదో చెప్పాలంటూ ఇద్దరికీ షోకాజ్ నోటీసుకు జారీ చేసిన తర్వాత ఆరు నెలలకు శరణ్, రావ్‌లపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే నేషనల్ బ్యాంక్స్ స్కీం 1970 కింద ఒక జాతీయ బ్యాంక్‌కు చెందిన ఇద్దరు డైరెక్టర్లను తొలగించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 2018 జులైలో శరణ్, బ్రహ్మాజీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. బ్రాడీ హౌస్ బ్రాంచ్‌లో స్విఫ్ట్ వ్యవస్థను దుర్వినియోగం చేయడంపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరించాలని నోటీస్‌లో పేర్కొంది. వారి వివరణలు పరిశీలించాక బ్యాంక్ బోర్డు అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని వారిని తొలగించింది. తనపై సిబిఐ కేసును సవాలు చేస్తూ రావ్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆయన తొలగింపు కోర్టు ఆదేశాలకు లోబడి ఉంటుందని ఆర్థిక మంత్రిత్వశాఖ పేర్కొంది. అయితే శరణ్ మే నెలలో రిటైల్ కానున్నారు. కాగా ఈ చర్యను ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ స్వాగతించింది. కేంద్ర ప్రభుత్వ చర్యను హర్షిస్తున్నామని, అత్యున్నత నిర్వహణ బృందానికి తెలియకుండా ఇంత భారీ స్థాయిలో మోసం జరగడానికి అవకాశం లేదని, ప్రభుత్వం కూడా వారి వాదనలు విన్న తర్వాతే ఈ నిర్ణయం తీసుకుందని ఎఐబిఇఎ జనరల్ సెక్రటరీ సీహెచ్ వెంకటాచలం అన్నారు.



బలహీన స్థాయి నుంచి వేగవంత వృద్ధి దేశంగా భారత్: మోడీ



ముంబై: బలహీన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉన్న భారత్.. ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధిని సాధిస్తున్న దేశంగా రూపాంతరం చెందుతోందని ఆదివారం ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. ప్రస్తుత సోషల్ మీడియాలో ట్రెండింగ్ 'ఐదేళ్ల సవాల్'పై ఆయన ఈ విధంగా స్పందించారు. ఇంతకుముందు దేశీయ, అంతర్జాతీయ హెడ్‌లైన్లలో భారత ప్రభుత్వాల కుంభకోణాలు కనిపించేవని, ఇప్పుడు కుంభకోణాల గురించి కాకుండా, కొత్త పథకాల గురించి చర్చిస్తున్నాయని మోడీ అన్నారు. గత ఐదేళ్లలో కుంభకోణాల నుంచి పథకాల స్థాయికి దేశం మార్పు చెందిందని ఆయన అన్నారు. ఐదేళ్ల క్రితం భారత్ గురించి వార్తల్లో కుంభకోణాలు, విద్యుత్ కొరత, ఆర్థిక సంక్షోభం వంటి అంశాలు ఉండేవి. ఇప్పుడు భారత్‌పై ప్రపంచ అభిప్రాయంలో విశ్వాసం కనిపిస్తోంది.

కెజి–డి6 గ్యాస్ బ్లాక్ నుంచి వైదొలగండి

నికోను కోరిన రిలయన్స్



న్యూఢిల్లీ: తూర్పు తీరప్రాంతంలోని కెజి–డి6 గ్యాస్ బ్లాక్ నుంచి ఉపసంహరించుకోవాలని తన భాగస్వామి నికో రిసోర్సెస్‌ను రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆదేశించింది. క్షేత్రం అభివృద్ధి వ్యయానికి చెల్లింపుల్లో డిఫాల్ట్ అయిన కారణంగా రిలయన్స్ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకుందామని కెనడియన్ సంస్థ కోరిందని సమాచారం. రుణదాతలకు రుణాల చెల్లింపుల్లో నికో విఫలమైంది. కాగా కెజి–డి6 బ్లాక్‌లో రిలయన్స్‌కు 60శాతం వాటా ఉంది. బ్రిటన్‌కు చెందిన బిపి సంస్థకు మరో 30శాతం వాటా ఉంది. అయితే అప్పుల్లో కూరుకుపోయిన నికో రిసోర్సస్ నిధుల వేటలో భాగంగా ఆర్‌క్లస్టర్, శాటిలైట్ క్లస్టర్, ఎంజె డెవలప్‌మెంట్స్‌లో వాటాలను విక్రయించేందుకు ప్రయత్నించి విఫలమైంది. ఈ నేపథ్యంలో నికో నిధులు సమకూర్చుకోవడంలో విఫలం కావడంతో సంయుక్త ఒప్పందంలో నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసినట్లు రిలయన్స్ వెల్లడించింది.

బడ్జెట్ వరకు జాగ్రత్త అవసరం



క్యూ3, అంతర్జాతీయ అంశాలే కీలకం • ఈ వారం మార్కెట్‌పై నిపుణులు

ముంబై: బడ్జెట్ అంచనాలు, క్యూ3 ఫలితాలు, అమెరికా–చైనా వాణిజ్య సంబంధాల్లో పరిణామాలు, బ్రెగ్జిట్ అంశం వంటివి ఈవారం మార్కెట్ ట్రెండ్‌ను నిర్దేశిస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే క్రూడ్ ఆయిల్ ధరల్లో ఒడిదుడుకులు కొనసాగితే రూపాయిపై ప్రభావం పడే అవకాశముందని, ఇది ఇప్పటికే రెండు వారాలుగా రూపాయి విలువ క్షీణిస్తూ వస్తోంది. బడ్జెట్ నేపథ్యంలో వచ్చే రోజుల వరకు ట్రేడర్లు జాగ్రత్త వహించాలని ఎడిల్వీస్ వెల్త్ మేనేజ్‌మెంట్ ప్రతినిధి సాహిల్ కపూర్ సూచించారు. ఫిబ్రవరి మొదటివారంలో బడ్జెట్, ఆ తర్వాత ఆర్‌బిఐ సమీక్ష నిర్ణయాలు ప్రకటించిన తర్వాత మాత్రమే మార్కెట్ ఒక డైరెక్షన్ తీసుకునే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. వచ్చేది మధ్యంతర బడ్జెట్ అయినా అది కార్పొరేట్ల వైపు ఉందా, సామాన్యులకు అనుకూలమా లేక సంక్షేమ పథకాలకు నిధులు పెంచుతుందా? వంటి అంశాల కీలకమని గమనించాలని అంటున్నారు. ఇప్పటివరకూ విడుదలైన పెద్ద సంస్థల త్రైమాసిక ఫలితాల్లో ప్రధానంగా ఇన్ఫోసిస్, టిసిఎల్, రిలయన్స్, డిమార్ట్ వంటి వాటిల్లో మార్జిన్లు దెబ్బతినడం ప్రధానంగా చూడాల్సిన అంశం. జియో అండతో రిలయన్స్ స్థిరంగా నిలబడింది. హెచ్‌యుఎల్ రండంకెల వృద్ధిని నమోదు చేసింది. జెట్ –ఎతిహాద్ డీల్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. నిధులు వస్తే తప్ప కంపెనీ ముందుకు కదిలే పరిస్థితి కనిపించడంలేదు. ఏతిహాద్ పెట్టుబడులు పెట్టేందుకు గాను షరతులు చెప్పడంతో ఈ డీల్ కొనసాగుతుందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇక అంతర్జాతీయ మార్కెట్లను పరిగణలోకి తీసుకుంటే అమెరికాలో షట్ డౌన్ కొనసాగుతూనే ఉంది. ఇంతవరకూ అమెరికాలో ఎప్పుడూ ఇన్ని రోజుల పాటు షట్‌డౌన్ జరగలేదు. వీటికి తోడు చైనాతో కొనసాగుతూనే ఉన్న ట్రేడ్ వార్ కూడా మార్కెట్లపై వేలాడుతూనే ఉంది. నిఫ్టీ 11,000 దగ్గర తీవ్రమైన నిరోధాన్ని ఎదుర్కొంటోంది. మార్కెట్‌లో కరెక్షన్ కొనసాగేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. వచ్చే వారం ఏసియన్ పెయింట్స్, కొటక్ బ్యాంక్, బయోకాన్, ఎడిల్వైజ్, యెస్ బ్యాంక్, మారుతి ఫలితాలు వెలువడబోతున్నాయి. వీటిపై ఇన్వెస్టర్లు దృష్టి నెలకొంటుంది. వీటి ఆధారంగా మార్కెట్ కదలికలు ఉంటాయి.

వలసదార్ల పడవలు బోల్తా.. 170 మంది గల్లంతు

ఇంటర్నెట్ డెస్క్ : మధ్యధరా సముద్రంలో విషాదం చోటు చేసుకొంది. వలసదారులతో ప్రయాణిస్తున్న రెండు పడవలు మునిగిపోవడంతో దాదాపు 170 మంది గల్లంతయ్యారు. గల్లంతైన వారంతా చనిపోయి ఉంటారని అధికారులు భావిస్తున్నారు. లిబియా తీరంలో శనివారం ఒక పడవ మునిగిపోయినట్లు ఇటలీ నావికాదళం వెల్లడించింది. దీనిలో దాదాపు 117 మందికిపైగా ఉన్నట్లు వారు అంచనా వేశారు. వీరిలో 10 మంది మహిళలు, ఇద్దరు చిన్నారులు, ఒక శిశువు కూడా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ పడవ లిబియాలోని గారాబుల్లి రేవు నుంచి ప్రయాణం మొదలు పెట్టిన 10 గంటల తర్వాత మునిగి పోయినట్లు ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ మైగ్రేషన్ ప్రతినిధి వెల్లడించారు. ఈ పడవలో మొత్తం 120 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. మరో పడవ మొరాకో నుంచి బయల్దేరి మధ్యదరా సముద్రానికి పశ్చిమాన అలబోరన్ సముద్రంలో మునిగిపోయింది. ఈ పడవలో 53 మంది ఉన్నారు. ఈ పడవ నుంచి ప్రాణాలతో బయటపడిన వ్యక్తిని తీరప్రాంతంలో అధికారులు గుర్తించి చికిత్స అందిస్తున్నారు. ఇవి కాకుండా లిబియాలోని జువార తీరంలో మరో పడవ మునగడంతో 47 మందిని రక్షించినట్లు ఛారిటీ సీ వాచ్ సంస్థ వెల్లడించింది.

వలస చట్టంపై మరో ఛాన్సివ్వండి

దుబాయ్ : భారతదేశపు నూతన ముసాయిదా వలస చట్టంపై సూచనల స్వీకరణ గందరగోళంగా మారింది. నూతన ముసాయిదా బిల్లుపై తమ సూచనలు , సిఫార్సులు తెలియచేయాలని అరబ్ ఎమిరేట్స్‌లో నివసిస్తున్న భారతీయ బృందాలను కేంద్ర ప్రభుత్వం కోరింది. ఇందుకు తుది గడువు పెట్టింది. అయితే తమకు దీని గురించి సరైన విధంగా ముందుగా తెలియలేదని, తుది గడువు పెంచాలని భారతీయ సంతతి వారు డిమాండ్ చేస్తున్నారు. సూచనలకు తుది గడువును పెంచాలని లేకపోతే ప్రతిపాదిత బిల్లుతో ప్రయోజనం ఉండదని పేర్కొంటున్నారు. 1983 ఇమిగ్రేషన్ చట్టాన్ని మారుస్తూ నూతన ముసాయిదా బిల్లును తీసుకువచ్చేందుకు భారత ప్రభుత్వం యత్నిస్తోంది. వివిధ వృత్తులకు సంబంధించిన వారు గల్ఫ్‌లో ఉద్యోగాలకు వెళ్లాలనుకుంటే పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవడం, అక్కడికి వెళ్లిన వారి సంక్షేమానికి భద్రతకు వీలుగా వలస నిర్వాహణ సంస్థను ఏర్పాటు చేయాలని ముసాయిదా బిల్లులో ప్రతిపాదించారు. తనకు ఈ బిల్లు గురించి కేవలం మూడు రోజుల ముందే తెలిసిందని దుబాయ్‌లోని కేరళ సోషల్ సెంటర్ అధ్యక్షులు ఎకె బీరన్ కుట్టి ఆదివారం చెప్పారు. భారత ప్రభుత్వం తమకు ముందుగా దీని గురించి తెలియ చేస్తే బాగుండేదని యుఎఇలోని ఇతర భారతీయ సంతతి సంస్థలు తెలిపాయి. అధికారిక వర్గాల ద్వారా, దౌత్య కార్యాలయాల నుంచి దీనిపై ప్రచారం జరిగితే అందరికీ సకాలంలో తెలిసి ఉండేదని, కేవలం విదేశాంగ మంత్రిత్వశాఖ వారి ట్వీట్‌తో సరిపెట్టారని, ఇది ఎందరికి అందుబాటులోకి వస్తుందని పలువురు భారతీయులు ప్రశ్నించారు. ఆదివారంతో సూచనల గడువు ముగిసిందని, ఈ అవకాశాన్ని మరింతగా పొడిగించాలని కోరారు.

శంషాబాద్‌లో 2కిలోల బంగారం పట్టివేత



మన తెలంగాణ/శంషాబాద్ : అక్రమంగా విదేశాల నుంచి బంగారాన్ని ఇద్దరు వ్యక్తులు తరలిస్తు డిఆర్ఐ అధికారులకు పట్టుబడిన సంఘటన ఆదివారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో చోటుచేసుకుంది. డిఆర్ఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం షార్జా నుంచి హైదరాబాద్‌కు ఇద్దరు వ్యక్తులు భారీగా బంగారాన్ని తరలిస్తునట్లు పక్కా సమాచారం అందిందన్నారు. దీంతో ఎయిర్‌పోర్టులో నిఘా పెట్టి షార్జా నుంచి వచ్చిన ప్రయాణికులను తనిఖీ చేయగా ఇద్దరి లాగేజీలో బంగారం ఉన్నట్లు స్కానింగ్‌లో గుర్తించినట్లు తెలిపారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా 1కిలో 996గ్రాముల బంగారం ఉన్నట్లు తెలిపారు. బంగారానికి సంబంధించిన ఎలాంటి డాక్యుమెంట్లు లేకపోవడంతో స్వాధీనం చేసుకునట్లు తెలిపారు. దీని విలువ రూ.66లక్షల 27వేలు ఉంటుందన్నారు. తదుపరి విచారణ కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు.

73కు చేరిన పైప్‌లైన్ పేలుడు మృతులు

ట్లాహ్యులిపన్ (మెక్సికో): సెంట్రల్ మెక్సికోలో శనివారం జరిగిన ఒక ఇంధన పైప్ లైన్ పేలుడులో ఆదివారం నాటికి మృతుల సంఖ్య 73కు చేరింది. పేలిన తర్వాత మంటలు వ్యాపించడంతో వందలాది మంది గాయపడ్డారు. దొంగతనంగా గాసోలిన్ సేకరించి, సరఫరా చేసే ఈ అక్రమ ఇంధన పైప్ లైన్ ప్రభుత్వం ఎన్నోసార్లు దాడులు నిర్వహించింది. మరో అయిదు మృతదేహాలు కనిపించడంతో మృతుల సంఖ్య 73కు పెరిగిందని హిడాల్గో స్టేట్ గవర్నర్ ఒమర్ ఫయాద్ తెలిపారు. మెక్సికో ఉత్తర దిశ నుంచి గంట ప్రయాణించి ట్లాహ్యులిపన్ చేరుకోవచ్చు. పైప్‌లైన్ పేలుడుతో పూర్తిగా ధ్వంసమైన ఈ ప్రాంతాన్ని సైనికులు కాపలా కాస్తున్నారు. నల్లగా కమిలిపోయిన దేహాలను ఫోరెన్సిక్ నిపుణులు పరిశీలిస్తున్నారు. చాలా దేహాలు అడ్డదిడ్డంగా పడి ఉన్నాయి. తమ వారికోసం బాధపడుతున్న వారు భయం భయంగా అక్కడికి చేరుకున్నారు. ఇంధనం మండగా వచ్చిన గాఢమైన వాసన ఆ ప్రాంతంలోని గాలిలోకి దట్టంగా వ్యాపించింది. అంత్యక్రియలకు మృతదేహాల్ని తరలిస్తున్న వాహనాల్ని దాదాపు 30 మంది గ్రామస్థులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దాంతో మృతదేహాల్ని మార్చురీకి తరలించారు.

మధ్యప్రదేశ్‌లో బిజెపి నాయకుడి హత్య

బర్వానీ (మధ్యప్రదేశ్) : భారతీయ జనతాపార్టీ నాయకుడు మనోజ్ ఠాకరే మృతదేహం మధ్యప్రదేశ్ బర్వానీ జిల్లాలో ఆదివారం ఉదయం కనిపించింది. ఆయనను ఎవరో చంపి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మందసార్‌లో మరో బిజెపి నాయకుడు కాల్పులకు గురై మరణించిన నేపథ్యంలో మనోజ్ ఠాకరే మరణించిన సంగతి వెలుగులోకి వచ్చింది. తమ నాయకుల్ని లక్ష్యంగా చేసుకొని ఎవరో ఈ చర్యలకు పాల్పడుతున్నారని పార్టీ అనుమానిస్తోంది. జిల్లా ప్రధాన కేంద్రానికి దాదాపు 100 కిలోమీటర్ల దూరంలో ఠాకరే దేహం కనిపించింది. 'మృతదేహంపై ముఖం, మెడ చుట్టూ గాయాల గుర్తులున్నాయి' అని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ వైడి భుటియా చెప్పారు. ఆయనను ఎవరో గుర్తు తెలీని వ్యక్తులు చంపి ఉంటారని ఆమె చెప్పారు.

అమెరికాలో సిక్కు వ్యక్తిపై విద్వేష దాడి

న్యూయార్క్ : అమెరికాలో తాజాగా మరోసారి జాతి విద్వేష దాడి చోటు చేసుకుంది. ఒరెగాన్‌రాష్ట్రంలోని ఓ స్టోర్‌లో పని చేస్తున్న హర్వీందర్ సింగ్ డోడ్ అనే సిక్కును గడ్డం పట్టుకుని లాగిన తెల్లజాతీయుడు అండ్రూ రామ్సే, ఆయనను కింద పడేసి అత్యంత దారుణంగా పిడికిలితో గుద్ది, కాలుతో తన్నాడు. సింగ్ మతం గురించి తెలుసుకునే నిందితుడు జాతి విద్వేష దాడికి పాల్పడినట్లు తన కథనంలో ఫాక్స్12 టివి పేర్కొంది. నిందితుడికి ఐడి కార్డు లేకపోవడంతో సిగరెట్ రోలింగ్ పేపర్లు ఇచ్చేందుకు సింగ్ తిరస్కరించడంతో ఘటన చోటు చేసుకుంది.

చిలీలో భూకంపం

శాన్‌టియాగో : చిలీలో శనివారం రాత్రి భూకంపం సంభవించింది. భూకంప లేఖనిపై దీని తీవ్రత 6.7గా నమోదైంది. ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించినట్లు సమాచారం అందలేదు. చిలీలోని కోక్యూంబోకు 15.6 కిలోమీటర్ల దూరంలో 56కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో కొక్యూంబో తీరంలో నివసించే వారు వెంటనే ఇళ్లను ఖాళీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. తర్వాత ఆ ఆదేశాలను రద్దు చేసింది. సునామీ సృష్టించే తీవ్రమైన భూకంపం కాదని వారు తేల్చేశారు.

ఓపిక, ఓర్పు ముఖ్యం

- మైనింగ్, చెట్ల నరికివేత సమాజానికి చేటు
- ప్రకృతిని కాపాడుకోవాలి
- యువ నాయకత్వ సదస్సులో గవర్నర్ నరసింహన్ ఉద్బోధ





మన తెలంగాణ/హైదరాబాద్ : దేశంలోని వసుదైక కుటుంబ వ్యవస్థలో చైతన్యం ఇమిడి ఉందని, జాగృతి అంటే చైతన్యమేనని రాష్ట్ర గవర్నర్ నరసింహన్ వ్యాఖ్యానించారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు పార్లమెంట్ సభ్యురాలు కవిత జాగృతి సంస్థ ద్వారా చేస్తున్న సేవలు ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నాయని చెప్పారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నగరంలో జరుగుతున్న అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తూ, యువశక్తిలో స్త్రీ శక్తి దాగి ఉందని, ఆ శక్తిని గ్రహించి యువత లక్ష్యాలను చేరుకోవాలని పేర్కొన్నారు. నేటి తరం యువతలో ఓపిక, సహనం తక్కువగా ఉన్నాయని, వాటిని అలవర్చుకోవడం ద్వారా దేన్నయినా సాధించవచ్చునన్నారు. చాలా మందిలో యువత అనగానే యువకులు అనేది మాత్రమే అనే అభిప్రాయంతో ఉంటారని, కానీ మహిళలు కూడా భాగమేననేది గుర్తించరన్నారు. స్త్రీ పురుషుల మధ్య వివక్ష తొలగినప్పుడే సమ్మిళిత అభివృద్ధి, దీర్ఘకాలం పాటు నిలిచే స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మహిళను సౌకర్యవంతంగా ఉంచడం, విద్య, స్వేచ్ఛ, నిర్ణయాధికారం విషయంలో జోక్యం చేసుకోకుండా ఉండడమే మహిళా సాధికారత అని తాను భావిస్తున్నానని అన్నారు. మహిళలపట్ల వివక్ష ఉండరాదని, పురుషులతో పాటు సమాన అవకాశాలు ఉండాలని అన్నారు. దేశంలో చాలా మంది మహిళలు అద్భుతమైన ఫలితాలు సాధించారని, కార్మిక శక్తి విషయంలో మహిళలు ఎక్కడా తగ్గరన్నారు. మహిళలకు అధికారంతోపాటు రక్షణ, భద్రత, సౌకర్యం ఉండాలన్నారు. బాలికలను గౌరవించడంతో పాటు వారిని కాపాడాలని, అదే మహిళా సమాజానికి మనం ఇచ్చే గౌరవమని అన్నారు. మహిళలు మన నిజమైన శక్తి అని, మనమంతా మహిళా చేతుల్లోనే పెరిగామని,ఆ చేతికి అంత శక్తి ఉందని అన్నారు. మహిళా సాధికారికత అనగానే మన దేశంలో ఎంత మంది ఉన్నత స్థానంలో ఉన్నారో, ఎన్ని సంస్థలకు సిఇఓలుగా ఉన్నారో చూపిస్తుంటామని, కానీ అది మాత్రమే కాదన్నారు.

నాణ్యమైన విద్యతో పేదరిక నిర్మూలన

నాణ్యమైన విద్యతో సమాజంలో పేదరికనిర్మూలన సాధ్యం అవుతుందనే విషయాన్ని గ్రహించి భవిష్యత్ కలలను యువత సాకారం చేసుకోవాలని గవర్నర్ కోరారు. కుటుంబంలో బాలిక చదువుకు ప్రాధాన్యత ఇస్తే ఆ బాలిక చదువుకుని ఒక కుటుంబాన్ని విద్యావంతంగా తీర్చిదిద్దగలుగుతుందని అన్నారు. స్త్రీ పురుషుల మధ్య అసమానతలు తొలిగితే సమ్మిళిత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గాంధేయ మార్గంలో సుస్థిరాభివృద్ధికి అనేక మార్గాలు కనిపిస్తాయని, దశాబ్దాల క్రితమే మహాత్మాగాంధీ అహింసామార్గాన్ని ప్రభోధించి అమలుచేసి స్వాతంత్ర్యం సంపాదించి ప్రపంచానికి మార్గదర్శకులయ్యారని గుర్తుచేశారు. యువత ఏదైనా సాధించాలంటే ప్రధానంగా లక్ష్యాలను నిర్దేశించుకుని ఓపికగా ముందుకు కదిలితే సాధ్యమవుతాయన్నారు. భవిష్యత్ భారతావని అభివృద్ధి యువతపైనే ఆధారపడి ఉందన్నారు. సమాజంలో ఎప్పటికప్పుడు వస్తున్న శాస్త్ర, శాంకేతిక పరిజ్ఞానాన్ని అవపోసన చేసి యువతరం పరుగు తీయాలని అన్నారు. యువతరం నూతన ఆవిష్కరణలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. అయితే టెక్నాలజీని అభివృద్ధి, ఆవిష్కరణల కోసం ఉపయోగించుకోవాలని యువతకు సూచించారు. వేలాది సంవత్సరాల క్రితం నుంచి దేశంలో ప్రకృతిని పూజించే సంప్రదాయాలున్నాయన్నారు. వేదాల్లోనూ ప్రకృతిని ఆరాధించారని చెప్పారు. చెట్లను, పశు, పక్ష్యాదులను పూజించడంలోని పరమార్థం ప్రకృతిని కాపాడుకోవడమేనని ఆయన గుర్తుచేశారు. అయితే ఆ సంప్రదాయాలను విస్మరించడంతోనే ప్రకృతి అనేక సవాళ్లను విసురుతుందన్నారు. హద్దులు దాటి చెట్ల నరికివేత, విపరీతమైన మైనింగ్ ఎప్పటికైనా ప్రమాదమేనని హెచ్చరించారు. ప్రకృతిని కాపాడుకోవడం మన సంస్కృతిలో భాగం కావాలని చెప్పారు. ఏది సాధించాలన్నా గాంధేయ మార్గాన్ని విస్మరించరాదని గుర్తుచేశారు. యువతరంలో దాగి ఉన్న నిగూఢమైన శక్తిని వెలికి తీస్తే ప్రపంచంలో అద్భుతాలు ఆవిష్కరిస్తాయన్నారు. అవసరం, ఆశ మధ్య వ్యత్యాసం ఉండాలని సూచించారు. వ్యక్తి సుస్థిర అభివృద్ధి కోసం వనరులను ఉపయోగించుకున్నా భవిష్యత్ తరాలకు వనరులను మిగిలించాలని ఉద్బోటించారు.

ఉన్నతాధికారుల ఓట్లు గల్లంతు!

- లిస్ట్‌లో ఆర్ అండ్ బి ముఖ్యకార్యదర్శి సునీల్ శర్మ
- అసెంబ్లీ ఎన్నికల నోడల్ పోలీస్ అధికారి జితేందర్
- పలువురు ఐఎఎస్‌లు, ఐపిఎస్‌లు, రిటైర్డ్ ఐఎఎస్‌లు
- విచారణకు ఆదేశించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి



మన తెలంగాణ/హైదరాబాద్ : సామాన్యుడి ఓటు తొలగించారంటే ఏమో అనుకోవచ్చు... కానీ రాష్ట్ర ఉన్నతాధికారుల ఓటు హక్కు కూడా తొలగింపునకు గురికావడం గమనార్హం. వివిధ ప్రభుత్వ విభాగాలకు ముఖ్యకార్యదర్శులుగా ఉన్న ఐఎఎస్‌లు, ఐపిఎస్‌ల, రిటైర్డ్ ఐఎఎస్‌ల పేర్లు ఓటర్ల జాబితాలో లేనట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం గుర్తించింది. వారి ఓటు హక్కును ఎలా తొలగించారో వెంటనే విచారణ చేసి నివేదికను పంపాలని ఆయా జిల్లా ఎన్నికల అధికారులను సిఇఒ రజత్ కుమార్ ఆదేశించినట్లు తెలిసింది. దీంతో జిల్లా ఎన్నికల అధికారులు ఇప్పుడు విచారణ చేపట్టారు. క్షేత్రస్థాయిలో అప్పట్లో ఉన్న బూత్ స్థాయి అధికారి ఎవరు, ఓటు తొలగించే సమయంలో వారికి నిబంధనల ప్రకారం నోటీసులు ఇచ్చారా, వారి నుంచి స్పందన వచ్చిందా, ఏదైనా ఫిర్యాదు వస్తే ఆ పేర్లను జాబితా నుంచి తీసేశారా, జాబితా నుంచి వారి పేర్లు ఏ విధంగా తొలగిపోయాయి తదితర అంశాలపై ఎన్నికల అధికారులు ఇప్పుడు విచారణ జరుపుతున్నారు. ఓటు హక్కును కోల్పోయిన ఉన్నతాధికారుల్లో అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ కృష్ణ ప్రసాద్, శాంతి భద్రతల అదనపు డిజిపి జితేందర్, మరో ఐపిఎస్ అధికారి రాధాకృష్ణ, రోడ్డు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి మిన్నీ మాథ్యూ, ఐఎఎస్ అధికారి కమల్ వర్ధన్, సిఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ అంజనా సిన్హా, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు సతీమణి, ప్రేమ్ చంద్రారెడ్డి రిటైర్డ్ ఐఎఎస్ తదితరులు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ రోజున లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు గల్లంతైందంటూ పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు. ఓటరు కార్డు ఉన్నప్పటికీ, అదే ప్రాంతంలో నివసిస్తున్నప్పటికీ ఎటువంటి నోటీసు అందివ్వకుండానే ఓటును తీసేసారని ఎన్నికల అధికారులపై విమర్శలు వచ్చాయి. ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణి గుత్తా జ్వాల కూడా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లగా అక్కడ ఉన్న లిస్ట్‌లో తన పేరు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై అప్పుడే సిఇఒ ప్రత్యేక విచారణకు ఆదేశించారు. అయితే నోటీసులు ఏమీ ఇవ్వకుండానే చాలామంది ఓటర్ల పేర్లను బూత్‌స్థాయి అధికారులు జాబితా నుంచి తొలగించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ప్రాథమిక సర్వేలో తేలింది. ఆ తరువాత ఆధార్ కార్డు వివరాలను ఓటర్ల జాబితాలో పేర్లకు అనుసంధానం చేయడంపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో ఎన్నికల సంఘం ఆ ప్రక్రియ నుంచి వెనక్కి తగ్గింది. ఇక మరికొన్ని ఓటర్ల తొలగింపుపై స్పష్టత లేదు. దాదాపు 20 లక్షల ఓటర్లు గల్లంతు అయినట్లు ఆరోపణలు రావడంపై సిఇఒ రజత్ కుమార్ కూడా క్షమాపణలు చెప్పారు. ఓట్ల తొలగింపులో వివిఐపిలు ఎవరైనా ఉన్నారో ముందుగానే చూసి, వారిని ప్రస్తుత సవరణలో చేర్చేందుకు సిఇఒ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో తొలగించిన ఓటర్లపై సర్వే చేస్తే 7.40 లక్షల ఓటర్లకు గాను 6.80 లక్షలు సరైన తొలగింపులేనని సిఇఒ ఇటీవల మీడియాకు చెప్పారు. కాకపోతే మిగిలిన 60 వేల ఓటర్లు సరైనవే. ఒక్కో జిల్లాలో సగటున 30 వేల ఓట్లు లక్షల ఓట్లు పోయినట్లే కదా అని ఒక రాజకీయ నేత "మన తెలంగాణ"తో వ్యాఖ్యానించారు.

ఐదు గదుల బస.. వంటమనిషి

- జైలులో శశికళకు ప్రత్యేక ఏర్పాట్లు
- ఆర్టీఐ అర్జీతో కీలక అంశాల వెల్లడి
- దర్యాప్తు నివేదిక ఎట్టకేలకు వెలుగులోకి



బెంగళూరు : అన్నాడిఎంకె బహిష్కృత నాయకురాలు శశికళకు ఇక్కడి సెంట్రల్ జైలులో ప్రత్యేక ఏర్పాట్లు కల్పించినట్లు వెల్లడైంది. అవినీతి కేసులో శశికళ ఇక్కడి పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. జైలులో ఏర్పాట్ల విషయంలో ఆమెకు అత్యున్నత స్థాయి ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు దర్యాప్తు కమిటీ నివేదికలో వెల్లడైంది. ఈ విషయం సమాచార హక్కు చట్టం అర్జీకి జవాబుగా వెలుగులోకి వచ్చింది. శశికళకు జైలులో ఎటువంటి ఏర్పాట్లు ఉన్నాయనేది సామాజిక కార్యకర్త నరసింహ మూర్తి ఆర్టీఐ పరిధిలో వివరంగా పొందారు. దివంగత సిఎం జయలలితకు నెచ్చెలిగా పేరొందిన శశికళకు ఐదు గదులతో కూడిన బస, ప్రత్యేకంగా వంటగది ఉన్నట్లు వెల్లడైందని ఈ అర్జీదారు తెలిపారు. ఆర్టీఐ పరిధిలో తాను ఈ 295 పేజీల నివేదికను పొందినట్లు మూర్తి చెప్పారు. శశికళకు జైలులో అన్ని విధాలుగా ప్రాధాన్యతను కల్పిస్తున్నట్లు, జైలు జైలుగా కాకుండా సొంతిల్లుగా ఉన్నట్లు రెండేళ్ల క్రితం అప్పటి జైళ్ల డిఐజి డి రూపా పేర్కొన్న అంశాలు , దానికి అనుగుణంగా జరిగిన దర్యాప్తు క్రమంలో నిర్ధారణ అయినట్లు చెప్పారు. ఆమెకు అన్నింటా ప్రాధాన్యతను కల్పిస్తున్నారు. ఆమెకు తొలుత ఒక సెల్ కేటాయించారు. అయితే ఇందులోని ఐదు గదులలో ఉండే ఖైదీలను వేరే చోటికి తరలించినట్లు, ఇప్పుడు ఐదు గదులు ఆమె నివాసంగా ఉన్నాయని, ఆమె కోసం ప్రత్యేకంగా వంట మనిషిని ఏర్పాటు చేశారని, ఆమె కోసం వచ్చే సందర్శకులకు ఎటువంటి ఆంక్షలు లేకుండా లోపలికి అనుమతిస్తున్నారని, మూడు నాలుగు గంటల పాటు వారు ఉంటున్నారని నివేదికలో వెల్లడైందని ఈ సామాజిక కార్యకర్త తెలిపారు. శశికళకు సకల జైలు రాణి మర్యాదలు జరుగుతున్నట్లు , కొందరు అధికారులు ఆమె నుంచి కోట్లాది రూపాయల లంచాలు తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా అన్ని ఏర్పాట్లు చేశారని అప్పటి జైళ్ల అధికారిణి ఆరోపించడం సంచలనం కల్గించింది. దీనిపై అప్పట్లో సిద్ధరామయ్య ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది. రిటైర్డ్ ఐఎస్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. అక్రమాస్తుల కేసులో దోషిగా నిర్ధారణ అయిన శశికళ తన బంధువులు విఎన్ సుధాకరన్, ఎలవరసిలతో పాటు ఈ జైలులోనే నాలుగేళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్నారు. దర్యాప్తు కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి 2017 నవంబర్‌లో అందించింది. అయితే ఇందులోని అంశాలు వెల్లడి కాలేదు. ఈ నివేదిక లోగుట్టు ఇప్పుడు ఆర్టీఐ అర్జీతో వెలుగులోకి వచ్చింది. జైలులో ఆమెకు విఐపి ఏర్పాట్లు ఉన్నాయని, ప్రత్యేకాతి ప్రత్యేక ఏర్పాట్లు ఏమీ లేవని ప్రభుత్వం చెపుతూ వచ్చింది. అయితే జైలులో ఆమె ఖైదీల దుస్తులు ధరించడం లేదని , తనకు ఇష్టమైన చీరలు దుస్తులు వేసుకునేందుకు వీలు కల్పించారని , ఆమె కోసం వచ్చే వారికి ప్రత్యేకంగా గది ఏర్పాటు చేశారు. ఆమె ఉండే ప్రాంతంలో కారిడార్ ఏర్పాటు చేశారు. జైలులో ఆమె పచార్లు చేసేందుకు వీలు కల్పించారు. ఆమె అంతటా తిరుగుతున్న దానిని బలపరిచే వీడియో దృశ్యాలను కూడా దర్యాప్తు నివేదికలో పొందుపర్చారు. సహఖైదీ అయిన ఎలవరసితో కలిసి శశికళ మహిళా బ్యారక్ నుంచి బయటకు వెళ్లడాన్ని తెలిపే వీడియో కూడా జతపర్చారు. ఆయన చేతిలో ఒక సంచి ఉంది. ఈ వీడియోలను అప్పడి ప్రిజన్స్ అధికారిణి దర్యాప్తు కమిటీకి నివేదించారు. ఒకరోజు శశికళ తెల్లటి దుస్తులలో ఉన్న వ్యకిత్తో నాలుగు గంటల పాటు సమావేశం అయిన విషయం కూడా వెలుగులోకి వచ్చింది. శశికళకు పలు రకాలుగా ప్రత్యేక మర్యాదలు దక్కినా, నిబంధనలకు అతీతంగా ఆమె వ్యవహరించినట్లు తెలిపే వీడియో ఆధారాలు ఉన్నా, ఇటువంటివి ఏమీ లేవని తెలిపే విధంగా జైలు అధికారిక రికార్డులలో ఉందని వెల్లడించారు.

మోడీ బారినుంచి రక్షణకే మమత ర్యాలీ



పాట్నా : కోల్‌కతాలో జరిగిన ప్రతిపక్ష ర్యాలీ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉద్దేశించినదే అని బిజెపి ఎంపి శత్రుఘ్ను సిన్హా స్పష్టం చేశారు. మోడీ సర్కారుతో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని, ఈ పరిస్థితిని నివారించేందుకే ఈ సభ జరిగిందని ఆదివారం ఆయన ఇక్కడ చెప్పారు. మమత బెనర్జీ ఆధ్వర్యంలో కోల్‌కతాలో జరిగిన ప్రతిపక్ష సభకు శత్రుఘ్ను సిన్హా హాజరయ్యారు. ఇందుకు ఫలితంగా పార్టీ అధినాయకత్వం నుంచి చర్యల బెదిరింపులు వస్తున్నాయి. అయితే వీటిని బేఖాతరు చేస్తూ షాట్‌గన్‌గా పేరొందిన శత్రుఘ్ను సిన్హా కేంద్రంపైనా, మోడీపైనా, బిజెపి నాయకత్వంపైనా ఘాటు విమర్శలను కొనసాగించారు. మోడీ, అమిత్ షాలు జంటగా నిరంకుశ వైఖరికి దిగుతున్నారని, ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచిన అటల్ అద్వానీల దశ వ్యవస్థను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. నియంతృత్వానికి వ్యతిరేకంగానే తాను కత్తి దూశానని, ప్రజాస్వామ్య పరిరక్షణ సభకు వెళ్లానని తెలిపారు. దేశంలో సమూల పరివర్తనల గాలి వీస్తోందని, ఈ అంశం కోల్‌కతా సభతో బ్రహ్మాండమైన రీతిలో వెల్లడైందని, అసంఖ్యాక రీతిలో జనం తరలివచ్చారని, మార్పునకు సానుకూలంగా సంకేతాలు వెలువరించారని విశ్లేషించారు.

శబరిమల ఆలయం మూసివేత

జైపూర్ : శబరిమల/తిరువనంతపురం: మకరజ్యోతి దర్శనానికి రెండు నెలల కిందట తెరిచిన అయ్యప్ప స్వామి ఆలయాన్ని ఆదివారం మూసేశారు. ఏటా ఈ సీజన్‌లో భక్తులకోసం ఆలయాన్ని తెరచి ఉంచుతారు. శతాబ్దాల నుంచీ ఆలయంతో సంబంధమున్న పందాలం రాజవంశానికి చెందిన ప్రతినిధి పి రాఘవ వర్మ రాజా ఆలయాన్ని దర్శించుకున్న తర్వాత ఆదివారం ఉదయం 6 గంటల 15 నిముషాలకు ఆలయాన్ని మూసేశారు. అంతకు ముందు 'భస్మాభిషేకం' నిర్వహించిన తర్వాత హరివరాసనమ్ నామ సంకీర్తనతో ఆలయాన్ని మూసేశారు. 67రోజులపాటు నిర్వహించిన వార్షికోత్సవాల అనంతరం మూతపడిన అయ్యప్పస్వామి ఆలయాన్ని మాసపూజల్ని నిర్వహించేందుకు ఫిబ్రవరి 13న తిరిగి తెరుస్తారు.

పుష్య పూర్ణిమకు కుంభమేళా సిద్ధం

అలహాబాద్ : ప్రయాగరాజ్ కుంభమేళలో అత్యంత పవిత్రమైనదిగా భావించే పుష్య పూర్ణిమకు లక్షలాదిగా జనం తరలివస్తున్నారు. గంగ యమున సరస్వతి నదులు కలిసే త్రివేణి సంగమం వద్ద పవిత్ర స్నానాలు చేసేందుకు ఇప్పటికే పలు దిక్కుల నుంచి భక్తులు, భారీ సంఖ్యలో సాధువులు ఇక్కడికి చేరారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేసింది. స్థానిక రైల్వేస్టేషన్, బస్సు స్టేషన్లు, విమానాశ్రయాలు, ఇక్కడికి చేరుకునే మార్గాలపై బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కేంద్రీయ పారామిలిటరీ బలగాలు, పోలీసు యంత్రాంగం చాలా రోజులుగా ఇక్కడ భద్రతా ఏర్పాట్లలో నిమగ్నం అయి ఉంది. కుంభమేళ సాఫీగా జరిగేందుకు , భద్రతాయుతంగా ప్రశాంతంగా అన్ని కార్యక్రమాలు సాగేందుకు ఏర్పాట్లు చేసినట్లు యుపి శాంతి భద్రతల పోలీసు అధికారి ఆనంద్‌కుమార్ చెప్పారు. అత్యంత విశిష్టమైన పౌష్ పూర్ణిమ సందర్భంగా దాదాపు 20 లక్షల మంది భక్తులు ఇక్కడికి చేరుకుంటారని అంచనా వేశారు. మకర సంక్రాంతి సందర్భంగా ఇక్కడ తొలిసారి పవిత్ర స్నానాల ఘట్టం జరిగింది. ఇప్పుడు రెండో దఫా పవిత్ర స్నానాలు ఆచరించేందుకు భక్తులు సమాయత్తం అయ్యారు. ఇక్కడి కుంభ్‌కు తరలివచ్చే ప్రతి ఒక్కరిని జాగ్రత్తగా చూసుకోవడం జరుగుతుందని, అందుబాటులోకి అత్యంత అధునాతన సాంకేతిక ప్రక్రియను కూడా తీసుకువచ్చామని, భారీ స్థాయిలో భద్రతా బలగాలు రంగంలోకి దిగాయని, అంతా ప్రశాంతంగా సాగుతుందని ఆశిస్తున్నామని వెల్లడించారు.

డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను ప్రారంభించిన రక్షణ మంత్రి

తిరుచిరాపల్లి : తమిళనాడు రక్షణ ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఆదివారం రక్షణ శాఖ మంత్ర నిర్మలా సీతారామన్ తిరుచిరాపల్లిలో ప్రారంభించారు. రక్షణ పరికరాల దేశవాళీ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఈ కారిడార్‌కు 3,038 కోట్లు పెట్టుబడులు పెడుతున్నట్లు ఆమె తెలిపారు. పిఎస్‌యుల నుంచి అత్యధిక పెట్టుబడులు రానున్నట్లు సీతారామన్ తెలిపారు. డిఫెన్స్ కారిడార్‌కు స్థానిక పరిశ్రమల నుంచి అనూహ్య స్పందన రావడంతో దీనిని పాలక్కాడ్ వరకు విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఐదు నోడల్ నగరాల్లో మాత్రమే దీనిని ఏర్పాటు చేసినట్లు రక్షణ మంత్రి తెలిపారు.

బీహార్‌లో ప్రీ పెయిడ్ మీటర్లు

పాట్నా : బీహార్‌లో విద్యుత్ చౌర్యం నివారణకు అన్ని ఇండ్లకు ప్రీ పెయిడ్ విద్యుత్ మీటర్లను సమకూర్చనున్నారు. ఇవి అత్యంత అధునాతన మీటర్లుగా పనిచేస్తాయని వచ్చే నాలుగు అయిదేళ్లలో అన్ని గృహాలకు వీటిని బిగించడం జరుగుతుందని అధికార వర్గాలు తెలిపాయి. గత రెండు మూడేళ్లలో రాష్ట్రంలో ప్రయోగాత్మక రీతిలో ఇటువంటి మీటర్లను ఏడువేల ప్రభుత్వ క్వార్టర్లకు అమర్చారు.దీనిని ఇప్పుడు రాష్ట్రంలోని అన్ని ఇళ్లకు విస్తరింపచేస్తారని అధికారి ఒకరు చెప్పారు. అక్రమ విద్యుత్ వాడకాన్ని నిరోధించడం, విద్యుత్ పంపిణీ సంస్థలు ఎదుర్కొంటున్న సాంకేతిక, వాణిజ్య సగటు నష్టాలను తగ్గించేందుకు ఇటువంటి ఏర్పాట్లకు దిగుతున్నట్లు వెల్లడించారు.

3న ప్రధాని కశ్మీర్ పర్యటన



జమ్మూ : ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఫిబ్రవరి 3న జమ్ము కశ్మీర్‌లో పర్యటిస్తారు. అక్కడ ఆయన ఒక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో అనేక ప్రాజెక్టుల్ని ప్రారంభిస్తారని బిజెపి ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ తెలిపారు. ప్రధాని జమ్ములో రూ. 35,000 కోట్లు, కశ్మీర్‌లో రూ.9,000 కోట్ల విలువగల ప్రాజెక్టుల్ని ప్రారంభిస్తారు. ప్రధాని మోడీ లేహ్, జమ్ము, శ్రీనగర్‌లను సందర్శిస్తారు. జమ్ములో రెండు లక్షల మంది హాజరయ్యే ఒక మెగా ర్యాలీలో పాల్గొంటారని రామ్ మాధవ్ విలేకరులకు తెలిపారు. జమ్ము పర్యటనలో ఆయన ఎయిమ్స్, ఐఐఎం, ఐఐటి, జమ్ము అఖ్నూర్ రోడ్, షాపూర్‌కండి రోడ్, సుందర్‌బని కాలేజి, ఐఐఎంసిలకు పునాదిరాయి వేస్తారు. కథువాలో ఒక ఇంజినీరింగ్ కాలేజిని, జమ్ము రోప్‌వే ప్రాజెక్ట్‌ను కూడా నరేంద్ర మోడీ ప్రారంభిస్తారు.



ఫెదరర్‌కు షాక్

మెల్‌బోర్న్: వరసగా మూడో సారి ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్‌ను గెలుచుకోవాలని ఉవ్విళ్లూరుతున్న స్విస్ స్టార్ రోజర్ ఫెదరర్‌కు ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో గ్రీక్ యువ సంచలనం రూపంలో చుక్కెదురైంది. ఆదివారం రాత్రి ఫ్లడ్ లైట్ల వెలుగులో రాడ్ లేవర్ ఎరీనాలో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో 20 ఏళ్ల యువ సంచలనం స్టిఫానస్ సిట్సిపాస్ చేతిలో ఫెదరర్ ఊహించని రీతిలో ఓటమి పాలయి టోర్నమెంటునుంచి నిష్క్రమించారు. తొలి సెట్‌ను 7–6 స్కోరుతో ఫెదరర్ గెలుచున్నప్పటికీ సిట్సిపాస్ పట్టువదలని విక్రమార్కుడిలా పోరాడి తర్వాతి మూడు సెట్లను 7 –6,7– 5,7 –6 స్కోరుతో గెలుపొంది తన కెరీర్‌లో చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నాడు. చివరి సెట్‌లో ఒక దశలో ఫెదరర్ సెట్ పాయింట్‌తో ఆధిక్యతతో ఉన్నప్పటికీ పట్టు వదలని యువ కిశోరం దాన్ని కాపాడుకోవడమే కాకుండా మ్యాచ్‌ను కూడా సొంతం చేసుకున్నాడు. క్వార్టర్ ఫైనల్లో సిట్సిపాస్ స్పెయిన్‌కు చెందిన రాబర్టో బాటిస్టా అగట్‌ను ఎదుర్కొంటాడు. మరో మ్యాచ్‌లో రెండో సీడ్ రఫెల్ నాడల్ చెక్ రిపబ్లిక్‌కు చెందిన థామస్ బెర్డిచ్‌ను 6 –0,6 –1,7– 6 స్కోరుతో ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు.

షరపోవా జౌట్

ఆస్ట్రేలియన్ సంచలనం ఆష్ బార్టీ చేతిలో ఓటమి

క్విటోవాపై అన్‌సీడెడ్ సంచలనం



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఆదివారం రెండు సంచలనాలు నమోదయ్యాయి. ఇద్దరు దిగ్గజ క్రీడాకారులు యువ సంచలనాల చేతిలో కంగుతిన్నారు. మహిళల సింగిల్స్ విభాగంలో రష్యాకు చెందిన మాజీ చాంపియన్ మరియా షరపోవా ఆస్ట్రేలియాకు చెందిన యువ క్రీడాకారిణి ఆష్ బార్టీ చేతిలో అనూహ్యంగా ఓటమి పాలయింది. అలాగే పురుషుల సింగిల్స్ విభాగం ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో టెన్నిస్ ప్రపంచంలోనే తిరుగులేని క్రీడాకారుల్లో ఒకడిగా గుర్తింపు పొందిన స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్ గ్రీస్‌కు చెందిన ఇరవై ఏళ్ల యువ సంచలనం స్టెఫానొస్ సిట్సిపాస్ చేతిలో కంగు తిన్నాడు. దీంతో ఏడో సారి ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్‌ను గెలుచుకుని రికార్డు సృష్టించాలన్న ఫెదరర్ కలకు ఫుల్ స్టాప్ పడినట్లయింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో క్రికెటర్ కమ్ టెన్నిస్ స్టార్ అయిన ఆష్ బార్టీ మాజీ చాంపియన్ షరపోవాపై 4 –6, 6 –1, 6 — 4 స్కోరుతో విజయం సాధించి తొలిసారిగా గ్రాండ్ శ్లామ్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. ఆష్ బార్టీ టెన్నిస్‌తో పాటుగా క్రికెట్ కూడా ఆడుతుంది. 2014లో అనూహ్యంగా టెన్నిస్‌కు విరామం ప్రకటించిన ఆమె మహిళ బిగ్‌బాష్‌లో బ్రిస్బేన్ హీట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. ఆ తర్వాత మళ్లీ టెన్నిస్ రాకెట్ పట్టుకున్న బార్టీ గత ఏడాదే కెరీర్ బెస్ట్ 15వ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. ఇక తాజాగా అయిదు గ్రాండ్‌శ్లామ్ టైటిల్స్ గెలుచుకున్న షరపోవాను మట్టిగరిపించి ఔరా అనిపించింది. అంతే కాదు చాలా సంవత్సరా తర్వాత ఆస్ట్రేలియా ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన స్వదేశీ క్రీడాకారిణిగా కూడా రికార్డు సృష్టించింది. తొలి సెట్‌ను 6– 4 స్కోరుతో సొంతం చేసుకున్న షరపోవా మ్యాచ్‌పై పట్టు సాధించినట్టే కనిపించింది. అయితే ఏమాత్రం ధైర్యం కోల్పోని బార్టీ ఆ తర్వాత చెలరేగిపోయింది. రెండో సెట్‌లో షరపోవా సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసిన ఆమె ఆ సెట్‌ను 6– 1 స్కోరుతో సునాయాసంగా సొంతం చేసుకుని షరపోవాకు సవాలు విసిరింది. నిర్ణాయకసెట్‌లో బార్టీ రెండు సార్లు షరపోవా సర్వీస్ బ్రేక్ చేసి 4 –0 ఆధిక్యతలోకి దూపుకెళ్లింది. అయితే షరపోవా ఆ తర్వాత పుంజుకొని వరసగా మూడు గేమ్‌లు గెలుచుకొని ప్రత్యర్థి ఆధిక్యతను తగ్గించింది. అయితే బార్టీ అసమాన పోరాట పటిమను కనబరుస్తూ తనకన్నా ఎంతో సీనియర్ అయిన షరపోవాకు దీటుగా ఆడి సెట్‌ను 6 – 4 స్కోరుతో సొంతం చేసుకొని తొలిసారి ఆస్ట్రేలియా ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో స్థానం సంపాదించింది. క్వార్టర్ ఫైనల్లో బార్టీ రెండు సార్లు వింబుల్డన్ చాంపియన్ అయిన పెట్రా క్విటోవాతో తలపడుతుంది. అంతకు ముందు జరిగిన మరో ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌లో క్విటోవా అమెరికా టీనేజర్ అమందా అనిసిమోవాను 6– 2,6 –1 స్కోరుతో చిత్తు చేసి క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రవేశించింది.

కెర్బర్ ఇంటికి..

మరో ప్రిక్వార్టర్ మ్యాచ్‌లో అమెరికాకు చెందిన అన్‌సీడెడ్ క్రీడాకారిణి డేనియల్ కాలిన్స్ 2016నాటి ఆస్ట్రేలియా ఓపెన్ చాంపియన్, రెండో సీడ్ ఏంజలిక్ కెర్బర్‌ను 6 –0,6– 2 స్కోరుతో వరస సెట్లలో చిత్తు చేసి క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రవేశించింది. కేవలం గంట లోపే ఈ మ్యాచ్ ముగియడం విశేషం. ఇంతకు ముందు గ్రాండ్‌శ్లామ్ టోర్నమెంట్లలో ఒక్క మ్యాచ్ కూడా గెలవని ఈ 25 ఏళ్ల అన్‌సీడెడ్ క్రీడాకారిణి ట్రిపుల్ గ్రాండ్‌శ్లామ్ విజేత అయిన కెర్బర్‌పై కనీవినీ ఎరుగని రీతిలో దూకుడును వరస విన్నర్స్‌తో గుక్కతిప్పుకోనివ్వలేదు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 35వ స్థానంలో ఉన్నకాలిన్స్ తొలి సెట్‌ను కేవలం 20 నిమిషాల్లోనే గెలుచుకుంది. ఈ టోర్నమెంట్‌లో రెండో సీడ్ అయిన కెర్బర్ ఈ సెట్‌లో అయిదు డబుల్ ఫాల్ట్స్ సర్వ్ చేసింది. రెండో సెట్‌లో కెర్బర్ కొంత ప్రతిఘటన కనబర్చినప్పటికీ తన స్థాయికి తగ్గ ఆటను ఏ దశలోను ప్రదర్శించలేక టోర్నమెంటునుంచి నిష్క్రమించింది. క్వార్టర్ ఫైనల్‌లో కాలిన్స్ అయిదో సీడ్ స్లోవానే స్టెఫాన్స్, రష్యా క్రీడాకారిణి అనస్తాషియా పవ్ల్యుచెంకోవా మధ్య మ్యాచ్‌లో విజేతతో తలపడుతుంది.

ఆసీస్ గడ్డపై టీమిండియా
నయా చరిత్ర



మన తెలంగాణ/క్రీడా విభాగం: ఆస్ట్రేలియా గడ్డపై చారిత్రక ప్రదర్శనతో టీమిండియా ప్రపంచ క్రికెట్‌లో కొత్త అధ్యాయానికి తెరలేపిందనే చెప్పాలి. ఆస్ట్రేలియాను వారి సొంత గడ్డపై ఓడించడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి. అలాంటి జట్టును టెస్టుల్లో, వన్డేల్లో ఓడించి విరాట్ కోహ్లి సేన పెను ప్రకంపనలు సృష్టించింది. ట్వంటీ–20 సిరీస్‌ను సమం చేసిన భారత్ తర్వాత జరిగిన టెస్టు, వన్డే సిరీస్‌లలో జయకేతనం ఎగుర వేసింది. ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌లలో భారత్ టెస్టుల్లో, వన్డేల్లో విజయం సాధించడం ఇదే తొలిసారి. గతంలో ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన సిరీస్‌లలో భారత్‌కు చేదు జ్ఞాపకాలే మిగిలాయి. టెస్టుల్లో అయితే భారత్ ప్రదర్శన అంతంత మాత్రమే. కిందటి రెండు సిరీస్‌లలో అయితే చిత్తు చిత్తుగా ఓడింది. కానీ, ఈసారి మాత్రం భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. సిడ్నీలో జరిగిన ఆఖరి టెస్టుకు వర్షం అడ్డంకిగా మారి ఉండక పోతే భారత్ మరింత భారీ తేడాతో సిరీస్‌ను సొంతం చేసుకునేది. అంతే గాక టి–20లలో కూడా వర్షం వల్ల భారత్‌కు సిరీస్ సాధించే అవకాశం చేజారింది. ఇక, ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో మూడు ఫార్మాట్‌లలో కూడా టీమిండియా చిరస్మరణీయ ప్రదర్శన చేసిందనే చెప్పాలి. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో కోహ్లి సేనకు ఎదురు లేకుండా పోయింది. సొంత గడ్డపై సిరీస్‌లంటే ఆస్ట్రేలియా గెలుపు దాదాపు ముందే ఖరారు కావడం సంప్రదాయంగా వస్తోంది. గతంలో ఇంగ్లండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా జట్లు మాత్రమే ఆస్ట్రేలియాను వారి సొంత గడ్డపై ఓడించాయి. తాజాగా ఈ జట్ల సరసన భారత్ చేరింది. ఇంగ్లండ్ గడ్డపై టెస్టుల్లో పేలవమైన ప్రదర్శన చేసిన టీమిండియాకు ఆస్ట్రేలియా సిరీస్‌లో కూడా ఇలాంటి పరిస్థితులు ఎదురు కావడం ఖాయమని అందరూ భావించారు.

మురిపించిన ధోని

ఇక, వన్డే సిరీస్‌లో సీనియర్ ఆటగాడు, మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని అసాధారణ ఆటతో ఆకట్టుకున్నాడు. ఆడిన మూడు మ్యాచుల్లోనూ ధోని అద్భుతంగా రాణించాడు. మూడింటిలోనూ అర్ధ సెంచరీలు సాధించి తనలో ఇంకా సత్తా మిగిలేవుందని విమర్శకులకు గట్టి సమాధానం చెప్పాడు. చివరి రెండు మ్యాచుల్లో ఆఖరు వరకు అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. రానున్న ప్రపంచకప్‌లోనూ జట్టులో స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. మరోవైపు కెప్టెన్ విరాట్ కోహ్లి, వైస్ కెప్టెన్ రోహిత్ శర్మలు కూడా బ్యాట్‌తో మెరుపులు మెరిపించారు. ఇద్దరు సిరీస్‌లో చెరో సెంచరీ సాధించి తామెంత కీలక ఆటగాళ్లో చాటి చెప్పారు. కేదార్ జాదవ్ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. బౌలింగ్‌లో భువనేశ్వర్, చాహల్‌లు అద్భుతంగా రాణించారు. చివరి వన్డేలో చాహల్ ఏకంగా ఆరు వికెట్లు తీసి సంచలనం సృష్టించాడు. రెండో వన్డేలో భువనేశ్వర్ కూడా నాలుగు వికెట్లు తీసి జట్టు విజయంలో కాలక పాత్ర పోషించాడు. మహ్మద్ షమీ కూడా బాగానే బౌలింగ్ చేశాడు. కీలక సమయంలో వికెట్లు తీసి జట్టు విజయంలో తనవంతు సహకారం అందించాడు. కాగా, రానున్న ప్రపంచకప్‌లో మరింత మెరుగ్గా రాణించేందుకు టీమిండియాకు ఈ విజయాలు దోహదం చేస్తాయనడంలో సందేహం లేదు.





కానీ, కోహ్లి సేన మాత్రం ఒత్తిడిని సయితం తట్టుకుంటూ మూడో టెస్టులో చారిత్రక విజయాన్ని అందుకుంది. కొత్త ఆటగాడు మయాంక్ అగర్వాల్ అసాధారణ బ్యాటింగ్‌తో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆడిన రెండు మ్యాచుల్లోనూ మయాంక్ తనదైన ముద్ర వేశాడు. రానున్న రోజుల్లో పృథ్వీషా, మయాంక్‌లు భారత జట్టుకు కీలక ఓపెనర్లుగా మారడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక, మిస్టర్ డిపెండబుల్ చటేశ్వర్ పుజారాను ఎంత పొగిడిన తక్కువే. టెస్టు సిరీస్‌లో నిలకడగా రాణించిన పుజారా తానెంత విలువైన ఆటగాడో మరోసారి నిరూపించాడు. కెప్టెన్ విరాట్ కోహ్లి, వైస్ కెప్టెన్ అజింక్య రహానె, వికెట్ కీపర్ రిషబ్ పంత్‌లు కూడా అద్భుతంగా రాణించారు. జట్టు టెస్టు సిరీస్ గెలవడంలో వీరంత తమవంతు సహకారం అందించారు





కానీ, తొలి టెస్టు నుంచే భారత జట్టు అసాధారణ ఆటను కనబరిచింది. ప్రారంభ టెస్టులోనూ ఆస్ట్రేలియాను ఓడించి సంచలనం సృష్టించింది. భారీ తేడాతో గెలవకున్న విజయం భారత జట్టులో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని చెప్పాలి. కానీ, రెండో టెస్టులో చిత్తుగా ఓడడంతో భారత జట్టు ప్రదర్శనపై మళ్లీ సందేహాలు తలెత్తాయి.

సత్తా చాటిన బౌలర్లు

మరోవైపు టెస్టు, వన్డే సిరీస్ విజయాల్లో బౌలర్లది కూడా కీలక పాత్ర అని చెప్పక తప్పదు. టెస్టుల్లో జస్‌ప్రిత్ బుమ్రా, మహ్మద్ షమీ, ఇషాంత్ శర్మ, రవీంద్ర జడేజా, అశ్విన్‌లు అద్భుతంగా రాణించారు. బుమ్రా అయితే ఏకంగా 21 వికెట్లు తీసి ఆస్ట్రేలియా బ్యాటింగ్ లైనప్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. షమీ కూడా 16 వికెట్లతో మెరిశాడు. ఇషాంత్ కూడా 11 వికెట్లను పడగొట్టి తనలో చేవ తగ్గలేదని నిరూపించాడు.

జడేజా, అశ్విన్, కుల్దీప్‌లు తమ స్పిన్‌తో జట్టుకు అండగా నిలిచారు. ఇలా బౌలర్లందరూ సమష్టి కృషితో భారత్‌కు చారిత్రక విజయాన్ని అందించారు.



మా ఓటమికి ఎవరూ బాధ్యులు కారు

ఆసీస్ కెప్టెన్ ఆరోన్ ఫించ్

సిడ్నీ: భారత్‌తో జరిగిన వన్డే సిరీస్ కోల్పోవడంపై ఎవర్నీ నిందించలేమని ఆసీస్ పరిమిత ఓవర్ల సారథి ఆరోన్ ఫించ్ అన్నాడు. జట్టులో ఆటగాళ్లందరూ విజయం కోసం ప్రయత్నించారని చెప్పా రు. వన్డే సిరీస్ కోల్పోవడంపై ఫించ్ మీడియాతో మాట్లాడాడు. 'పరిమిత ఓవర్లలో ఆడేటప్పుడు ఒకప్పుడు మా బ్యాట్స్‌మెన్ చా లా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు ఆ సమస్యను మేం దాదాపుగా అధిగమించాం. మూడు వన్డేల్లోనూ బాగానే బ్యా టింగ్ చేశాం.అందులో ఎంతో పురోగతి సాధించాం. బ్యాటింగ్ సమస్యకు ఇప్పుడిప్పుడే సమాధానం దొరుకుతోంది. సారథిగా ఈ విషయం నన్ను కలవరపెట్టేది. కానీ టీమిండియాతో జరిగిన మూడు వన్డేల తర్వాత నాకు జట్టుపై కాస్త నమ్మకమేర్పడింది. సిరీస్ గెలవడం కంటే ముందు ఆటను మెరుగుపరుచుకుంటే మ్యాచ్‌లో విజయం సాధించడం పెద్ద సమస్య కాదు. నా బ్యాటింగ్ శైలిలో కూడా మార్పు వచ్చినందుకు సంతోషంగా ఉంది.

క్రీడలు వ్యక్తికి, ప్రాంతానికి పేరు తెస్తాయి

■ ప్రభుత్వాలు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

■ ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ గోపిచంద్



మన తెలంగాణ/హైదరాబాద్ : క్రీడలు వ్యక్తికి, ప్రాంతానికి పేరు తెచ్చిపెడతాయని ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ అన్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాగృతి అంతర్జాతీయ యువ నాయకత్వ సదస్సులో భాగంగా ఆదివారం వివిధ అంశాలపై చర్చాగోష్టులు జరిగాయి. యువత అభివృద్ధిపై అఫ్ఘనిస్తాన్‌కు చెందిన నబీల నిర్వహించిన సెషన్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, చిన్న వయసులో ఎవరెస్టును అధిరోహించిన మలావత్ పూర్ణ, ప్రముఖ రెజ్లింగ్ క్రీడాకారిణి బబిత పోగొట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుల్లెల గోపిచంద్ మాట్లాడుతూ, క్రీడల ద్వారా ఆరోగ్యంతోపాటు పేరు ప్రఖ్యాతులు వస్తాయని అన్నారు. క్రీడల ప్రాధాన్యతను గుర్తించి పిల్లలు ఆటలు ఆడేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. భవిష్యత్తులో క్రీడలు కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వాలు ఫిజికల్ లిటరసీపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రభుత్వాలు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, క్రీడలపై నిధులు కేటాయించి అందరూ ఆటలు ఆడేలా ప్రోత్సహించాలని అన్నారు. ఆటలు, కళలు ఆరోగ్యాన్ని ఆనందాన్ని అందిస్తాయని అన్నారు. శారీరక దృడత్వం ఉంటేనే మానసిక దృడత్వం ఉంటుందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా తన జీవితంలో ఎదురైన అనుభవాలను పంచుకున్నారు.

ప్రతి ఒక్కరి జీవితంలో ఆటలు భాగం కావాలి : మలావత్ పూర్ణ

క్రీడలు ఆరోగ్యంతో పాటు జీవితాన్ని ఇస్తాయని, తన విషయంలో అదే జరిగిందని మలావత్ పూర్ణ వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఆటలు భాగం కావాలని ఆకాంక్షించారు. తాను 9వ తరగతి చదువుతున్న సమయంలో సరదాగా నేర్చుకున్న రాక్ క్లైయిమింగ్ తన జీవితాన్నే మార్చేసిందని అన్నారు. భువగగిరిలో తన కోచ్ శిక్షణ ప్రారంభించినప్పుడు ఎవరెస్టు అధిరోహిస్తానని ఎప్పుడూ అనుకోలేదని అన్నారు. ఆడపిల్లలు కూడా ఏదైనా చేయగలుగుతారు అని నిరూపించడం కోసమే అంత సాహసోపేతంగా ఎవరెస్టు శిఖరం అధిరోహించానని తెలిపారు. తన కోచ్ ఆత్మస్థైర్యం నింపడం ద్వారానే అది సాధ్యమైందన్నారు. కొండలు ఎక్కేటప్పుడు భయంతో ప్రారంభమైన తన మొదటి అడుగు, శిక్షణ పూర్తయ్యాక ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని నింపిందని తెలిపారు. మానసిక ధృడత్వం కోసం తాను యోగా, మెడిటేషన్ చేస్తానని తెలిపారు. అన్ని ఖండాల్లో ఎత్తైన శిఖరాలను అధిరోహించాలనేదే తన సంకల్పమని వెల్లడించారు. ప్రస్తుతం తాను గ్రాడ్యుయేషన్ చేస్తున్నానని, భవిష్యత్తులో సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

మా నాన్నే నాకు రోల్ మోడల్ : బబిత పోగొట్, రెజ్లర్

ఏ రంగంలో రాణించాలన్నా క్రమశిక్షణ చాలా అవసరమని ప్రముఖ రెజ్లర్ క్రీడాకారిణి బబిత పోగొట్ అన్నారు. తన తండ్రే తనకు స్ఫూర్తి అని, ఆయనే తమకు రోల్ మోడల్ అని వ్యాఖ్యానించారు. రెజ్లింగ్‌లో తన తండ్రి తమకు దండల్ సినిమాలో చూపించిన దానికంటే కఠోరమైన శిక్షణ ఇచ్చారని చెప్పారు.

తమ తల్లితండ్రుల అంకితభావం, తాము పడ్డ శ్రమ ఫలితంగానే తాము ఇక్కడి వరకు రాగలిగామని పేర్కొన్నారు. చుట్టూ ఉన్న సమాజం వ్యతిరేకించినా, మనలో ఉన్న సంకల్పం, ఆత్మవిశ్వాసమే మనల్ని గెలిపిస్తుందని అన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను అతి సున్నితంగా పెంచకుండా, వారిలో ధైర్యసాహసాలు నూరిపోయాలని సూచించారు. అది కెరీర్‌తో పాటు జీవితంలో కూడా ఉపయోగపడుతుందని అన్నారు. సినిమాలో చూపించినట్లు అబ్బాయిలతో కలిసి శిక్షణ తీసుకున్నామని అని ఎంపి కవిత అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అబ్బాయిలతో కలిసి శిక్షణ తీసుకోవడం ద్వారా తమ నైపుణ్యం, సామర్థ్యం పెరిగిందని, ఎవరు ఎమనుకున్నా పట్టించుకోలేదని అన్నారు. తాను ఇంగ్లీష్‌లో కంటే హిందీలోనే బాగా మాట్లాడతానని చెప్పిన బబితా పోగొట్ సెషన్‌లో అడిగిన ప్రశ్నలకు హిందీలోనే సమాధానం చెప్పారు. మహిళా నాయకత్వం, సుస్థిర అభివృద్ధిపై నిర్వహించిన సదస్సులో వెబ్‌హబ్ సిఇఒ దీప్తి రావుల, యునైటెడ్ కింగ్‌డమ్(యుకె) డిప్యూటీ హై కమిషనర్ హెచ్.ఇ. ఆండ్రూ ఫ్లెమింగ్, వరల్డ్ ట్రేడ్ అండ్ డవలప్‌మెంట్ గ్రూప్ ప్రెసిడెంట్ జాన్ డిక్సన్, యుకె పార్లమెంట్ సభ్యురాలు సీమా మల్హోత్ర, పద్మశ్రీ అవార్డు గ్రహీత శాంతా సిన్హా, రెయిన్‌బో హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ప్రీతిరెడ్డి తదితరులు పాల్గొని పరస్పరం తమ ఆలోచనలు పంచుకున్నారు.

అగ్ర వర్ణాల్లోని పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయంలో బలం లేకపోతే ప్రతిపక్షాలకు నిద్ర లేని రాత్రులు ఉండేవి కాదని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం దక్షిణ గోవా, మహారాష్ట్రలోని కొల్హాపూర్, హత్కనంగ్లే, మాఢా, సతారా లోక్‌సభ నియోజకవర్గాల బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలతో మాట్లాడారు.


మహా అవినీతిపరుల ఘట్‌బంధన్

ప్రతిపక్షాలపై మోడీ దాడి



మడగావ్ : అవినీతిపరులు, తిరోగమన వాదుల జట్టు కలయికనే మహాఘట్‌బంధన్ అని ప్రధాని నరేంద్ర మోడీ విమర్శించారు. కోల్‌కతాలో శనివారం మమత బెనర్జీ నాయకత్వంలో జరిగిన ప్రతిపక్ష ర్యాలీపై ప్రధాని విరుచుకుపడ్డారు. గోవాలోని బిజెపి కార్యకర్తలతో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదివారం ముచ్చటించారు. అనేక కేసులలో అవినీతిపరులు అయిన వారు. దేశాన్ని వెనుకకు నడిపించాలనుకునేవారు మహా కూటమిగా జట్టుకట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రతిపక్షాలకు వచ్చే ఎన్నికలలో ఓటమి తప్పదనే భయం పట్టుకుంది. అందుకే అనేక రకాల నాటకాలకు దిగుతున్నారని ఏవో సాకులతో తమ మీద పడ్డ మచ్చలను తొలిగించుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ నేతలకు దేనిపైనా నమ్మకం లేదని , చివరికి ప్రజాస్వామిక వ్యవస్థలో కీలకమైన ఎన్నికల యంత్రాంగపు వినియోగిత ఇవిఎంలపై కూడా నమ్మిక లేదని అన్నారు. బిజెపి ఒక్కపార్టీతో తలపడేందుకు పలు పార్టీలు ఒక్కటి కావడం వారి అసమర్థత, వారి మంద రాజకీయాలకు పరాకాష్ట అని విమర్శించారు. మోడీని దింపేందుకు కలిసికట్టుగా వస్తున్న వారికి నిజానికి సరైన నైతికత ఉందా? అని నిలదీశారు. అనైతికులకు తలపడే సామర్థ్యం ఉండదని తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను తప్పుపట్టి, ఓటమిని తిట్టుకునే వారు గెలిచేందుకు నానా పాట్లు పడుతున్నారని అన్నారు. అవినీతి , తిరోగమన పరులు, అస్థిరత్వపు కుట్రదార్లు కలిసి చేరుతున్నారు. ఒకరంటే ఒకరికి పడని వారికి మోడీ అంటే పడని కారణంతో ఇప్పుడు మహా ఘట్‌బంధన్ వేదికగా మారిందన్నారు. ప్రతిపక్షాలది ధనశక్తి మది జనశక్తి అని, ఇందులో గెలుపెవరనేది త్వరలోనే తేలుతుందన్నారు. అనారోగ్యంతో ఉన్న గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ త్వరితగతిన కోలుకోవాలని తాను ఆశిస్తున్నట్లు ప్రధాని చెప్పారు. ఆయన ఆధునిక గోవా నిర్మాత అని కితాబు ఇచ్చారు.

ఎయిమ్స్ నుంచి అమిత్ షా డిశ్చార్జి



న్యూఢిల్లీ : స్వైన్ ఫ్లూతో బాధపడుతూ ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరిన భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా ఆదివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. 'స్వైన్ ఫ్లూ నుంచి కోలుకున్న షాను ఆదివారం ఉదయం 10 గంటల 20 నిముషాలకు డిశ్చార్జి చేశాము' అని ఎయిమ్స్ అధికారి ఒకరు వెల్లడించారు. డిశ్చార్చి అయ్యాక ట్వీట్ చేస్తూ అమిత్ షా తను పూర్తి ఆరోగ్యంతో ఉన్నానని, ఇంటికి చేరుకున్నానని పేర్కొన్నారు. తను కోలుకోవాలని ఆకాంక్షించిన అందరికీ అమిత్ షా కృతజ్ఞతలు తెలిపారు. బిజెపి నాయకుడు, పార్టీ ఐటి సెల్ ఇన్‌ఛార్జి అమిత్ మాలవియా మాట్లాడుతూ ..షా ఆరోగ్యంగా ఉన్నారని, ఎయిమ్స్‌లో చికిత్స తర్వాత ఇంటికి చేరుకున్నారని అన్నారు. శ్వాస తీసుకోడానికి ఇబ్బంది కలగడంతో షాను బుధవారంనాడు ఎయిమ్స్‌లో చేర్పించారు.

అత్యాచార బాధితురాలు, ఆమె భర్తకు రక్షణ కల్పించండి

హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : జమ్మూకశ్మీర్‌కు చెందిన అత్యాచార బాధితురాలు,ఆమె భర్తకు రక్షణ కల్పించాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. తమ స్వస్థలాన్ని విడిచి వచ్చేందుకు దారి తీసిన పరిస్థితులను కోర్టుకు తెలిపిన దంపతులు పోలీస్ అధికారులు, రాజకీయ కార్యకర్తలపై తీవ్ర ఆరోపణలు చేశారు. తనపై భౌతిక దాడి చేసి అత్యాచారానికి పాల్పడిన నిందితుడు కొద్ది రోజులు జైలులో ఉండి ఇటీవల బయటకు వచ్చినట్లు బాధితురాలు తెలిపారు. బాధితురాలి కుటుంబానికి వెంటనే తగిన రక్షణ కల్పించడంతోపాటు ప్రభుత్వ న్యాయవాది మినహా ఇతరులెవ్వరికి వారి అడ్రస్ తెలపొద్దని సంబంధిత పోలీసు డిసిపిని కోర్టు ఆదేశించింది.

అంతర్రాష్ట్ర వంతెనను ప్రారంభించనున్న గడ్కరీ



జమ్మూ : జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో రావి నదిపై 1.2 కి.మీ పొడవైన కీడియాన్ గండియాల్ వంతెనను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ జనవరి 22న ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. కథువా జిల్లాతో పంజాబ్‌ను కలిసే అంతర్రాష్ట్ర వంతెనను దాదాపు 150 కోట్లతో మూడున్నర ఏళ్లలో నిర్మించినట్లు తెలిపారు. 60 ఏళ్ల పెండింగ్ డిమాండ్ నెరవేరిందని శనివారం వంతెనను సందర్శించిన గవర్నర్ సలహాదారు కేవల్ కుమార్ శర్మ తెలిపారు. దీంతో కథువా–పఠాన్‌కోట్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ తగ్గనుందన్నారు. వంతెన ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు

భార్యను చంపిన భర్త ఆత్మహత్య

వడోదర : గుజరాత్‌లోని వడోదర జిల్లాలో దారుణం జరిగింది. తన భార్యను గొడ్డలితో నరికి చంపి, ఇద్దరు కుమారులను గాయపరిచిన వ్యక్తి రైలు క్రింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. శనివారం కర్జన్ తహసీల్‌కు చెందిన మియాగమ్ గ్రామంలో ఘటన చోటు చేసుకుంది. బలవంత్ రాయ్‌పాల్ సింధా తన భార్య దక్ష (32)ను గొడ్డలితో నరికి చంపినట్లు ఎస్ఐ ఆర్‌జి దేశాయ్ తెలిపారు. తల్లిని రక్షించే క్రమంలో తీవ్రంగా గాయపడ్డ అజయ్ (12), చేతన్ (10) పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. అనంతరం నిందితుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు.



'ఆధార్'తో నేపాల్, భూటాన్ వెళ్లొచ్చు

న్యూఢిల్లీ : నేపాల్, భూటాన్ వెళ్లే 15 ఏళ్ల లోపు, 65 ఏళ్లు దాటిన భారతీయులు ప్రయాణ పత్రాలుగా ఆధార్ కార్డులు వాడవచ్చని, అవి చెల్లుతాయని కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ వయోపరిమితిలో లేని భారతీయులు ఈ పొరుగుదేశాలకు ఆధార్ కార్డ్ సహాయంతో వెళ్లలేరని, వారికి వీసాలు అవసరం లేదని ఇటీవల విడుదల చేసిన ప్రకటన వెల్లడించింది. చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్, భారత ప్రభుత్వం జారీ చేసిన ఫొటో గుర్తింపు కారు లేదా ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఐడి కార్డు ఉంటే నేపాల్, భూటాన్ వెళ్లే భారతీయులకు వీసా అక్కర్లేదు అని కూడా ఆ ప్రకటన పేర్కొంది. ఇంతకు ముందు...65 ఏళ్ల పైబడినవారు, 15 ఏళ్ల లోపు వారు ఈ రెండు దేశాలకూ వెళ్లేవారు పాన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ సర్వీస్ (సిజిహెచ్ఎస్) కార్డు లేదా రేషన్ కార్డు చూపించాల్సి వచ్చేది. ఆధార్ కార్డ్ అవసరమయ్యేది కాదు. ఇప్పుడు 15 ఏళ్ల లోపువారు, 65 ఏళ్ల పైబడిన వారు చెల్లుబాటు అయ్యే ప్రయాణ పత్రంగా ఆధార్ కార్డును వాడుకోవచ్చు' అని ఆ అధికారి చెప్పారు.

వాల్‌కు సహకరిస్తే..

అక్రమ వలసలపై కరుణ

(మొదటిపేజీ తరువాయి)

దీనిని ప్రత్యక్ష ప్రసారం చేశారు. దేశంలోని అక్రమ వలసదారులకు ఉపశమనం కల్పిస్తామని, వారికి తగు నివాస ధృవపత్రాలు అందిస్తామని అయితే మెక్సికో వాల్ నిర్మాణం జరిగి తీరాల్సిందేనని ప్రకటించారు. ట్రంప్ తాజా ప్రతిపాదనను ప్రతిపక్ష డెమొక్రాట్లు తోసిపుచ్చారు. అమెరికా – మెక్సికో సరిహద్దులలో భారీ స్థాయి కాంక్రీట్ వాల్ నిర్మాణం ద్వారా అక్రమ వలసదార్లను నిరోధించాలని ట్రంప్ సంకల్పించారు. అయితే దీనికి అమెరికా కాంగ్రెస్‌లో బలం పుంచుకున్న ప్రతిపక్ష డెమొక్రట్ల నుంచి వ్యతిరేకత వ్యక్తం అయింది. దీనితో దేశంలో షట్‌డౌన్ ప్రకటించారు. ఈ నెలరోజుల షట్‌డౌన్‌తో పలు ఆర్థిక వ్యవహారాలకు చిక్కులు ఏర్పడ్డాయి. ఈ దశలో ట్రంప్ తమ రాజీ చర్యలను వెల్లడించారు. ఇప్పటికే దేశంలోకి అక్రమంగా వచ్చిన వారిని తిప్పిపంపించడం జరగదని, అధికారిక నివాస పత్రాలు లేకపోయినా వారికి రక్షణ కల్పిస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు. తాము కోరుకుంటున్నట్లు వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు కావల్సి ఉందని స్పష్టం చేశారు. చిన్నతనంలోనే అమెరికాకు అక్రమంగా ప్రవేశించిన డ్రీమర్స్‌కు, పలు అంతర్గత ఘర్షణలతో వేరే ప్రాంతాల నుంచి ఇక్కడికి తరలి వచ్చిన వారికి తాత్కాలిక వెసులుబాటు ఉంటుందని ట్రంప్ తెలిపారు. వాల్ నిర్మాణానికి తాము పెట్టిన 5.7 బిలియన్ డాలర్ల నిధులు సమకూరిస్తే అక్రమ వలసదార్లపై ఉక్కు పాదం మోపడం జరగదని చెప్పారు. అమెరికాలో భవిష్యత్తుపై ఆశలు పెట్టుకుని యువప్రాయంలో ఇక్కడికి వచ్చిన డ్రీమర్ల పట్ల, ఇతర దేశాలలో అనేక రకాల ఇబ్బందులు, ప్రకృతి వైపరీత్యాలతో వచ్చిచేరిన వారికి ఇప్పటివరకూ ఉన్న తాత్కాలిక రక్షణ కొనసాగించడం జరుగుతుందని వివరించారు. అత్యవసరంగా 800 మిలియన్ డాలర్ల నిధులు మానవతా చర్యలకు కావాల్సి ఉంది. ఇక మాదక ద్రవ్యాల తనిఖీల సాంకేతిక పరిజ్ఞాన ప్రక్రియకు 805 మిలియన్ డాలర్లు అవసరం. ఈ నిధులతో అమెరికారేవుల గుండా డ్రగ్స్ చేరవేత కట్టడి చేయవచ్చునని తెలిపారు.ప్రస్తుత పరిస్థితి నేపథ్యంలో తాను అత్యంత విజ్ఞతతో కూడిన రాజీ ప్రతిపాదన చేస్తున్నట్లు, దీనిని దేశంలోని రెండు పార్టీలూ అంటే రిపబ్లికన్లు, డెమొక్రట్లు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందని సూచించారు. దేశ సరిహద్దు భద్రతను ఇనుమడింపచేయాల్సి ఉంది. ఇందుకు పలు రకాలైన చర్యలు చేపట్టడం జరుగుతుంది. దీనికి అంతా సహకరించాలని కోరారు. దేశంలో సమగ్ర



అంతకు మించిన వాస్తవిక దృక్పథపు వలస విధానం ఉండాలనేదే తమ ఆలోచన అని, , దీనికి ఆరంభసూచకంగానే ముందు నమ్మిక కల్పించడం, సద్భావనను రేకెత్తించడం జరుగుతుందని, ఈ దిశలోనే అన్ని చర్యలూ చేపడుతామని తెలిపారు. దేశంలోని రెండు రాజకీయ పక్షాలు భేషజాలకు వెళ్లకుండా కలిసికట్టుగా వ్యవహరించాల్సి ఉంది. ఇప్పటి ప్రతిష్టంభను తొలిగించేందుకు తాను చిత్తశుద్ధితో రంగంలోకి దిగానని ట్రంప్ చెప్పారు. దేశ భవిష్యత్తును అంతా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. తీవ్రవాద శక్తుల నుంచి రక్షించుకోవల్సి ఉంటుంది. దుష్టశక్తులతో రాజీధోరణి, అడ్డూ అదుపూ లేని సరిహద్దులలో విషమ సమస్యలు తలెత్తుతాయని ట్రంప్ హెచ్చరించారు. డ్రగ్స్ అక్రమ రవాణా అవుతాయి. అక్రమంగా మనుష్యులు తరలివస్తారు. పలు రకాల నేరాలకు వీలేర్పడుతుంది. దీనిని ఎవ్వరైనా ఎందుకు సమ్మతిస్తారు? అని ట్రంప్ నిలదీశారు. సమస్య పరిష్కారానికే తాను ఇప్పుడు ఈ ప్రసంగం చేస్తున్నానని, ఇకనైన కాంగ్రెస్ వారు షట్‌డౌన్ ఎత్తివేతకు తగు విధంగా స్పందించాల్సి ఉందన్నారు. సరిహద్దు సంక్షోభాన్ని నివారించాలని విజ్ఞప్తి చేశారు. ఏ కోణంలో చూసినా వాల్ నిర్మాణం సమర్థనీయమేనని ట్రంప్ తేల్చిచెప్పారు. మన కీలక సరిహద్దులను అతివాదులు కంట్రోలు చేయడం కుదరదు. గోడ నిర్మాణం అనైతికం అన్పించుకోదు. నిజానికి అనైతిక అక్రమ కార్యకలాపాలకు , పలువురి ప్రాణాల రక్షణకు ఇది పెట్టని కోట అవుతుందన్నారు.

ఏడు లక్షల మందికి మూడేళ్ల ఉపశమనం

తమ డిమాండ్ మేరకు వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తే ఇందుకు బదులుగా అక్రమవలసదార్లకు ఊరట దక్కుతుందని ట్రంప్ తెలిపారు. చిన్నతనంలోనే ఇక్కడికి చేరుకున్న ఏడు లక్షల మందిపై మూడేళ్ల పాటు చర్యల నిలిపివేత (డిఎసిఎ) ఉంటుందని వివరించారు. చాలా కాలం క్రితం చట్టవ్యతిరేకంగా చిన్నతనంలో ఇక్కడికి వచ్చిన వారికి ఈ ఉపశమనం ఉంటుందన్నారు. ఈ మూడేళ్ల కాలంలో వారు ఉద్యోగాలు చేసుకోవచ్చు. సామాజిక భద్రతా కార్డులు అందిస్తారు. వారిని తిప్పిపంపించడం జరగదని హామీ ఇచ్చారు. ఇప్పుడున్న అక్రమవలసదార్లకు మూడేళ్ల రక్షణ ప్రతిపత్తిని కల్పించడం జరుగుతుంది. దేశంలో నుంచి తిప్పిపంపించాల్సిన మూడు లక్షల మంది అక్రమ వలసదార్లపై మూడేళ్ల పాటు చర్యలు నిలిపివేయడం జరుగుతుంది. ఈ లోగానే చట్టసభలో సమగ్రమైన ఇమ్మిగ్రేషన్ పద్ధతికి వీలేర్పడుతుందని వివరించారు. సమగ్రతతో కూడిన వలస విధానం అందరికీ ఆమోదయోగ్యం అవుతుంది కదా అని పేర్కొన్నారు. చట్టబద్ధం, నియంత్రిత ప్రవేశాలు కొనసాగుతూ ఉంటాయని, దీనితో రైతాంగానికి, ద్రాక్ష తోటలకు ముప్పు వాటిల్లకుండా ఉంటుందన్నారు.

రెండు వేల మైళ్ల సరిహద్దు గోడ

అమెరికా దక్షణ సరిహద్దులలో అత్యంత పటిష్టమైన సరిహద్దు గోడ నిర్మాణం అత్యవసరం. ఈ కాంక్రీటు వాల్ నిర్మాణం రెండు వేల మైళ్ల పొడవునా సముద్రం నుంచి సముద్రం వరకూ ఉంటుందన్నారు. ఇందుకు తాము 5.7 బిలియన్ డాలర్ల నిధులు కోరుతున్నామన్నారు. ఇది అక్రమదార్ల అడ్డుకట్టగా ఉంటుంది. దీనిని సరిహద్దు గోడగా అనుకోవచ్చు. సరిహద్దులు భౌగోళికంగా పర్వతాలు, జలాలతో దుర్భేధ్యంగా ఉన్నాయి. మిగిలిన చోట్ల ఈ నిర్మాణ ప్రక్రియ జరగాల్సి ఉంది. ఇది కాంక్రీటు నిర్మాణంగా ఉంటుందని ట్రంప్ తెలిపారు. షట్‌డౌన్ తొలిగిపోతే తాను ఇమ్మిగ్రేషన్ వ్యవస్థ సంస్కరణలపై దృష్టి పెడుతామని ట్రంప్ మాట ఇచ్చారు.

పనికిరాని ప్రతిపాదన : డెమొక్రాటిక్ పార్టీ

ట్రంప్ ఇంతటి సంక్షోభంలోనూ మొండిగానే వ్యవహరిస్తున్నారని , ముందుగా వలసవిధానంపై చర్చలు ఆరంభించాలని ప్రతిపక్ష డెమొక్రాటిక్ పార్టీ పేర్కొంది. షట్‌డౌన్ నివారణకు ట్రంప్ చేసిన ప్రతిపాదనలు నిరర్థకం అని విమర్శించింది. ట్రంప్ రాజీ మార్గం సముచితంగా లేదని, దీనిని తోసిపుచ్చుతున్నామని అన్నారు. ప్రభుత్వాన్ని స్తంభింపచేసిన ఘనతను ప్రెసిడెంట్ మూటగట్టుకున్నారని, దీనిని నివారించాల్సిన బాధ్యత ఆయనపైనే ఉందని ప్రతినిధుల సభ స్పీకర్ , డెమొక్రట్ నాన్సీ పెలోసీ స్పష్టం చేశారు. తాము ఇంతకు ముందు తోసిపుచ్చిన వాటినే కలగలిపి ఇప్పుడు ట్రంప్ ఇప్పటి ఫార్ములాతో వచ్చారని విమర్శించారు. దీనితో అంతా కుంటుపడుతుంది. డ్రీమర్లకు శాశ్వత పరిష్కారం లేని మాటకు దిగారు. మన దేశానికి అవసరం అయిన తాత్కాలిక శరణార్థులకు ఎటువంటి శాశ్వత ఉపయుక్త చర్యను ప్రకటించలేదన్నారు. షట్‌డౌన్‌తో ప్రెసిడెంట్ ఎందరో అమెరికన్ల మనోభావాలను దెబ్బతీశారని సెనెట్ మైనార్టీ లీడర్ సెనెటర్ ఛుక్ షుమెర్ విమర్శించారు. అమెరికా ఉద్యోగులు, కార్మికులు ఇతర వర్గాలు ప్రస్తుత సంక్షోభంతో దెబ్బతిన్నారని, ఎందరో కాంట్రాక్టర్లు, లక్షలాది మంది పౌరులు అయోమయంలో పడ్డారని ప్రతిపక్ష సెనేటర్లు మార్క్ ఆర్ వార్నెర్, టిమ్ కైనెలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందరో ఎదుర్కొంటోన్న కష్ట నష్టాలను అర్థం చేసుకోవడంలో దేశాధ్యక్షుడు విఫలం అయ్యారని, ఇంత కంటే బాధ్యతారాహిత్యం మరోటి ఉంటుందా? అని ప్రశ్నించారు.

మాయా హిజ్రా కన్నా హేయం

- బిజెపి మహిళా ఎమ్మెల్యే కరకు వ్యాఖ్య
- తీవ్రస్థాయిలో నిరసనలు
- మహిళా కమిషన్ నోటీసు?

చందౌలీ : బిఎస్‌పి అధినేత్రి మాయావతి కొజ్జా కన్నా కడుహీనం అని బిజెపి ఎమ్మెల్యే ఒకరు పరుష పదజాల ప్రయోగానికి దిగారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఉత్తరప్రదేశ్‌లోని మొఘల్‌సరాయ్ బిజెపి మహిళా ఎమ్మెల్యే సాధనా సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. మాయావతికి ఇంగితజ్ఞానం లేదని, 1995లో లక్నో గెస్ట్‌హౌస్‌లో సమాజ్‌వాది పార్టీ కార్యకర్తలు మాయావతిపై దాడికి దిగారని, అయితే దీని గురించి కూడా పట్టించుకోకుండా ఆమె అధికారపు యావతో ఇప్పుడు ఎస్‌పితో నెయ్యానికి దిగారని విమర్శించారు. ఈ మాజీ సిఎం కుర్చీ దక్కించుకునేందుకు ఆత్మగౌరవాన్ని కుదువ పెట్టుకున్నారని, కొట్టినంత పనిచేసిన వారిని దగ్గరికి తీసుకున్నారని , అటువంటి ఆమె ఆడజాతికే కళంకం అని, ఈ పద్ధతి చూస్తూ ఉంటే ఆమెను ఆడ అనాలా? మగ అనాలా? అంటూ ఇటూ కానీ కొజ్జా అనుకోవాలా? అంటూ ఈ బిజెపి నానా విధాలుగా విమర్శలకు దిగాడు. యుపిలోని అధికార పార్టీ ఎమ్మెల్యే మాటలపై పలువురు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ ఎమ్మెల్యే ఇటువంటి వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదని కేంద్ర మంత్రి, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు రామ్‌దాస్ అతావాలే స్పందించారు. విమర్శలు పరిమితిలో ఉండాలని సూచించారు. బిఎస్‌పి నేత ఎస్‌సి మిశ్రా ఒక ప్రకటన వెలువరిస్తూ బిఎస్‌పి–ఎస్‌పి పొత్తుతో బిజెపి వారికి మతి స్థిమితం తప్పిందని, అందుకే అడ్డగోలుగా మాట్లాడుతున్నారని అన్నారు. రెండు పార్టీల పొత్తుతో బిజెపి పడవ మునక తప్పదన్నారు. తమ కీలక మిత్ర పక్షం బిఎస్‌పి అధినేత్రిపై బిజెపి ఎమ్మెల్యే వ్యాఖ్యలపై ఎస్‌పి నేత అఖిలేష్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి ఎమ్మెల్యే దిగజారుడు మాటలు ఆ పార్టీ వైఖరిని తెలియచేస్తున్నాయని అన్నారు. బిజెపి నేతలలో ఇప్పుడు అసహనం రేపటి గురించి ఆందోళన నెలకొంది.



అందుకే అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ ఎమ్మెల్యే వ్యాఖ్యలు మహిళా లోకానికే అవమానంగా నిలుస్తాయని అన్నారు. ఒక మహిళా ఎమ్మెల్యే అయి ఉండి, తోటి మహిళపై ఇటువంటి మాటలకు దిగడం ఏమి రాజకీయం అన్పించుకుంటుందని ప్రశ్నించారు.

వివరణ ఇచ్చుకో : మహిళా కమిషన్

మాయావతిపై బిజెపి ఎమ్మెల్యే సాధనా సింగ్ వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్ స్పందించింది. ఈ ఎమ్మెల్యేకు తాము నోటీసు పంపిస్తామని, వివరణ తరువాత తగు విధమైన చర్య తీసుకుంటామని కమిషన్ అధ్యక్షురాలు రేఖా శర్మ చెప్పారు. సాధనా సింగ్ అభ్యంతరకరమైన మాటలకు దిగినట్లుగా తెలిసిందని వార్తలు వెలువడ్డాయి. దీనిని పరిగణనలోకి తసుకుని తమంత తాముగా స్పందిస్తున్నామని, ఎమ్మెల్యేకు నోటీసు వెలువరిస్తామని రేఖా శర్మ విలేకరులకు తెలిపారు. ఇటువంటి వ్యాఖ్యలకు అవమానకర వ్యాఖ్యలకు దిగడం నేతల లక్షణం అన్పించుకోదని, గర్హనీయం అని, సాధనా సింగ్‌కు సోమవారం నోటీసు పంపిస్తున్నామని వివరించారు.

గుర్‌గావ్ నుంచి వచ్చిన కర్ణాటక బిజెపి ఎంఎల్‌ఎలు

బెంగళూరు : గత కొన్ని రోజులుగా గుర్‌గావ్‌లో ఒక ప్రైవేట్ రిసార్ట్‌లో ఉన్న కర్ణాటక బిజెపి ఎంఎల్‌ఎలు తిరిగి రాష్ట్రానికి చేరుకున్నారు. 104 మంది కర్ణాటక భారతీయ జనతాపార్టీ ఎంఎల్‌ఎలను తిరిగి రావలసిందిగా రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు చెప్పడంతో శనివారం రాత్రి వారంతా కర్ణాటక చేరుకున్నారని బిజెపి ఎంఎల్‌సి లెహర్ సింగ్ చెప్పారు. 'కొందరు సరాసరి తమ నియోజకవర్గాలకు వెళ్లారు. మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రులు ఆర్. అశోక, కె.ఎస్. ఈశ్వరప్ప బెంగళూరు తిరిగి వచ్చారు' అని ఆయన తెలిపారు. తమ పార్టీ ఎంఎల్‌ఏలకు బిజెపి గాలం వేస్తుందని భయపడిన కాంగ్రెస్ నగర శివార్లలోని ఒక రిసార్ట్‌లో వారిని దాచి ఉంచింది. ఇలా ఉండగా, అధికార సంకీర్ణాన్ని బిజెపి అస్థిరపరచదని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు యద్యూరప్ప చెప్పారు. 'వారికి ఈ విషయంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు' అని యద్యూరప్ప అన్నారు. ఢిల్లీ నుంచి బిజెపి ఎంఎల్‌ఏలను వెనక్కు పిలిపించాలని యద్యూరప్ప తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడు సిద్దరామయ్య హర్షం వ్యక్తం చేశారు.

నలుగురు కాంగ్రెస్ ఎంఎల్‌ఎలకు నోటీసులు

సంజాయిషీ కోరిన కర్ణాటక కాంగ్రెస్

బెంగళూరు : శాసనసభా పక్ష సమావేశానికి ఎందుకు రాలేదో వివరణ ఇవ్వాల్సిందిగా కర్ణాటక కాంగ్రెస్ పార్టీ నలుగురు పార్టీ ఎంఎల్‌ఏలకు నోటీసులు జారీచేసింది. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వారిపై ఎందుకు చర్య తీసుకోకూడదో చెప్పాలని వారికి విజ్ఞప్తి చేసింది. రమేష్ జర్కిహోళి, బి. నాగేంద్ర, ఉమేష్ జాధవ్, మహేష్ కుమటహళ్లి లకు కాంగ్రెస్ పార్టీ ఈ నోటీసులు జారీ చేసింది. ఇటీవల కర్ణాటక మంత్రివర్గంలో జరిగిన మార్పుల్లో రమేష్ జర్కిహోళిని తప్పించడంతో అసంతృప్తిగా ఉన్నారు. పార్టీలో విభేదాలున్నాయన్న కారణం చూపి నలుగురు శాసనసభ్యులు శుక్రవారం జరిగిన కాంగ్రెస్ లెజెస్లేచర్ పార్టీ (సిఎల్‌పి) గైర్హాజరయ్యారని పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో జనతాదళ్ (ఎస్), కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని భారతీయ జనతా పార్టీ కూల్చే ప్రయత్నంలో ఉందని వార్తలు వస్తున్న నేపథ్యంలో తన బలాన్ని నిరూపించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ శుక్రవారం సిఎల్‌పి సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సిఎల్‌పి సమావేశానికి నలుగురు ఎంఎల్‌ఏ లు హాజరు కానంత మాత్రాన నంబర్ గేమ్ పరంగా కర్ణాటక సంకీర్ణ ప్రభుత్వానికి వెంటనే ముప్పు లేనప్పటికీ, ఇప్పటికీ అసమ్మతితో సతమతమవుతున్న కాంగ్రెస్ పార్టీలో అంతా సజావుగా లేదన్న సంకేతం వెలువడినట్టయిం ది. జర్కిహోళి సమావేశానికి హాజరు కాకపోవడానికి కారణాన్ని చెప్పాలని, అలాగే ఆయన బిజెపిలో చేరబోతున్నట్టు మీడియాలో వచ్చిన సమాచారానికి, కాషాయ దళ నాయకులను కలుసుకునేందుకు ఢిల్లీ, ముంబ యి వెళ్లడం పైనా సంజాయిషీ ఇవ్వాలనీ సిఎల్‌పి నాయకుడు సిద్దరామయ్య జర్కిహోళిని కోరారు. మీడియాలో వచ్చిన కథనాలను ఖండిస్తే ఇంతవరకూ ఎందుకు ప్రకటన చేయలేదని సిద్దరామయ్యను విలేకరులు అడిగారు. 'జర్కిహోళి తనకు తానుగా పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నట్టు ఆయన ప్రవర్తన సూచిస్తోంది. ఆయన కాంగ్రెస్ నుంచి ఎంఎల్‌ఏగా ఎన్నికయ్యారు. రాజ్యాంగం ప్రకారం ఆయన పార్టీ సభ్యత్వం విడిచిపెట్టకూడదు' అని సిఎల్‌పి నాయకుడన్నారు. సమావేశానికి హాజరు కాకుంటే దాన్ని తీవ్రంగా పరిగణిస్తామని, ఫిరాయింపుల నిరోధక చట్టం కింద చర్య తీసుకుంటామని సమావేశానికి ముందు సిద్దరామయ్య పార్టీ ఎంఎల్‌ఏలకు సిద్దరామయ్య నోటీసులు పంపారు. సమావేశానికి 76 మంది కాంగ్రెస్ ఎమ్మెల్‌ఏలు హాజరయ్యారు. ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం బిజెపి ఉందని వార్తలు వస్తున్న నేపథ్యంలో సమావేశం జరిగిన వెంటనే ఎంఎల్‌ఏలను నగర శివార్లలోని ఒక రిసార్ట్‌కు తరలించారు.


కుమ్ములాటలతోనే కూలిపోతుంది: ఈశ్వరప్ప

అంతర్గత కుమ్ములాటలతో కర్ణాటకలోని కాంగ్రెస్, జెడి(ఎస్) ప్రభుత్వం కూలిపోతుందని, రాష్ట్రంలో తమ పార్టీ ప్రభుత్వం ఏర్పడుతుందని కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి, బిజెపి నాయకుడు కెఎస్ ఈశ్వరప్ప తెలిపారు. అకారణంగా బిజెపిపై ఆరోపణలు చేస్తున్నారని, ప్రభుత్వాన్ని కూల్చే అవసరం తమ పార్టీకి లేదని ఈశ్వరప్ప చెప్పారు.

శనివారం రాత్రి బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో మాట్లాడుతూ తమ పార్టీకి చెందిన 104 మంది ఎంఎల్‌ఏలు పార్టీలోనే ఉన్నారని చెప్పారు.

గత ఏడు నెలలుగా పాలనలో విఫలమైన కర్ణాటక ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే హక్కులేదని మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రి ఆర్ అశోక అన్నారు. జెడి (ఎస్)– కాంగ్రె స్ సంకీర్ణ ప్రభుత్వం కూలిపోతుందన డంలోఎలాంటి సందేహం లేదని, లేకుంటే రిసార్ట్‌లో తమ ఎంఎల్‌ఏలను దాచాల్సిన అవసరం ఏమొచ్చిందని ఎంఎల్‌ఏ కుమార బంగారప్ప ప్రశ్నించారు

రిసార్ట్‌లో కొట్టుకున్న ఎమ్మెల్యేలు



బెంగళూరు : రిసార్ట్ రాజకీయాలు, రాజకీయ డ్రామాలు, పార్టీల్లో అంతర్గత పోరాటాలు కర్ణాటకకు కొత్తేమీ కాదు. ఈసారి మాత్రం ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య మాటామాటా పెరిగి, ఆ తర్వాత కలబడటంతో వారిలో ఒకరు ఆసుపత్రి పాలయ్యారు. బెంగళూరు ఈగల్ రిసార్ట్‌లో జరిగిన పార్టీలో పాల్గొన్న విజయనగర ఎమ్మెల్యే ఆనంద్ సింగ్, కాంపి ఎమ్మెల్యే జెఎన్ గణేష్‌లు ఆదివారం తెల్లవారుజామున గొడవ పడ్డారు. బీజేపీకి ఫిరాయించేందుకు గణేష్ ప్రయత్నిస్తున్నారన్న విషయంపై ఇద్దరి మధ్యా వాగ్వాదం చెలరేగింది. ఈ ఘర్షణలో గణేష్ మద్యం బాటిల్ తీసుకుని ఆనంద్ సింగ్ తలపై మోదినట్టు పార్టీ వర్గాల సమాచారం. గాయపడిన ఆనంద్ సింగ్‌ను శేషాద్రిపురంలోని అపోలో ఆసుపత్రిలో చేర్చారు. ఉదయం 7.05 గంటలకు ఆసుపత్రికి వచ్చిన ఆనంద్ సింగ్‌ను ఇన్‌పేషెంట్ బ్లాక్‌లో చేర్చగా, ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నట్టు తెలుస్తోంది. పలువురు ఎమ్మెల్యేలు బీజేపీలో చేరవచ్చంటూ పెద్దఎత్తున ఊహాగానాలు చెలరేగడంతో గత శుక్రవారం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఈగల్టన్ రిసార్ట్‌లో ఉంచారు. బలనిరూపణ కోసం ఈగల్టన్ రిసార్ట్‌కు రావాలంటూ తమ ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ పార్టీ విప్ జారీ చేసింది. కాగా, రిసార్ట్‌లో తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు బాహాబాహీగా దిగారన్న వార్తలను కాంగ్రెస్ కొట్టిపారేసింది. ఇద్దరు ఎమ్మెల్యేలు కొట్టుకున్నారన్న వార్తల్లో ఎంత మాత్రం నిజం లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డీకే శివ కుమార్ మీడియాకు తెలిపారు. 'గొడవా లేదు, దాడులూ లేవు, లిక్కర్ బాటిళ్లూ లేవు. మీరంటున్న ఇద్దరు ఎమ్మెల్యేలే మీడియాకు వివరణ ఇస్తారు. ఛాతీ నొప్పితోనే మా ఎమ్మెల్యే ఆసుపత్రిలో చేరారు' అని ఆయన చెప్పారు. కాగా, ఆసుపత్రిలో చేరిన ఆనంద్ సింగ్‌ను డీకే శివకుమార్ సోదరుడు, కనకపుర ఎమ్మెల్యే డీకే సురేష్ సహా పలువురు నేతలు పరామర్శించారు.

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666